# మహిళా -ఐసిటి

## సవాళ్ళు - సాధన

# మహిళా పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం

### విధానకర్తల ట్రాక్

### మాడ్యూల్ పి

ఐక్యరాజ్యసమితి
ఎపిసిఐసిటి - ఎస్కాప్

# మాడ్యూల్ పి1 :

# మహిళా పారిశ్రామిక,

# వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం

ఉషారాణి వ్యాసులురెడ్డి

**మహిళలు-ఐసిటి హద్దులు, చొరవలు : విధానకర్తల ట్రాక్**

**మాడ్యూల్ పి 1 : మహిళా పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం**

క్రియేటివ్ కామన్స్ అట్రిబ్యూషన్ 4.0 ఇంటర్నేషనల్ లైసెన్స్ కింద విడుదల చేసిన పత్రం ఇది.

ఈ లైసెన్సుకాపీని చూడాలంటే http://creativecommons.org/licences/by/4.0/. సందర్శించండి.

ఇందులో వెలువరించిన అభిప్రాయాలు, గణాంకాలు, అంచనాలు ఆయా రచయితల వ్యక్తిగతమైనవి. ఐక్యరాజ్యసమితి అనుమతితోనే వాటిని పొందుపరిచారని విశ్వసించాల్సిన అవసరం లేదు.

ఈ పత్రంలో ప్రకటించిన ఆయా వ్యక్తుల హోదాలు, పత్రంలో వారు ప్రకటించిన అభిప్రాయాలు ఐక్యరాజ్యసమితి సచివాలయం లేదా ఏదైనా దేశం లేదా ప్రాంతం లేదా నగరం లేదా ప్రదేశానికి, అధికారులు లేదా ప్రాంతీయ, భౌగోళిక సరిహద్దులు పరిమితులకు లోబడినవి కావు.

ఇందులో ప్రస్తావనకు వచ్చిన సంస్థల పేర్లు, వాణిజ్య ఉత్పత్తులు కూడా ఐక్యరాజ్యసమితి అనుమతికి లోబడినవి కావు.

**సంప్రదించండి:**

United Nations Asian and Pacific Training Center for Information and Communication Technology for Development (UN-APCICT/ESCAP)
5 th Floor, G-Tower, 175 Art Centre Daero, Yeonsu-gu, Incheon, Republic of Korea
Tel : +82 32 458 6650
FaX : +82 32 458 6691/2
E-mail : info@unapcict.org
http:/www.unapcict.org

Copyright UN-APCICT/ESCAP 2016

ISBN : (to be added)

Design and Layout : Scand-Media Corp.,Ltd and Mr.Lowil Espada

Printed in : Republic in Korea

## ముందుమాట

మహిళల్లో పారిశ్రామిక, వ్యాపార ధోరణులు సానుకూల సామాజిక పరివర్తనకు మౌలిక శక్తి. మహిళా పారిశ్రామిక, వ్యాపారవేత్తల్లో చాలా మంది నవ్యంగా ఆలోచించడంతో పాటు ఎలాంటి అవరోధాలనైనా దీటుగా ఎదుర్కొనేందుకు, జీవితకాలం అభ్యాసం చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. వారి గెలుపు ప్రభావం సమాజంపై బహుముఖీనంగా ఉంటుంది. పిల్లల ఆరోగ్యం, విద్యారంగాల్లో గృహసంబంధిత పొదుపు, పెట్టుబడులు పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగేందుకు తద్వారా జాతీయ జిడిపి మరింతగా పెరిగేందుకు దోహదపడుతుంది.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఆరోగ్యం, విద్యా విభాగాల్లో లింగవ్యత్యాసం కొంతమేరకు తగ్గినప్పటికీ ఆర్థిక అవకాశాల్లో -కార్మికశక్తిలో భాగం, తక్కువ వేతనాలు, ప్రమాదరకమైన వృత్తులు, ఆర్థిక/రుణ అవకాశాల పరిమితులు- మాత్రం పురుషుల కన్నా స్త్రీలు వెనుకబడే ఉన్నారు.

ప్రస్తుత, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన ఆర్థిక, సామాజిక, పర్యావరణపరమైన అభివృద్ధిని అందించాలన్నది సుస్థిర అభివృద్ధి సాధన కోసం రూపొందించిన 2030 అజెండా కీలక లక్ష్యం. గత 20 సంవత్సరాల కాలంలో లింగవ్యత్యాసంలో చెప్పుకోదగ్గ మార్పు ఏదీ లేకపోయినా ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో ఈ లక్ష్య సాధన మరింత సవాలుతో కూడుకున్నదే. అసమానతలు ఆర్థిక చలనశీలత, సామాజిక అనుసంధానం, పర్యావరణ స్థిరత్వ సాధనకు అవరోధంగా ఉన్నాయి. సమాజంలో లోతుగా పాతుకుపోయిన ఈ అసమానతలను తొలగించాలంటే పేదరికం మూలాలను, వివక్షను రూపుమాపేందుకు, సామాజిక దాడులకు అవకాశం గల వర్గానికి భద్రత కల్పించేందుకు కృషి చేయాలి. అభివృద్ధితో ముడిపడి ఉన్న అన్ని విభాగాల్లోను అవకాశాలు మెరుగుపరచాలంటే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాలు, నవకల్పనలు, సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐసిటి) విస్తృతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది.

సమాజంలోని కొన్ని వర్గాలు ఐసిటి అందుబాటులో లేని కారణంగా నష్టపోతున్న మాట వాస్తవమే అయినప్పటికీ సామాజిక-ఆర్థికాభివృద్ధి, సామాజిక భాగస్వామ్యం, సాధికారికత సాధనకు ఐసిటిని సమర్థవంతమైన సాధనంగా ఉపయోగించుకోవాలి. మహిళా వ్యాపారవేత్తలకు వ్యాపారాల నిర్వహణలో మౌలిక పరిజ్ఞానం కల్పించేందుకు, ఐసిటి నైపుణ్యాలను అలవరిచేందుకు, ఆన్‌లైన్ వనరులు అందుబాటులోకి తెచ్చేందుకు అభివృద్ధి సాధనకు ఐసిటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న ఆసియా పసిఫిక్ శిక్షణ సంస్థ (ఎపిసిఐసిటి) మహిళలు మరియు ఐసిటి ఫ్రాంటియెర్ ఇనీషియేటివ్ (వైఫై) పేరిట ఒక కార్యక్రమం చేపట్టింది. మహిళల పురోగతికి అవరోధంగా ఉన్న వ్యవస్థాత్మకమైన అంశాలను పరిష్కరించేందుకు అనుకూలమైన విధానాల రూపకల్పనను కూడా ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తోంది.

మహిళల్లో పరిపూర్ణమైన సుసంపన్నత, ఆర్థిక పురోభివృద్ధి సాధనకు అవసరమైన ఐసిటి నైపుణ్యాలు, పారిశ్రామిక పరిజ్ఞానం కల్పనకు అనుగుణంగా ఈ వైఫై మాడ్యూల్స్ ఉన్నాయి. అందరికీ సమానావకాశాలు, సమాన ప్రయోజనాలు గల సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తును అందించడంలో ఈ వైఫై ఒక కీలక మైలురాయిగా నిలుస్తుంది.

హ్యూన్-సుక్ రీ

డైరెక్టర్

యుఎన్-ఎపిసిఐసిటి/ఇఎస్‌సిఏపి

## మాడ్యూల్ గురించి...

మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు ఐసిటి సాధికారిక వాతావరణం కల్పించేందుకు లింగసమానత్వం అందించగల విధానాలకు సంబంధించిన పరిజ్ఞానం కల్పించడం, విధాన రూపకర్తలకు అవసరమైన మద్దతు ఇవ్వడం ఈ మాడ్యూల్ ప్రధాన లక్ష్యం.

ఈ మాడ్యూల్‌లో పరిచయం, ముగింపుతో కలిపి నాలుగు ప్రధాన అధ్యాయాలున్నాయి. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు దీటుగా లింగసమానత్వం, సాధికారిక సాధనకు సంబంధించిన భావనను మొదటి అధ్యాయం పరిచయం చేస్తుంది. రెండో అధ్యాయం మహిళలు, సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీల (ఐసిటి) సమన్వయం, ఐసిటి వినియోగంలో లింగవ్యత్యాసం గురించి వివరిస్తుంది. లింగసమానత్వం అందించే విధానాల రూపకల్పన ప్రాధాన్యాన్ని మూడో అధ్యాయంలోను, ఐసిటి వినియోగంతో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు నాలుగో ఆధ్యాయంలోను ప్రస్తావించారు.

ఈ అధ్యాయంలో ప్రస్తావించిన భావనలు, అంశాలకు మద్దతుగా వాస్తవిక ప్రపంచంలోని ఉదాహరణలు, కేస్‌స్టడీలు కూడా పొందుపరచడం జరిగింది. ప్రతీ అధ్యాయం చివరన ఇంటరాక్టివ్ అభ్యాసాలున్నాయి. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్న వారికి చక్కని శిక్షణ ఇచ్చేందుకు, స్థానిక భాషల్లో ఈ అంశాలను అందుబాటులోకి తెచ్చేందుకు మాడ్యూల్ చివరన శిక్షకులకు సూచనలు పొందుపరిచారు.

**అభ్యాసానంతర ఫలితం**

ఈ మాడ్యూల్ పూర్తయ్యే సమయానికి అభ్యాసకునికి ఈ అంశాలపై అవగాహన కలుగుతుంది.

1. లింగసమానత్వం భావనను తెలియచేస్తూ ప్రభుత్వం అందుకు కృషి చేసేలా ప్రోత్సహిస్తుంది.
2. లింగసమానత్వం ప్రాతిపదికన విధానాల రూపకల్పన, రెగ్యులేటరీ వాతావరణం ఏర్పాటు ఆవశ్యకతను తెలియచేసి అందుకు ప్రభుత్వం కృషి చేసేలా ప్రోత్సహిస్తుంది.
3. ఐసిటి అందుబాటు, వినియోగం ప్రధానంగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు అవసరం అయిన మద్దతు ఇస్తుంది.

## ప్రధాన ప్రేక్షకులు

జాతీయ, స్థానిక విధాన రూపకర్తలు, రెగ్యులేటర్లు, పార్లమెంటేరియన్లు, ప్రభుత్వ అధికారులు

## సమయం

6 గంటలు/ఒక రోజు శిక్షణ

# కృతజ్ఞతలు

ఈ శిక్షణ సరంజామాపై బహుళ దశల్లో సమీక్షలో పాల్గొన్న, దీంతోపాటు ఈ పర్విక‌ను రూపొందించడం కోసం అమూల్యమైన సంసిద్ధక సామగ్రి అందించిన భాగస్వాములందరికీ ఏపిసీఐసీటీ కృతజ్ఞతలు తెలుపుతోంది. అలాగే పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఐసీటీఎస్ ఫర్ డెవలప్‌మెంట్, ఫిలిప్పైన్స్‌కు చెనిదిన కేరీర్ ఎగ్జిక్యూటివ్ సర్వీస్ బోర్డు లకూ ధన్యవాదాలు తెలియజేస్తున్నం. అంతేకాకుండా సంప్రదింపుల సమావేశాలు, నిపుణుల బృందం సమావేశాలు, సదస్సులు, క్షేత్రస్థాయి ప్రయోగాలు తదితరాల్లో పాలుపంచుకున్న భాగస్వాములకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పర్వికకు సంపూర్ణ స్వరూపం ఇవ్వడంలో ఫాహీమ్ హుసేన్, మరియా జానిటా ఆర్.మకపాగల్, ఉషారాణి వ్యాసులురెడ్డి, సయూరి కొక్కో ఒకాడా, జానకి శ్రీనివాసన్ ఎంతగానో సహకరించారు. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాం. అలాగే ఈ పర్వికకు క్రిస్టీన్ ఎపికుల్ తన సంపాదకత్వంలో అద్భుతంగా తీర్చిదిద్దినందుకు ధన్యవాదాలు.

వైపై - మాడ్యూల్ ను తెలుగు భాషలోకి తీసుకురావడానికి కీలకపాత్ర వహించిన ఆచార్య వి. దుర్గాభవానిగారు, ఉపకులపతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్, భారతదేశం వారికి ఆచార్య పి. విజయలక్ష్మి, కమ్యూనికేషన్, జర్నలిజం శాఖవారికి ధన్యవాదాలు. ఈ మాడ్యూల్‌ను సమీక్షించిన డా॥ టి. శోభారాణి, డా. వై. సుభాషిణీలకు కృతజ్ఞతలు.

## భారతదేశంలో వైపై టీమ్

**ఆచార్య ఉషారాణి వ్యాసులురెడ్డి**

**ఆచార్య వి. దుర్గాభవాని,**

కమ్యూనికేషన్, జర్నలిజం శాఖ, శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం

**ఆచార్య పి. విజయలక్ష్మి,**

కమ్యూనికేషన్, జర్నలిజం శాఖ, శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం

# విషయ సూచిక


ముందుమాట

మాడ్యూల్ గురించి

ధన్యవాదాలు

సంక్షిప్త పదాల జాబితా

I. ప్రవేశిక

II. లింగసమానత్వంపై అవగాహన, ఎస్‌డిజిల పరిధిలో సాధికారికత

2.1. లింగభేదం-లింగసమానత్వం

2.2. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి)

2.3. ఎస్‌డిజిలు-మహిళా సాధికారికత

2.4. మహిళా సాధికారికత అంటే ఏమిటి?

2.5. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు ఆర్థిక సమ్మిళితత్వం

III. మహిళలు-ఐసిటి : సమన్వయం

3.1. కమ్యూనికేషన్ వృత్తిలో మహిళా భాగస్వామ్యం

3.2. మీడియాలో మహిళలు, బాలికలకు ప్రచారం

3.3. ఐసిటిల వినియోగంలో లింగ విభజన

3.4. ప్రభుత్వ సర్వీసుల్లో ఐసిటి వినియోగం

3.5. మహిళా సాధికారికతలో ఐసిటి ప్రాధాన్యం

IV. మహిళల కోసం లింగభేదానికి తావు లేని విధానాల రూపకల్పన

4.1. జండర్ మెయిన్‌స్ట్రీమింగ్‌కు బాటలు

4.2. జండర్ మెయిన్‌స్ట్రీమింగ్ దశలు

V. లింగ వివక్షకు తావులేని విధానం రూపకల్పన, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి ఐసిటి వినియోగంపై ప్రణాళిక అమలు

5.1. ప్రభుత్వ పాత్ర: సహాయకారిగా ఉండే చట్టాలు, న్యాయసూత్రాలు

5.2. ఎంఎస్‌ఎంఇ విధానాలు, చట్టం, నిబంధనలు

5.3. డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్

5.4. మౌలిక వసతులు, టెక్నాలజీ

5.5. సామర్థ్యాల నిర్మాణం, వ్యాపారాభివృద్ధి సర్వీసులు

5.6. సేవల అందుబాటు, మార్కెటింగ్

5.7. మహిళా పారిశ్రామికుల కోసం లింగభేదం లేని ఇ గవర్నమెంట్

5.8. అమలు

## VI. సారాంశం

6.1. ప్రధాన చట్టాలు, విధానాలు
6.2. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు ఐసిటి అవకాశం
6.3. లింగసమానత్వం గల విధానాల చిత్రం

**బాక్స్‌ల జాబితా**

బాక్స్ 1 : సుస్థిర అభివృద్ధి అంటే ఏమిటి?
బాక్స్ 2 : ఎస్‌డిజి 5- లింగసమానత్వ సాధన, మహిళలు-బాలికల సాధికారికత
బాక్స్ 3 : జండర్ మెయిన్‌స్ట్రీమింగ్‌లో వాటాదారుల వ్యవస్థ
బాక్స్ 4 : వివాహితులు, అవివాహిత మహిళల మధ్య భేదం

**పట్టికల జాబితా**

ఫిగర్ 1 : ఇంక్లూజివ్ ఫైనాన్స్ పంపిణీ వ్యవస్థ
ఫిగర్ 2 : లింగక్రమంలో ఇంటర్నెట్ అందుబాటు, వినియోగం
ఫిగర్ 3 : నేను ఎక్కడ సరిపోతాను, నా వల్ల ప్రయోజనం ఏమిటి?
ఫిగర్ 4 : లింగవిశ్లేషణలో షా విధానం
ఫిగర్ 5 : ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వాతావరణం

**కేస్‌స్టడీల జాబితా**

కేస్‌స్టడీ 1 : నందిని, ఉబర్‌దోస్త్
కేస్‌స్టడీ 2 : షీలా మరియు ఎలాన్స్
కేస్‌స్టడీ 3 : మార్పు కోసం ఐటి, కర్ణాటకలో (భారత్) ఐసిటి వినియోగం ద్వారా సాధికారికత సంస్కృతిని నెలకొల్పిన ప్రక్రియే
కేస్‌స్టడీ 4 : బంగ్లాదేశ్‌లో ఇన్ఫోలేడీస్
కేస్‌స్టడీ 5 : ఆగ్నేయ భారత్‌లోని థేనిలో గొర్రెల పెంపకందారులు
కేస్‌స్టడీ 6 : ఐసిటి వినియోగం ద్వారా పరివర్తన తెచ్చిన సేవ
కేస్‌స్టడీ 7 : ఆన్‌లైన్ సలహాల వ్యవస్థను అభివృద్ధి చేసిన లిఖాన్
కేస్‌స్టడీ 8 : కంబోడియాలో జండర్ మెయిన్‌స్ట్రీమింగ్
కేస్‌స్టడీ 9 : వియత్నాంలో జండర్ ఆడిట్ టూల్
కేస్‌స్టడీ 10: ఫిలిప్పీన్స్‌లో లింగసమానత్వ బడ్జెట్
కేస్‌స్టడీ 11: ఇండోనేసియాలో జండర్ మెయిన్‌స్ట్రీమింగ్
కేస్‌స్టడీ 12: తమకు అందుబాటులో ఉన్న రుణాల గురించి తెలియని హైదరాబాద్ (భారత్) వెండర్లు
కేస్‌స్టడీ 13: ఎంజిఎన్‌ఆర్‌ఇజిఏలో జండర్ మెయిన్‌స్ట్రీమింగ్
కేస్‌స్టడీ 14: పపూవా న్యూగినియాలో జాతీయ స్థాయిలో మహిళలకు మైక్రోబ్యాంక్ టార్గెట్లు
కేస్‌స్టడీ 15: రొటేటింగ్ సేవింగ్, క్రెడిట్ సంఘం
కేస్‌స్టడీ 16: కివా.ఆర్గ్ ద్వారా క్రౌడ్‌ఫండింగ్
చిహ్నాలు (ఐకాన్లు)

## సంక్షిప్త పదాల జాబితా

| | |
|---|---|
| **ఎడిబి** | ఆసియా అభివృద్ధి బ్యాంకు |
| **ఎపిసిఐసిటి** | అభివృద్ధికారక ఆసియా పసిఫిక్ సమాచారసాంకేతిక పరిజ్ఞాన శిక్షణ కేంద్రం (ఐక్యరాజ్యసమితి) |
| **బిడిఎస్** | బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ |
| **బిపిఓ** | బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ |
| **సిఇడిఎడబ్ల్యు** | మహిళలపై అన్ని రకాల వివక్షల తొలగింపు ఒడంబడిక |
| **ఎస్కాప్** | ఆసియా, పసిఫిక్ ఆర్థిక, సామాజిక కమిషన్ (ఐక్యరాజ్యసమితి) |
| **ఐసిటి** | సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ |
| **ఐటి** | ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ |
| **ఐవిఆర్ఎస్** | ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఎదుటి వ్యక్తితో మాట్లాడుతూ వారికి మాటల్లోనే సమాధానం చెప్పే వ్యవస్థ) |
| **కెవైసి** | నో యువర్ కస్టమర్ (మీ కస్టమర్‌ను తెలుసుకోండి) |
| **ఎండిజి** | సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు |
| **ఎంఎస్ఎంఇ** | సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు |
| **ఎంజిఎన్ఆర్ఇజిఏ** | - మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (భారత్0 |
| **ఎన్‌జిఓ** | ప్రభుత్వేతర సంస్థ |
| **ఒఇసిడి** | ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ |
| **రోస్కా** | రొటేటింగ్ సేవింగ్స్ అండ్ క్రెడిట్ అసోసియేషన్ |
| **ఎస్‌బిపి** | స్టేట్‌బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్ |
| **ఎస్‌డిజి** | సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు |
| **సేవా** | స్వయంఉపాధి పొందిన మహిళల సంఘం |
| **ఎస్ఎంఇ** | చిన్న, మధ్యతరహా పరిశ్రమలు |
| **ఎస్ఎంఎస్** | సంక్షిప్త సందేశ సేవ |
| **యుఎన్‌డిపి** | ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం |
| **యునిసెఫ్** | ఐక్యరాజ్యసమితి బాలల నిధి |

## I. ప్రవేశిక

జాతులు, కులాలు, వర్ణం, ప్రాంతీయం అనే తేడా లేకుండా ప్రపంచ మానవాళిలో సగం మంది మహిళలున్నారు. ఆడ శిశువులు బాలికలుగాను, బాలికలు మహిళలుగాను పరిణామక్రమంలో ఎదుగుతున్నారు. చారిత్రకంగా పురుషులు బయట తిరిగి పనులు చేస్తూ కుటుంబ పోషణను చూస్తుంటే మహిళలు సంతానం కనడం, ఇంటి బాధ్యతలు చూసుకోవడం, వంటావార్పు వంటి పనులకు పరిమితం అవుతున్నారు.

సమాజాలు సాంస్కృతికంగాను, సామాజిక నియమాలకు అనుగుణంగాను, మతపరంగాను పరిణామం చెందుతున్న కొద్దీ ఈ పాత్రలు మరింత సంక్లిష్టంగా మారాయి. తరతరాలుగా సమాజంలో మహిళలు, పురుషులు, బాలబాలికల బాంధవ్యంలో సమతూకం తెచ్చేందుకు పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. నియమనిబంధనలన్నీ పురుషులే రూపొందిస్తున్న కారణంగా చాలా సందర్భాల్లో అధికారాలు ఎక్కువగా పురుషులకే ధారాదత్తం చేస్తూ మహిళలకు సమాన హోదా కల్పించడంలేదు.

లింగసమానత్వంతో కూడిన అంశాలు మహిళలను సమాజ ప్రధాన స్రవంతిలో భాగస్వాములను చేయడానికి అతీతంగా ఉన్నాయి. ఆర్థిక స్వాతంత్ర్యమే కావచ్చు, మహిళలు, బాలికలకు మరింత మెరుగైన విద్యావకాశాలే కావచ్చు, సమాజ పాలనలో మహిళలకు సమాన ప్రాతినిథ్యం కల్పించడమే కావచ్చు...అన్నింటికీ ఈ అంశం విస్తరించింది. సమాజంలో మహిళలు, పురుషులు, బాలబాలికల పాత్రలు, బాధ్యతలు పునర్నిర్వచించాల్సిన అవసరం ఉంది. వారి పాత్రలు, బాధ్యతల విషయంలో పరస్పర గుర్తింపు, గౌరవంతో పాటు ఈ పాత్రలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయన్న వాస్తవాన్ని కూడా గుర్తించాలి. అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ రంగాల్లో పురుషులు, మహిళల మధ్య అసమానతలు తొలగించడం చాలా అవసరం. వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక విభాగాలతో పాటు జీవితంలోని ఇతర కీలకాంశాలపై ఎవరికి అనుకూలమైన పంథాను వారు ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలి.

సాధికారికత విషయానికి వస్తే మొదట పరిశీలనకు వచ్చేవి ఆర్థిక హక్కులు, స్వేచ్ఛ. ఇవి ఎవరికి అనుకూలమైన నిర్ణయాలు వారు తీసుకునే స్వేచ్ఛ కల్పించడంతో పాటు భద్రత కల్పిస్తాయి. సమాజంలో సగం వాటా ఉన్న మహిళలు భాగస్వాములు కానిదే ఏ అభివృద్ధి ఆచరణీయం కాదు. అభివృద్ధి కేంద్రంగా జరిగే చర్చల్లో లింగసమానత్వం, అభివృద్ధి, కమ్యూనికేషన్, ఎండిజిలు, ఎస్‌డిజిలపై సరైన అవగాహన లోపిస్తోంది. ఇలాంటి గోష్ఠుల్లో విశ్లేషకుల మాటలు, మనోభావాల పోరాటం తప్పితే పండితులు, పాలనాయంత్రాంగం నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంటోంది. అభివృద్ధిలో మహిళలు, మహిళలు-అభివృద్ధి, లింగసమానత్వం-అభివృద్ధి ఇలా గోష్ఠికి అంశం ఏదైనా కావచ్చు... సమాజంలో మహిళలకు సంక్రమించాల్సిన మానవ హక్కుల తిరస్కారానికి గురవుతున్నారన్న వాస్తవాన్ని ప్రపంచ సమాజం అంగీకరిస్తోంది. లింగపరమైన అంశాలను పరిష్కరించకపోతే పేదలజీవితాల్లో ఆశిస్తున్న మేరకు అర్థవంతమైన మార్పు సాధ్యం కాదని అంతర్జాతీయసమాజం గుర్తించింది. ప్రపంచ అభివృద్ధి అజెండాకు లింగసమానతే మూలం కావాలి.

సమ్మిళితత్వం, దృఢత్వం, శక్తి వంటి అంశాల గురించి ప్రస్తావించే ఏ అంతర్జాతీయ అభివృద్ధి లక్ష్యాల గురించి మాట్లాడినా అందరూ ముక్తకంఠంతో చెప్పే మాట లింగసమానత్వం గురించే. తాము కట్టుబడిన

లక్ష్యాలసాధనకు జరిగే కృషిలో ప్రభుత్వాలు కీలకపాత్ర వహిస్తాయి. ఈ దిశగా కృషి చేయాలంటే లింగపరమైన అంశాల గురించిన అవగాహన, లింగసమానత్వానికి దారి తీసే విధానాలు, 'స్మార్ట్' ప్రభుత్వం అవసరం.

మహిళా సాధికారికతను ఒఇసిడి మూడు 'ఇ'లుగా -విద్య, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్- వర్గీకరించింది. ఈ మాడ్యూల్‌లో ప్రధానంగా ప్రస్తావించే అంశం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్. మహిళల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడంలో ఐసిటి పాత్ర గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తుంది. లింగసమానత్వంతో కూడిన విధానాల రూపకల్పన, అమలుకు విధానకర్తలు, నిర్ణయాధికారం ఉన్నవారు, ప్రాజెక్టు అమలు సిబ్బంది ఎంత చురుగ్గా వ్యవహరించాలనే అంశం కూడా ప్రస్తావిస్తుంది.

మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ముందుకు నడపడంలో ఐసిటిల వినియోగం రెండో కీలకాంశం. ఐసిటిలను తెలివిగా ఉపయోగించుకుంటే అభివృద్ధి ప్రక్రియలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయని దానిపై ఐదు దశాబ్దాలుగా సాగిన పరిశోధన, అమలుకు సంబంధించిన అనుభవాలు నిరూపిస్తున్నాయి. ముఖ్యంగా గత 20 సంవత్సరాలుగా వివిధ ఆసియా దేశాల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సమర్థవంతంగా ఉపయోగించడం వల్ల త్వరిత అభివృద్ధి చోటు చేసుకుంది. ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, అభివృద్ధి ఏజెన్సీలు, వ్యాపారాల్లో ఈ పనిముట్లు ఎంతగానో ఉపయోగంలో ఉన్నాయి.

ఇ-పాలన లేదా ఐసిటి పనిముట్ల వినియోగం ప్రభుత్వ సర్వీసుల డెలివరీని గణనీయంగా మెరుగుపరిచింది. సత్పరిపాలనలో మౌలికాంశంగా నిలిచింది. ఇ-పాలన వల్ల వివిధ ప్రభుత్వ సంస్థల్లో విస్తృతమైన మార్పులు వచ్చినట్టు స్పష్టంగా కనిపించింది. ప్రధానంగా మహిళలు, బాలికలకు సంబంధించిన అంశాల పరిష్కారం తేలికయింది. అంటే లింగసమానత్వానికి ప్రాధాన్యత ఇచ్చే ఇ-పాలన సత్పరిపాలనలో కీలకాంశంగా నిలుస్తుంది.

ప్రపంచ అభివృద్ధి అజెండాలు ప్రత్యేకించి ఎస్‌డిజిలు, ఐసిటి-లింగన్యాయంతో కూడిన అంశాలకు అనుసంధానత్వం (సెక్షన్లు 2,3) వంటి అంశాలపై త్వరిత చర్చకు ఈ మాడ్యూల్ నాంది పలుకుతుంది. తదుపరి అధ్యాయంలో (సెక్షన్ 4) లింగపరమైన అంశాలకు అమలుకు సంబంధించిన సిద్ధాంతాల గురించి చర్చిస్తుంది. ప్రభుత్వ విధానాలు ప్రత్యేకించి మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడంలో ఐసిటిల పాత్ర, లింగసమానత్వానికి దారి తీసే ప్రభుత్వ విధానాల రూపకల్పన, అమలు గురించి చివరి సెక్షన్‌లో (సెక్షన్ 5) ప్రస్తావన ఉంటుంది.

మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సహాయకారిగా ఐసిటి చొరవల గురించి ప్రస్తావించిన ఇతర మాడ్యూల్స్‌తో పోల్చితే ఈ మాడ్యూల్ కొంత భిన్నంగా ఉంటుంది. ఇందులో ప్రధానంగా విధాన రూపకర్తలకు సహాయపడే అంశాలుంటాయి. లింగపరమైన సాధికారికత ప్రాధాన్యత దిశగా అధికారుల దృష్టిని ఆకర్షిస్తూ అందుకు అనుసరించాల్సిన విధానాలు, ఆచరణ ప్రముఖంగా ప్రస్తావనకు వస్తుంది. మాడ్యూల్ కంటెంట్‌లో కొంత పునరుక్తి ఉన్నప్పటికీ వైరుధ్యం ఏమీ ఉండదు. ఇతర సీరీస్‌లోని కంటెంట్‌కు ఇది మద్దతుగాను, ధ్రువీకరణగాను ఉంటుంది.

# II. లింగసమానత్వం-ఎస్‌డిజిల కోణంలో సాధికారత

**బోధన ఫలితం**

ఈ విభాగాన్ని చదివిన తర్వాత ఈ దిగువ అంశాలపై అవగాహన ఏర్పడుతుంది.

- తాము నివశిస్తున్న దేశాల కోణం నుంచి లింగభేదం/లింగ ప్రాధాన్యం (సెక్స్, జండర్) రెండు పదాలపై అవగాహన ఏర్పడుతుంది.
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజి) గుర్తింపు, లింగసమానత్వ కోణంపై ప్రత్యేక ప్రస్తావన
- ఎస్‌డిజిల నిర్వహణాపరమైన సిద్ధాంతాలపై అవగాహన
- ఎస్‌డిజిలు, మహిళా సాధికారికతల బంధంపై అవగాహన
- ఫైనాన్షియల్ ఇంక్లూజన్, మహిళా సాధికారికత, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోణంలో దాని ప్రాధాన్యతపై అవగాహన

## 2.1. లింగభేదం-లింగ ప్రాధాన్యం

ఈ రెండు పదాలకు చాలా తేడా ఉంది. లింగభేదం అనేది జీవసంబంధమైనది. జనాభాలో పునరుత్పత్తికి సంబంధించినది. అంటే పురుషులు, మహిళలు అనే భౌతిక వర్గీకరణకు దారి తీస్తుంది. అయితే లింగప్రాధాన్యం అనేది సమాజంలో ఆ రెండు వర్గాల పాత్రకు సంబంధించిన పదం. స్త్రీపురుష, బాలబాలిక సంబంధాలు కూడా ఇందులో కలిసి ఉంటాయి. సాధారణంగా లింగసమానత్వం గురించి మాట్లాడవలసివస్తే మహిళల ప్రస్తావనే ఎక్కువగా వస్తుంది. సాంకేతికంగా ఇది తప్పే అయినా చారిత్రక పరిస్థితులను (గణాంకాల ఆధారంగా) పరిగణనలోకి తీసుకుంటే భిన్న సమాజాల్లో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న అసమానతకు, లొంగుబాటుకు ఇది దర్పణం పడుతుంది. ఈ అసమానతను తొలగించి, వారు కూడా పూర్తి స్థాయిలో మానవ హక్కులు అనుభవించే పరిస్థితి కల్పించడమే లింగసమానత్వం. అంటే లింగభేదం లేకుండా సమాన హక్కులు, సమాన బాధ్యతలు, సమాన అవకాశాలు అనుభవించడం అన్న మాట. "సమానత ఒక సాధనం-సమానత్వం ఒక ఫలితం" అనే సూత్రం ఆధారంగా మహిళలకు అన్ని రంగాల్లోనూ చక్కని స్వేచ్ఛ అందించడం దీనికి మూలం.

## 2.2. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు

సుస్థిర అభివృద్ధి సాధన అనేది మానవాళి భవిష్యత్తు కోసం ప్రపంచం యావత్తు ఆమోదించిన అజెండా. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి సాధన అనే అజెండాను ఇవి ప్రతిబింబిస్తాయి. ఇది ప్రపంచంలోని ప్రజలందరి భాగస్వామ్యంతోనే సాధ్యం. అభివృద్ధి అనేది ఏ అంశం కోసం అయినా కావచ్చు...ఒక మతం లేదా ఒక వర్గం ప్రజలను భాగస్వాములను చేసుకోకపోతే ఎస్‌డిజిల లక్ష్యం అసాధ్యమే అవుతుంది.

**బాక్స్ 1.** సుస్థిర అభివృద్ధి అంటే ఏమిటి?

భవిష్యత్ తరాల ప్రయోజనాలతో ఏ మాత్రం రాజీ పడకుండానే వర్తమాన తరం అభివృద్ధిసాధనకు కృషి చేయడమే సుస్థిర అభివృద్ధి. ఇందులో రెండు సూత్రాలున్నాయి...

- మొదటిది "అవసరాలు". ప్రపంచంలోని పేదలందరి అవసరాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. వారి అవసరాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

◆ వర్తమాన, భవిష్యత్ తరాల అవసరాలు తీర్చగల సామర్థ్యంపై టెక్నాలజీ, సామాజిక సంస్థలకు గల పరిమితులు రెండో అంశం.

**మూలం :** ఐక్యరాజ్యసమితి, పర్యావరణ, అభివృద్ధిపై ప్రపంచ కమిషన్ నివేదిక: మన ఉమ్మడి భవిష్యత్తు (1987)

సుస్థిర అభివృద్ధి గురించి తెలుసుకోవాలంటే మూడు అంశాలపై అవగాహన పెంచుకోవాలి. అవి... దృఢత్వం, సమ్మిళితత్వం, స్థిరత్వం

**దృఢత్వం :** సామాజిక, రాజకీయ, పర్యావరణపరంగా ఏర్పడుతున్న వత్తిడులు, ప్రతికూలతలను ఎదుర్కొనే సామర్థ్యం ఇది. ఒక సమాజం లేదా ఒక వర్గం నానాటికీ మారుతున్న వాతావరణ పరిస్థితులను (మితిమీరిన వర్షపాతం, తీవ్ర దుర్భిక్షం) ఎదుర్కొనేందుకు ఏ విధంగా సమాయత్తం కాగలుగుతుంది, వైపరీత్యాల నుంచి సత్వరం ఏ విధంగా కోలుకోగలరనేది ఇందులో ప్రధానం.

**సమ్మిళితత్వం :** ప్రపంచంలో నిరాదరణకు, అణచివేతకు గురవుతున్న (భిన్న దేశాలు, జాతులు, అణచివేతకు గురవుతున్న వారు, సంఘర్షణల బాధితులు, నిరాశ్రయులు, ప్రాంతీయ పరిస్థితులకు ఎక్కువగా లోనవుతున్న వారు, దివ్యాంగులు) వర్గాలన్నింటినీ అభివృద్ధి క్రమంలో భాగస్వాములను చేయడమే సమ్మిళితత్వం. నిరాదరణకు గురవుతున్న ఈ వర్గాల్లోకే సమాజంలో సగభాగం ఉన్న మహిళలు, బాలికలు కూడా వస్తారు.

**స్థిరత్వం :** ఇందులో మూడు ప్రధాన అంశాలను సమన్వయంతోను, అనుసంధానంతోను పరిష్కరించాల్సి ఉంది. అవి ఆర్థిక వృద్ధి, సామాజిక సమ్మిళితత్వం, పర్యావరణ పరిరక్షణ. లింగసమానత్వం అనేది సామాజిక సమ్మిళితత్వం కిందకు వస్తుంది.

అభివృద్ధిఫలాలు అందించడంలో సమాజంలో భారీ సంఖ్యలో ఉన్న వర్గాలను పక్కన పెడితే వాస్తవ, సుస్థిర అభివృద్ధి ఏ మాత్రం సాధ్యం కాదు. తేలిక మాటల్లో చెప్పాలంటే సమాజంలోని ఏ ఒక్క వర్గాన్ని వెనుక పెట్టకూడదు.

## 2.3. ఎస్‌డిజిలు, మహిళా సాధికారికత

లింగభేదం కారణంగా సమాజంలోని మహిళలు, పురుషులు మేధస్సు, ప్రతిభ, అవసరాల్లో తేడాల కారణంగా భిన్న అనుభవాలు సాధిస్తున్నారు. ఈ తేడా వల్ల అభివృద్ధి ఫలాలు అందుకోవడంలో కూడా స్త్రీపురుషుల మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంటోంది. ఈ లింగవ్యత్యాసం కారణంగా అభివృద్ధి క్రమంలో భాగస్వాములు కావడంలో గాని, అభివృద్ధి ప్రాజెక్టుల ప్రయోజనాలు పొందడంలో గాని మహిళలు పలు అవరోధాలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకి ఆరోగ్య, ఆహార సంస్థ అంచనాల ప్రకారం వ్యవసాయ రంగంలో మహిళలు కూడా సమానంగా భాగస్వాములు కాగలిగితే మొత్తం వ్యవసాయ దిగుబడులు 20 నుంచి 30 శాతం వరకు పెరుగుతాయి. ఒక్క వర్ధమానదేశాల్లోనే వ్యవసాయోత్పత్తి 2.5 శాతం నుంచి 4 శాతం మేరకు పెరుగుతుంది. దీని ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆకలితో అలమటిస్తున్న వారి సంఖ్య 12 నుంచి 17.2 శాతం తగ్గించడం సాధ్యపడుతుంది. ఇళ్ళలోను, సమాజంలోను, తమ వర్గంలోను మహిళలకృషి గణనీయంగానే ఉన్నప్పటికీ వారికి సమాజంలో సమానహోదా లభించడంలేదన్న విషయం పలు నివేదికలు ప్రముఖంగా ఎత్తి చూపాయి. ఎలాంటి ప్రతిఫలం లేని ఇంటిపనులు, వెలుపలి పనుల భారంతో వారు కుంగిపోతున్నారు. ఇంక లింగపరమైన హింస, లైంగిక వేధింపులు, అశ్లీల సాహిత్యం, అక్రమ రవాణా వంటి దురాగతాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. విద్య, ఆరోగ్యం, పర్యావరణం వంటి అన్ని రంగాల్లోను ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది.

మహిళలకు సమానహోదా కల్పించే విషయంలో మహిళల పట్ల అన్ని రకాల వివక్షల నిర్మూలనకు ఐక్యరాజ్యసమితి ఒడంబడికతో (సెడా) సహా పలు అంతర్జాతీయ ఒప్పందాలపై అన్ని దేశాలు సంతకాలు చేశాయి. మహిళల హక్కుల కల్పనకు అంతర్జాతీయ బిల్లుగా కూడా సెడాను పరిగణిస్తున్నారు. 1995లో బీజింగ్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి నాల్గవ మహిళా సమ్మేళనంలో ప్రకటించిన బీజింగ్ కార్యాచరణ ప్రణాళికను కూడా ప్రపంచదేశాలు ఆమోదించాయి. ఈ దిగువ అంశాల్లో వ్యూహాత్మక కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వాలు, అంతర్జాతీయ సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలకు ఈ కార్యాచరణ ప్రణాళిక పిలుపునిచ్చింది.

- మహిళలపై పేదరికం భారం
- విద్య, శిక్షణ, ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణల్లో మహిళలు ఎదుర్కొంటున్న అసమానత
- మహిళలపై దౌర్జన్యాలు
- మహిళలపై సాయుధ సంఘర్షణల ప్రభావం
- ఆర్థిక కార్యకలాపాలన్నింటిలోనూ ఎదురవుతున్న వివక్ష
- అధికారం, నిర్ణయాధికారంలో పురుషులతో పోల్చితే వ్యత్యాసం
- మహిళల సమానత్వం కోసం పనిచేసే యంత్రాంగాల కొరత
- మహిళలకు కల్పించాల్సిన మానవ హక్కులపై గౌరవం లేకపోవడం
- మీడియాతో సహా వివిధ కమ్యూనికేషన్ రంగాల్లో మహిళలకు సరైన భాగం లేకపోవడం
- ప్రకృతి వనరులు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల నిర్వహణలో లింగవివక్ష
- సమాజంలో బాలికల పట్ల వివక్ష, హక్కుల ఉల్లంఘన

ఎస్‌డిజిలకు ముందుగా 2000-2015 సంవత్సరాల మధ్య కాలంలో అమలుపరిచిన ఎండిజిలపై తయారైన భిన్న నివేదికలు సమాజంలో పేదరిక నిర్మూలన విషయంలో ఘనవిజయాలు సాధించినట్టు చెబుతున్నప్పటికీ లింగపరమైన అసమానతలు మాత్రం అలాగే ఉండిపోయాయి లేదా పెరిగిపోయాయి.పురుషుల కన్నా ఎక్కువ సంఖ్యలో మహిళలు పేదరికంలో మగ్గుతున్నారు. అంటే పేదరికాన్ని మహిళలకు పంచి ఇచ్చారన్న మాట. విద్య, ఆర్థిక, కార్యస్థలాల్లో మహిళలు తీవ్ర వివక్ష ఎదుర్కొంటున్నారు. సమాజంలో శిశుమరణాల సంఖ్య తగ్గడంతో పాటు తల్లుల ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడినట్టు లింగసమానత్వ సూచీలు తెలుపుతున్నప్పటికీ కార్యస్థలాల్లో మాత్రం వారి ప్రాతినిథ్యం తక్కువగానే ఉంది. పురుషులతో పోల్చితే మహిళలు తక్కువ వేతనాలు పొందుతున్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఈ అసమానతలు మరీ ఎక్కువగా ఉన్నాయి.

మొత్తం 17 ఎస్‌డిజిలుండగా వాటిలో ఐదు లింగవ్యత్యాసం, మహిళలు-బాలికల సాధికారికతకు సంబంధించినవే (బాక్స్ 2 చూడండి)

**బాక్స్ 2. ఎస్‌డిజి 5** : లింగసమానత్వ సాధన, మహిళలు-బాలికల సాధికారికత

5.1. ప్రపంచంలోని అన్ని చోట్ల మహిళలు, బాలికలపై అన్ని రకాల వివక్షలను రూపుమాపాలి.

5.2. బహిరంగ ప్రదేశాల్లోను, ప్రైవేటు స్థలాల్లోను కూడా మహిళలు, బాలికలపై అన్ని రకాల దౌర్జన్యకాండను నిర్మూలించాలి. మహిళల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, ఇతరత్రా దోపిడీకి చరమగీతం పాడాలి.

5.3. బాల్య, నిర్బంధ వివాహాలు, మహిళల మర్మాంగాల విచ్ఛేదనం వంటి దురాగతాలను రూపుమాపాలి.

5.4. ప్రభుత్వ సేవలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత విధానాల్లో మహిళలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు గృహ, కుటుంబ సంబంధిత వ్యవహారాల్లో వారి బాధ్యతను పెంచాలి.
5.5. రాజకీయ, ఆర్థిక, ప్రజాజీవనానికి సంబంధించిన అన్ని స్థాయిల్లోను నిర్ణయాలు తీసుకోవడంలో మహిళలను కూడా భాగస్వాములను చేస్తూ వారికి కూడా సమానావకాశాలు కల్పించాలి.
5.6. బీజింగ్ ప్రకటనకు దీటుగా లింగపరమైన, పునరుత్పాదక ఆరోగ్యం, పునరుత్పాదక హక్కులు మహిళలకు సమానంగా అందుబాటులో ఉంచేందుకు కృషి చేయాలి. భిన్న వేదికలపై జరిగే సమావేశాల్లో వీటి సాధనపై ఫలితాల నివేదికలు సమర్పించాలి.

**5ఎ.** ఆర్థిక వనరులు ప్రత్యేకించి భూములు, అన్ని రకాల ఆస్తులపై అదుపు, యాజమాన్య హక్కులు, ఆర్థిక సర్వీసుల విస్తరణ, ప్రకృతివనరులపై హక్కులు, వారసత్వ హక్కులు కల్పించాలి.
**5బి.** మహిళా సాధికారికతకు సాంకేతికతను ప్రత్యేకించి ఐసిటిని సాధనంగా ఉపయోగించుకునే ధోరణులు పెంచాలి.
**5సి.** అన్ని స్థాయిల్లోనూ లింగసమానత్వం సాధించడంతో పాటు భిన్న స్థాయిల్లో మహిళలు, బాలికల్లో సాధికారికత పెంచేందుకు దోహదపడే చట్టాలు, విధానాల అమలును పటిష్ఠం చేయాలి.

## 2.4. సాధికారికత అంటే ఏమిటి?

అభివృద్ధికి సంబంధించి ఎక్కడ ఎలాంటి చర్చ జరిగినా అధికంగా ప్రస్తావనకు వచ్చే అంశం సాధికారికత. దీన్ని విద్యావేత్తలు, పరిశోధకులు, ప్రాక్టీషనర్లు భిన్న నిర్వచనాలు ఇచ్చారు. దీనికి ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నిర్వచనం...''ప్రజలు --మహిళలు, పురుషులు--తమ జీవితాలపై తామే అదుపు సాధించడం, సొంత లక్ష్యాలు నిర్దేశించుకోగలగడం, నైపుణ్యాలు సముపార్జించడం (సొంత నైపుణ్యాలు, జ్ఞానం కలిగి ఉండడం), ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, సమస్యలను పరిష్కరించుకోవడం, స్వయంసమృద్ధి సాధించడమే సాధికారికత''.

**వనరులపై అదుపు** : ఆదాయాల ఆర్జన, అదుపు, భౌతికమైన ఆస్తుల వినియోగం, విక్రయంపై మహిళలకు గల సామర్థ్యం.
**స్వేచ్ఛగా తిరిగే అవకాశం** : కదలికలపై వారికి గల స్వేచ్ఛతో పాటు ఇల్లు వదిలి వెళ్ళగలిగే సామర్థ్యం
**కుటుంబంలో నిర్ణయ స్వేచ్ఛ** : ఎప్పుడు వివాహం చేసుకోవాలి, ఎవరిని వివాహం చేసుకోవాలి, ఎప్పుడు, ఎంతమంది పిల్లలను కనాలి అనే విషయంలో స్వేచ్ఛ

**దౌర్జన్యకాండలతో కూడిన ఆపద నుంచి విముక్తి** : గృహహింసతో పాటు లైంగిక, భౌతిక, మనోభావాలపరమైన హింసల నుంచి విముక్తికి అవకాశం సమాజంలో వాక్కు వినిపించి, విధానాలపై ప్రభావం చూపే సామర్థ్యం : రాజకీయాల్లో భాగస్వామ్యానికి, ప్రాతినిధ్యానికి గల అవకాశంతో పాటు ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు, సంఘాలుగా ఏర్పడేందుకు గల హక్కు మహిళ స్వేచ్ఛ కోసం పోరాడే సంస్థ ఏదైనా మహిళా సాధికారికతకు కృషి చేయాలి. సాధికారికత వల్ల ఇతర హక్కులు పొందడానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. ప్రధానంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆర్థికాభివృద్ధికి ఒక చోదకశక్తిగా ఉంటుంది. మహిళల్లో అద్భుతమైన సాధికారికత తెస్తుంది. ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తేవడం ద్వారా సమాజాన్ని పరివర్తన దిశగా నడిపి పేదరిక నిర్మూలనకు దోహదపడుతుంది.

ఆదాయాలు పెరిగిన కొద్ది సామాజిక, ఇతర సేవలు అందుకునే సామర్థ్యం పెరుగుతుంది. అధికాదాయాల వల్ల ఆర్థిక ఆధారనీయత తగ్గి ఇంటిలోను, సమాజంలోను కూడా బేరసారాలు చేసే శక్తి, భాగస్వామ్య శక్తి పెరుగుతాయి. కేవలం ఆర్థిక వృద్ధి, సాధికారతతో లింగవ్యత్యాసాలు తొలగిపోవు..కాని ఆ దిశగా పెద్ద దోహదకారిగా నిలుస్తుంది. అంతమాత్రాన సామాజిక, చట్టపరమైన, రాజకీయ స్థితిగతులేవీ ప్రధానం కాదని కాదు. ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించి చట్టపరమైన రక్షణ కల్పించినట్టయితే ఈ అసమానతలు తొలగిపోయి సాధికారత సాధ్యం అవుతుంది.

## 2.5. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు ఆర్థిక సమ్మిళితత్వం

తగినంత ఆర్థిక సహాయం, రుణాలు అందుబాటులో లేకపోవడం ఎంటర్‌ప్రెన్యూర్లు ఎదుర్కొనే ప్రధాన సవాలు. అలాగే ఆస్తులు, ఆర్థిక వ్యవహారాలపై అదుపు, యాజమాన్య హక్కులు లేకపోవడం వంటి సామాజిక, ఆర్థిక, చట్టపరమైన ఇక్కట్లు మహిళలకు అవరోధంగా నిలుస్తున్నాయి.

ఆర్థిక సమ్మిళితత్వాన్ని ఐక్యరాజ్యసమితి ఈ విధంగా నిర్వచించింది.

"ఆర్థికంగా పరిపుష్టమైన, శక్తివంతమైన ఆర్థిక సంస్థలు విస్తృతమైన ఆర్థిక సేవలు తక్కువ ధరలకు అందుబాటులో ఉంచడమే ఆర్థిక సమ్మిళితత్వం"

ఈ నిర్వచనంలో మార్పులుండవచ్చు గాని ఆర్థిక సమ్మిళితత్వం అంటే కేవలం చెల్లింపులు, పొదుపు, రుణాలు, బీమా వంటి ఆర్థిక సేవలు అందరికీ అందుబాటులో ఉండడం ఒక్కటే కాదు...ప్రతి ఒక్కరూ భరించగల రేట్లకు అందుబాటులో ఉండడం, తేలిగ్గా ఉపయోగించుకోగలిగితే సరళత్వం, వినియోగదారులకు ఆర్థిక అక్షరాస్యత కల్పన, సరైన రక్షణతో పాటు ఆర్థిక కార్యకలాపాలన్నీ సజావుగా సాగేందుకు కావలసిన నియంత్రణలు, అంచనా, పర్యవేక్షణ వ్యవస్థలు కూడా అందుబాటులో ఉండాలి.

ఇక మహిళల ఆర్థిక సమ్మిళితత్వానికి వస్తే ఉత్పాదకమైన ఆస్తులు అందుబాటులో ఉంచడం, బలమైన వృద్ధికి సహాయకారిగా ఉండే ఆర్థిక మధ్యవర్తిత్వం ఉండాలన్న బలమైన వాదన ఉంది. "మహిళల మార్కెట్" అత్యంత విస్తారమైనది, సమాజంలోని భిన్న వర్గాలకు ప్రాతినిథ్యం గలది. అల్పాదాయాలు గల స్వయంఉపాధి పొందిన మహిళలు, వ్యవసాయ, పశుసంవర్ధక, చిన్నమధ్యతరహా పారిశ్రామిక యూనిట్ల యజమానులు, ఆయా విభాగాల్లో పని చేసే వారందరూ ఈ కోవలోకి వస్తారు. వీరికి ఆర్థిక సేవలు అందుబాటులో ఉంచకపోవడానికి సాధారణంగా చెప్పే కారణాలు...

- పరిమిత ఆర్థిక సామర్థ్యం, ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం
- ప్రాపర్టీ చట్టాల కారణంగా కొల్లేటరల్ (అదనపు) సెక్యూరిటీ అందించలేని స్థితి
- పని హక్కు లేకపోవడంతో పాటు కాంట్రాక్టులపై సంతకం చేయలేకపోవడం, బ్యాంకు ఖాతాలు తెరవలేని స్థితి, ఆస్తులపై యాజమాన్య హక్కులు లేకపోవడం
- నిర్దేశిత గుర్తింపు పత్రాలు లేకపోవడం
- భర్త అనుమతి లేకుండా రుణాలు పొందలేని స్థితి

ఈ అవరోధాలన్నింటినీ పరిష్కరించడం అత్యంత ప్రధానం. మహిళలను ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడానికి విధానకర్తలు దృష్టి సారించాలి. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లను ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడం వల్ల ఎస్ఎంఇలు, నిరుపేద వర్గాలకు రుణాలు, పొదుపు, బీమా, చెల్లింపులు, దేశీయ, అంతర్జాతీయ చెల్లింపులు వంటి ఆర్థిక సాధనాలన్నీ అందుబాటులోకి వస్తాయి.

**ఫిగర్ 1** : ఆర్థిక సమ్మిళితత్వాన్ని అందించే యంత్రాంగం ఆర్థిక సమ్మిళితత్వం ఎస్ఎంఇ ఫైనాన్సింగ్, మైక్రోఫైనాన్స్, వ్యవసాయ రుణాలు, ప్రత్యేక రుణాలు, హరిత రుణాలు ఉపాధి-ఆర్థికాభివృద్ధి, పేదరికం-అసమానతల తొలగింపు, ఆహారభద్రత, మహిళలు-యువతకు ఆదాయం-పొదుపు, హరిత వృద్ధి-పర్యావరణ పరిరక్షణ

### 2.5.1. ఆర్థిక ఉత్పత్తులు-సర్వీసులు

ఇప్పటివరకు వ్యవస్థీకృత బ్యాంకింగ్ రంగం అడిగే కొల్లేటరల్ హామీలు ఇవ్వలేని కారణంగా ఆ రంగానికి దూరంగా ఉంటూ వస్తున్న వ్యక్తులు, సంస్థలకు మైక్రోఫైనాన్స్ విభాగం రుణాలందిస్తోంది. 1970దశకంలో బంగ్లాదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధునిక మైక్రోఫైనాన్స్ రంగంలోకి తొలి అడుగులు వేసింది. ఆ తర్వాత మైక్రోఫైనాన్స్ వర్థమాన దేశాలన్నింటికీ విస్తరించింది. ఈ సంస్థలు అల్పాదాయ వర్గాలకు సూక్ష్మరుణాలు, ఇతర ఆర్థిక ఉపకరణాలు అందుబాటులోకి తెచ్చాయి. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు అందుబాటులో ఉన్న మైక్రోఫైనాన్స్ ఉత్పత్తులివే...

**మైక్రో పొదుపు** : కనీస నిల్వతో సంబంధం లేకుండా సేవింగ్స్ ఖాతాలు తెరుస్తున్నాయి. ఫలితంగా మహిళలు ఆస్తులు కూడగట్టగలిగే అవకాశం ఏర్పడింది.

**మైక్రో రుణాలు** : ఎలాంటి భౌతికమైన హామీలు లేకుండానే తక్కువ వడ్డీకి స్వల్ప మొత్తాల్లో రుణాలందిస్తున్నాయి. పేదరికం, నిరుద్యోగం, అర్హతలకు దీటు కాని ఉద్యోగం, పెట్టుబడుల లేమి, క్రెడిట్ చరిత్ర వంటివేవీ లేని మహిళలకు ఈ మైక్రోరుణాలు ఎంతో దోహదపడుతున్నాయి.

**మైక్రో బీమా** : తక్కువ ప్రీమియంతో తక్కువ మొత్తంలో బీమారక్షణ కల్పించే స్కీమ్‌లు ఇవి. ఈ సేవపై కస్టమర్లకు అవగాహన కల్పించడం, భారీ అవకాశాలున్న మార్కెట్‌లో చైతన్యం నింపడం ఒక పెద్ద సవాలు.

### 2.5.2 ఆర్థిక సమ్మిళితత్వానికి సరఫరా, డిమాండు

పైన పేర్కొన్న ఉదాహరణలు అల్పాదాయ వర్గాల వారికి సరసమైన రేట్లకు అందుబాటులో ఉన్న ఆర్థిక ఉపకరణాలు. ఇవి సరఫరాకు సంబంధించినవి. పూర్తిస్థాయి ప్రయోజనం రావాలంటే సరఫరాపరమైన అంశాలు మాత్రమే చర్చిస్తే చాలదు. వ్యవస్థీకృత ఆర్థిక కార్యకలాపాలకు దూరంగా ఉన్న నిరుపేద కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని డిమాండుపరమైన అంశాలను చర్చించడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత విస్తరించడం, వినియోగదారుల సామర్థ్యాల నిర్మాణం, వినియోగదారుల రక్షణ విధానాలు అభివృద్ధి చేయడం అవసరం.

ఆర్థిక అక్షరాస్యత, విద్యాకార్యక్రమాల నిర్వహణలో మూడు ప్రధానాంశాలున్నాయి...

**ఆర్థిక అక్షరాస్యత** : సంపూర్ణ అవగాహనతో ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యాల కల్పన.

**ఆర్థిక విద్య** : ఆర్థికంగా అక్షరాస్యులు కావాలంటే అందుకు సంబంధించిన పరిజ్ఞానం సముపార్జించడంతో పాటు ఆర్జన, పొదుపు, వ్యయం, రుణ సేకరణ, పెట్టుబడులు అన్నింటికీ సమప్రాధాన్యం ఇస్తూ ఆర్థిక వనరుల నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపరుచుకోవాలి.

**ఆర్థిక సామర్థ్యం** : ఇది చాలా విస్తృతమైన పదం. వ్యక్తిగత విధివిధానాలను ఆర్థిక వ్యవస్థలోని విభాగాలతో అనుసంధానం చేస్తుంది.

### 2.5.3 ఆర్థిక సమ్మిళితత్వంలోని సమస్యలు

వర్థమానదేశాల్లోని నిరుపేద కుటుంబాల్లో 40 శాతం మంది గృహస్థులకు వ్యవస్థీకృత బ్యాంకింగ్ అందుబాటులో లేదు. ఖాతాలు తెరవకపోవడానికి బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలు తమకు దూరంగా ఉండడమే కారణమని ప్రతీ ఐదుగురిలో ఒకరు చెబుతూ ఉంటారు. ఈ దూరాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఎస్ఎంఇ ఎంటర్‌ప్రెన్యూర్లకు కూడా వర్థమానదేశాల్లో సరైన రుణ సదుపాయాలు అందుబాటులో ఉండడంలేదు. కేవలం 18 శాతం సంస్థలకు మాత్రమే బ్యాంకింగ్ రుణాలు అందుబాటులో ఉంటున్నాయి. దీనికి కూడా సెక్యూర్డ్ రుణాలు పొందడానికి కావలసిన అదనపు హామీలు ఇవ్వలేకపోవడం, సరైన ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం, లింగవివక్ష, ఇతర సామాజిక, సాంస్కృతిక అంశాలతో పాటు దూరమే కారణం.

ఆర్థిక సర్వీసుల లభ్యతలో కూడా మహిళల పట్ల వివక్ష కనిపిస్తోంది. పురుషులతో సమానంగా వారికి అవకాశాలు లేవు. ఖాతా తెరవడం, పొదుపు, రుణం అందించడం, ఇతర చెల్లింపు విధానాలన్నింటిలోనూ ఈ వివక్ష ఉంది. దక్షిణాసియా ప్రాంతంలో అకౌంట్ కలిగి ఉండే విషయంలో పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా 18 శాతం ఉంది. బ్యాంకు ఖాతాలు తెరవలేకపోవడమే కాదు...పొదుపు రేటులోను, వ్యవస్థీకృత బ్యాంకింగ్ రంగం నుంచి రుణాలు పొందడంలోను కూడా మహిళలు బాగా వెనుకబడి ఉన్నారు. అవసరమైన రుణసదుపాయం అందుబాటులో లేకపోవడం మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు ప్రధాన అవరోధం. ఈ సమస్యను అధిగమించాలంటే మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు ఈ దిగువ ప్రయత్నాలు చేయడం మంచిది.

- పరిమాణంలో చిన్నవైన వ్యాపారాలు ప్రారంభించాలి. సంస్థ ఎంత పెద్దదైతే అంతగా మహిళ యాజమాన్య హక్కుకు దూరమయ్యే ఆస్కారం ఉంటుంది.
- స్వల్ప వృద్ధి అవకాశాలున్న, తక్కువ విలువను జోడించే సేవల రంగం వాటిని ఎంచుకోవడం మంచిది.

**చేయాల్సిన అంశాలు...**

- మీ వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం మహిళలు లేదా పురుషుల స్వభావాన్ని వివరించగల 15 మాటలు ఒక కాగితంపై రాయండి.

- ఈ పదాలన్నింటినీ ఆయా స్వభావాలకు అనుగుణంగా వారు జీవశాస్త్రపరంగా కనిపించే తీరు, వారు నిర్వహించే సామాజిక బాధ్యతల ఆధారంగా రెండు కాలమ్‌లుగా విభజించండి.
- లింగభేదం, లింగవ్యత్యాసంపై మీ సొంత ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయన్నది ఆ జాబితాలో ఏ విధంగా ఉంది?
- ఈ పదాల్లో మీ అభిప్రాయం ప్రకారం ఎన్ని పదాలు ఒకే రకంగా కనిపిస్తున్నాయి? వాటిలో ఏయే పదాలు వారి పాత్రలో మార్పులు తెచ్చేందుకు సహాయకారిగా ఉన్నాయి?

**కీలక సందేశాలు...**

- లింగభేదం అనేది ఒక సామాజిక అంశం. సమాజంలో స్త్రీపురుషుల సంబంధాన్ని తెలియచేసేది.
- లింగ బంధం అనేది ఆయా సందర్భాలను బట్టి పరిశీలనకు వచ్చే అంశం. దీనికి శాశ్వత నిర్వచనం ఏదీ ఉండదు. ఈ బంధంలో మార్పులు ఉండవచ్చు.
- 2030 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు చెందిన అంతర్జాతీయ అజెండాలో సమ్మిళితత్వం, స్థిరత్వం, దృఢత్వం కలిసి ఉంటాయి. ఇవి ప్రజలందరికీ సుస్థిర అభివృద్ధి ఫలాలు అందుబాటులో ఉండేలా చూస్తాయి. ఏ ఒక్కరినీ విస్మరించవు.
- ప్రపంచ అభివృద్ధిలో న్యాయబద్ధమైన పాత్ర పోషించగల అవకాశం మహిళలు, బాలికలకు ఉండడంలేదు. ఇందుకు కారణాలెన్నో.
- ప్రజలందరూ --మహిళలు, పురుషులు-- తమ జీవితాలపై తామే అదుపు సాధించడం, సొంత లక్ష్యాలు నిర్దేశించుకోగలగడం, నైపుణ్యాలు సముపార్జించడం (సొంత నైపుణ్యాలు, జ్ఞానం కలిగి ఉండడం), సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ వివక్ష లేకుండా సమాజాభివృద్ధిలో పరిపూర్ణంగా భాగస్వాములు కావడమే సాధికారికత.
- ఎస్‌డిజిల్లోని ఐదో లక్ష్యం ప్రపంచం యావత్తు మహిళా సాధికారికతకు కృషి చేసే బాధ్యత తీసుకోవాలని నిర్దేశిస్తోంది. సమ్మిళితత్వం ప్రధానాంశంగా మహిళల అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ ప్రదర్శించాల్సి ఉంటుంది.
- సాధికారతకు భిన్న కోణాలున్నప్పటికీ మహిళలు, బాలికలకు సాధికారికత అందించగల ప్రధాన సాధనం ఆర్థిక స్వేచ్ఛ. సాధికారికతలో ఇది తప్పనిసరి షరతు కావాలి.
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు మద్దతు ఇచ్చే సాధనం ఆర్థిక సమ్మిళితత్వం.

## III. మహిళలు - ఐసిటి : సమన్వయం

### బోధన ఫలితం

ఈ విభాగం చదివిన తర్వాత నాయకులకు ఈ దిగువ అంశాలపై అవగాహన కలుగుతుంది.

- లింగవ్యత్యాసాన్ని తగ్గించడానికి ఒక సాధికారికత సాధనంగా ఐసిటిలకు గల శక్తిపై అవగాహన
- తమ దేశాల్లో మహిళలు, ఐసిటిల మధ్య అనుసంధానంపై కేస్ స్టడీలను గుర్తించి, విశ్లేషించే సామర్థ్యం
- ఐసిటిలను అందుకునే విషయంలో మహిళలకు అవరోధంగా ఉన్న అంశాలపై అవగాహన

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఐసిటిలు ''లింగ తటస్థ''మైనవని, ''సాధికారికతకు సాధనాలు''గా ఉపయోగపడతాయని ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న సాహిత్యం ప్రగాఢంగా విశ్వసిస్తోంది. ప్రత్యేకించి మొబైల్‌ఫోన్లు మహిళలు, పురుషులను ఆర్థిక, సామాజిక, రాజకీయ పాత్రల్లో సమానంగా సాధికారం చేస్తున్నాయి. కాని తగు జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం ''సంపన్నులు'', ''పేదల'' మధ్య వ్యత్యాసాన్ని ఇవి పెంచే ప్రమాదం ఉంది. ముఖ్యంగా భవిష్యత్ ఐసిటి విధానాలు, ఆచరణలో స్థూపం దిగువ భాగంలో అధిక సంఖ్యలో జీవనం సాగిస్తున్న ''ఈ మౌన జీవుల''ను కూడా భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఐసిటిలు మహిళలకు ప్రోత్సాహం కల్పించే శక్తులే కాదు...మహిళా సాధికారికతకు ప్రధాన అవరోధంగాను, సమాజంలో డిజిటల్, మేథోపరమైన వ్యత్యాసాన్ని పెంచేవిగాను కూడా ఉంటాయి.

వర్తమాన సమాజంలో ఐసిటిలు పరివర్తిత పాత్ర పోషిస్తున్నాయి. కమ్యూనికేషన్, రవాణా వ్యయాలను తగ్గించడం ద్వారా వాణిజ్య లావాదేవీల వేగాన్ని పెంచడంతో పాటు ప్రపంచవాణిజ్య ముఖచిత్రాన్ని మార్చివేశాయి. బిపిఓ సెంటర్లు, కాల్ సెంటర్ల ద్వారా దూరాన్ని కూడా తగ్గించేశాయి. దీని వల్ల ఇంగ్లీషు, కంప్యూటర్ పరిజ్ఞానంతో తక్కువ వేతనాలకే అందుబాటులో ఉండే కార్మికశక్తి గల వర్థమానదేశాలు లాభపడ్డాయి. ప్రధానంగా ఈ పరివర్తన వల్ల మహిళలు ఎక్కువగా లాభపడ్డారు. అయినంత మాత్రాన ఇతర నవ్యసాధనాల వలెనే ఐసిటిలు కూడా సమాజ చట్రంలో ఇరుక్కుపోవడం వల్ల అవి లింగ తటస్థమైనవి కావని నాన్సీ హాఫ్‌కిన్స్ అన్నారు. సామాజికమైన అవరోధాలతో పాటు సరఫరాలపరమైన అంశాలు కూడా మహిళల పాత్రను పరిమితం చేస్తున్నాయి. టెక్నాలజీ డిజైన్, యూజర్ ఇంటర్‌ఫేస్, ఇంటర్నెట్ అందుబాటులో ఉండే భాష (ఇంగ్లీషు), కొన్ని రకాల సాంకేతిక నైపుణ్యాలు మహిళలకు అవరోధంగా ఉంటున్న అంశాల్లో ప్రధానమైనవి. ఈ విశ్లేషణ నిజమే అయినప్పటికీ, ఐసిటిల వల్ల సమాజంలో పరివర్తన ఏర్పడిందనేందుకు కూడా చక్కని ఉదాహరణల దృష్ట్యా, స్థూల అభిప్రాయాలకు రావడానికి మాత్రం ఇవి చాలవు. 2010లో భారత్‌లో విస్తృతంగా పర్యటించి గణాంకాలను సేకరించిన ఈ రచయిత మొబైల్ ఫోన్ ఉన్న మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం ఇనుమడించాయని గుర్తించారు. చెరీ బ్లెయిర్ ఫౌండేషన్ నిర్వహించిన అధ్యయనాల్లో కూడా ఈ అంశం తేలింది. చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటున్న మహిళలు కుటుంబంతోను, స్నేహితులతోను, క్లయింట్లతోను అనుసంధానం కావడానికి మొబైల్ ఫోన్లు చక్కని సాధనంగా ఉన్న విషయం గుర్తించింది. అలాగే ఆరోగ్యం, పని అవకాశాలు, చట్టపరమైన సహాయానికి అందుబాటులో ఉన్న అవకాశాలు కూడా తెలుసుకోగలుగుతున్నారు. ఈ కారణంగా ఈ అధ్యాయంపై విస్తృత చర్చ చేపట్టే ముందు ఐసిటిలు, మహిళలకు మధ్య గల అనుసంధానాన్ని తెలుసుకోవలసిన అవసరం ఉంది.

మహిళలు, ఐసిటి అనుసంధానంపై చర్చలో చారిత్రకంగా రెండు అంశాలు ప్రధానంగా ప్రస్తావనకు వస్తున్నాయి. 1) కమ్యూనికేషన్ ఉపాధిలో మహిళల భాగస్వామ్యం 2) మీడియాలో మహిళలు, బాలికలకు లభిస్తున్న స్థానం.

బీజింగ్ వేదికగా జరిగిన గోష్ఠిలో ఈ రెండు అంశాలు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చాయి. ఆ సందర్భంగా ప్రభుత్వేతర, మీడియా సంస్థలకు ఈ సూచనలు చేశారు.

1) కొత్త టెక్నాలజీలు, మీడియా ద్వారా మహిళలకు భావ వ్యక్తీకరణ, నిర్ణయాలు తీసుకోవడంలో తగు స్వేచ్ఛ ఇవ్వాలి.
2) మీడియాలో మహిళలను ఒకే రకంగా చిత్రీకరించే ధోరణులు విరమించుకోవాలి.

### 3.1. కమ్యూనికేషన్ రంగంలో మహిళల భాగస్వామ్యం

1995లో జరిగిన బీజింగ్ సమ్మేళనం తర్వాత 20 సంవత్సరాలకు జరిగిన సర్వే ప్రకారం మీడియాలో మహిళల భాగస్వామ్యం విషయంలో అతి తక్కువ స్థాయిలో సానుకూల మార్పు చోటు చేసుకుందని తేలింది. విశ్లేషించిన బహుళ విభాగాల్లో మహిళల భాగస్వామ్యం 20 శాతం కన్నా తక్కువగానే ఉంది. అలాగే మీడియాలో నిర్ణయాలు తీసుకునే స్థాయిలో మహిళలు అతి తక్కువగా ఉన్నారు. పురుషుల కన్నా తక్కువ వేతనాలు, పని చేసే ప్రదేశంలో కూడా వారికి సరైన ప్రాధాన్యం లేకపోవడం, వేధింపులు, వ్యక్తిగత, వృత్తిపరమైన బాధ్యతలు సమతూకం చేసుకోవడంలో ఇబ్బందులు ఈ వృత్తికి (మహిళలు) దూరం కావడానికి కారణాలుగా చెబుతున్నారు.

ఐసిటి ప్రవేశం తర్వాత కూడా పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. జాతీయ స్థాయిలో ఐసిటి వినియోగ ధోరణులపై రంగాలవారీగా గణాంకాలు అందుబాటులో లేదు. ఏమైనా ఐసిటి అనేది పురుషాధిక్య పరిశ్రమగానే ఉంది. సాంకేతిక విభాగాల్లోను, మేనేజ్‌మెంట్ స్థాయిలోను పరిస్థితి ఇలాగే ఉంది. అయితే ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని కొన్ని దేశాలు ఐసిటిలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాయని అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ యూనియన్ నివేదికలో తెలిపింది. అయితే చైనా, ఇండియా, ఫిలిప్పీన్స్ వంటి పురోగమన ఆర్థిక వ్యవస్థల్లో ఐసిటిలో మహిళల భాగస్వామ్యం అధికంగానే ఉంటున్నట్టు పేర్కొంది. ప్రధానంగా ఇండియాలో మహిళలు ఐసిటి రంగంలో చేరేందుకు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారు. మహిళలను ఇంటి నుంచి కార్యాలయాలకు, కార్యాలయాల నుంచి ఇంటికి చేర్చేందుకు "పిక్ అండ్ డ్రాప్" టాక్సీ సదుపాయం కల్పించడం, కంపెనీల్లో వేధింపుల నిరోధక కమిటీల ఏర్పాటు, మాతృత్వ సెలవు దినాలు ఇవ్వడం వంటి చర్యలు వాటిలో కొన్ని. ఈ చర్యల ఫలితంగా ఐసిటి రంగంలో మహిళల ప్రాతినిథ్యం పెరిగింది. వాస్తవానికి ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్‌లో సాధారణ కార్మికశక్తిలో మహిళల సంఖ్య 2009 సంవత్సరంలో 31 శాతం ఉండగా మేనేజ్‌మెంట్ హోదాల్లో ఉన్న వారి సంఖ్య 20 శాతం ఉంది. మహిళల భాగస్వామ్యం అధికంగా ఉన్న కొద్ది దేశాల్లో ఇదొకటి. మలేసియాలో కూడా మల్టీమీడియా సూపర్ కారిడార్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఐసిటి రంగంలో మహిళలు అధిక సంఖ్యలో భాగస్వాములయ్యేందుకు దోహదకారి అయింది. పైగా ఐసిటి రంగం మంచి వృద్ధిని సాధిస్తున్నందు వల్ల సుశిక్షితులైన ఐసిటి నిపుణుల సంఖ్య తక్కువగా ఉండడంతో గతంలో పురుషాధిక్య విభాగంగా ఉన్న ఐసిటిలోకి మహిళలను కూడా మలేసియా ప్రోత్సహిస్తోంది.

### 3.2. మహిళలు, బాలికలకు మీడియాలో ప్రోత్సాహం

మీడియాకు సంబంధించిన అన్ని మాధ్యమాల్లోను మహిళలు, బాలికలకు సంబంధించిన వార్తల ప్రసారంలో అతి తక్కువ మార్పు చోటు చేసుకుందని గణాంకాలు తెలుపుతున్నాయి. మీడియాలో మహిళల ప్రాతినిథ్యం కూడా తక్కువగా ఉండడం వల్ల వారిపై మూస ధోరణిలో ప్రతికూల, కించపరిచే వార్తలే ప్రచారంలోకి వస్తున్నాయి. మహిళలను ఫ్యాషన్, మానసిక ఉద్వేగాలతో కూడిన సంబంధాలు, కుటుంబ కోణాల్లోనే చూస్తున్నారు. సాంకేతిక నైపుణ్యాలు తక్కువగా ఉన్నవారుగా చిత్రీకరిస్తున్నారు. కొత్త టెక్నాలజీల ప్రవేశం వల్ల కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. వాస్తవానికి గతంతో పోల్చితే పరిస్థితి మరింత దిగజారింది. ప్రధానంగా ఐసిటి వచ్చిన తర్వాత మహిళలను లైంగికంగా దోపిడీకి గురి చేసే ధోరణులు పెరిగాయి. మహిళలను కించపరిచే లేదా లైంగికంగా అసభ్యంగా చిత్రీకరించే దృశ్యాలున్న ఫొటోలు, వీడియోల క్రయవిక్రయాలు, సెక్స్ టూరిజం ట్రిప్‌ల గురించి ప్రచారం, లైంగిక ధోరణిలో భాగస్వాములను ఏర్పాటు చేసే సేవలు పెరిగిపోయాయి. మహిళలు, బాలికల అక్రమ రవాణాలు ఇంటర్నెట్‌ను మాధ్యమంగా ఉపయోగించుకునే ధోరణులు కూడా పెరిగాయి. ఉదాహరణకి వెబ్ పేజిల్లో ఉద్యోగావకాశాలున్నట్టు ఆకర్షిస్తూ మహిళలకు వల వేయడం, ఆ దేశానికి వారు చేరిన తర్వాత వారిని లైంగిక బానిసలుగా మార్చడం జరుగుతోంది. మహిళలు, బాలికల గౌరవానికి భంగం కలిగించడాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను నిలువరించే రీతిలో మీడియాలో ప్రచురించే వార్తాంశాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. కాని అలాంటి నియంత్రణ సెన్సార్‌షిప్‌కు దారి తీయకుండా కూడా జాగ్రత్త పడాలి. అలాగే ఐసిటిల అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలంటే అశ్లీల సాహిత్యం, సమాచార స్వేచ్ఛ, ఉద్దేశపూర్వకంగా ఒకరిని కించపరిచే ధోరణులను నిరోధించే చట్టాల్లో తగు మార్పులు చేయడం, మహిళలు, పురుషుల గౌరవానికి భంగం కలగని విధంగా సమతూకం తెచ్చేందుకు ప్రయత్నించడం మంచిది.

### 3.3. ఐసిటిలో లింగ వ్యత్యాసం

అభివృద్ధిలో ఐసిటి పోషించే కీలకపాత్ర విషయంలో విభేదించే వారు ఇప్పుడు తక్కువ సంఖ్యలోనే ఉంటారు. సమాచారంలో వేగం, శక్తి, విస్తృతి, అట్టడుగున లేదా మారుమూలన ఉన్న వారిని కూడా చేరగల పరిధి, అనుసంధానం, జాతీయ/స్థానిక స్థాయిల్లో వినియోగించగలిగే స్వేచ్ఛ, బహుముఖీన వినియోగం ఐసిటి ప్రధానలక్షణాల్లో కొన్ని. ప్రభుత్వాలు కూడా మరింత మెరుగైన, సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన పాలన అందించేందుకు ఐసిటిని విస్తృతంగా వినియోగించుకుంటున్నాయి. “మొబైల్ విప్లవం” పుణ్యమా అని జనాభాలో అధిక శాతం మందికి ప్రధానంగా ఇంతవరకు అందుబాటులో లేని లేదా అరకొరగా అందుబాటులో ఉన్న వర్గాలకు ఐసిటి పరికరాలు చేరువ అయ్యాయి. ప్రజల జీవనంలోను, అనుసంధానంలోను కూడా ఇవి విప్లవాత్మకమైన మార్పు తెచ్చాయి. ఐసిటిలు అందిస్తున్న ప్రయోజనాలు అమిత విస్తారమైనవి. మార్కెట్‌లో ధరల ధోరణులు, ఉత్పత్తుల్లో మెరుగుదల, సరఫరా చెయిన్ నిర్వహణలో మెరుగుదల వంటి సమాచారం అంతా క్షణాల్లో ప్రజలకు అందిస్తున్నాయి. ప్రైవేటురంగంలో విజయానికి, వైఫల్యానికి తేడాకు కూడా ఇవే దర్పణంగా నిలుస్తున్నాయి. టెక్నాలజీలు అందుబాటులో లేనివారు ప్రయోజనం పొందలేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

వివిధ ఆసియా,పసిఫిక్ దేశాల్లో స్త్రీపురుషుల్లో ఇంటర్నెట్, మొబైల్ వినియోగధోరణులపై వాణిజ్య, పరిశ్రమ, లాభాపేక్ష లేని సంస్థలు, ప్రభుత్వ స్థాయిలనుంచి అందుబాటులో ఉన్న సమాచారం ఆసక్తికరమైన సమాచారాన్ని మన ముందుంచింది. ఈ గణాంకాలు ఆయా సేవలు అందుబాటులో ఉండే పరిధి దాటిపోవన్న అంశాన్ని కూడా

పరిగణనలోకి తీసుకుంటే వర్థమాన దేశాల్లో ఆధునిక టెక్నాలజీల వినియోగంలో భారీ వ్యత్యాసం ఉన్న విషయం కూడా తేటతెల్లం అవుతుంది.

**ఫిగర్ 2** : లింగభేదం పరంగా ఇంటర్నెట్ యాక్సెస్, వినియోగం

బంగ్లాదేశ్ (2011) 19 శాతం/81 శాతం, చైనా (2015) 46 శాతం/54 శాతం, కొరియా (2002) 47 శాతం/53 శాతం, ఇండియా (2015) 29 శాతం/71 శాతం), ఇండోనేసియా (2001) 22 శాతం/78 శాతం, హాంకాంగ్ (2002) 45 శాతం/55 శాతం.

సాధారణంగా అయితే ఐసిటి వల్ల పురుషులతో సమానంగానే మహిళలు కూడా ప్రయోజనం పొందాలి. కాని లింగభేదం కోణం నుంచి ఐసిటి వినియోగ ధోరణులు పరిశీలిస్తే లింగపరమైన అవరోధాలు ఎక్కువగానే ఉన్నాయి. మొబైల్ ఫోన్ల వినియోగం విషయంలో మహిళలకు ప్రధాన అవరోధాల్లో వ్యయం, నెట్‌వర్క్ నాణ్యత/కవరేజ్, భద్రత/వేధింపులు, సాంకేతిక అక్షరాస్యత/విశ్వాసం ప్రముఖంగా ఉన్నాయి. మహిళలు ఎదుర్కొంటున్న అసమానత తొలగాలంటే మొబైల్ టెక్నాలజీ వినియోగం గురించి మంచి అవగాహన ఏర్పడడం అత్యంత కీలకం.

### 3.4. ప్రభుత్వ సేవల్లో ఐసిటి వినియోగం

వర్థమాన దేశాల్లో ఐసిటిని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు దశాబ్దాల క్రితం, 1995 బీజింగ్ సమ్మేళనం తర్వాత ప్రింట్ మీడియా, రేడియో, టెలివిజన్ వంటి సాంప్రదాయిక ప్రసార మాధ్యమాలు, వెబ్, కంప్యూటర్ టెక్నాలజీ వంటి ఆధునిక మాధ్యమాల ద్వారా పలు ప్రాజెక్టులు అమలుజరిగాయి. పేదరిక నిర్మూలన, విద్యావకాశాలు అందుబాటులోకి తేవడం, ఆరోగ్య సేవల విస్తరణ, ప్రకృతి వైపరీత్యాల రిస్కుల తగ్గింపు వంటి కార్యక్రమాల కోసం ఈ పాత, కొత్త టెక్నాలజీలను విశేషంగా వినియోగించుకున్నారు. ఈ ప్రయత్నం కూడా విజయవంతం అయింది.

అభివృద్ధి లక్ష్యాలు అందుకోవడంలో, తద్వారా ఎస్‌డిజిలు సాధించడంలో ఐసిటిల వినియోగాన్ని లింగపరమైన కోణంలో నుంచి చూస్తే చాలా దేశాలు లింగసమానత్వాన్ని తమ రాజ్యాంగాల్లో చేర్చినట్టు స్పష్టం అవుతుంది. కాని ఆ రాజ్యాంగపరమైన ఏర్పాట్లకు, ఆచరణీయతకు మధ్యన చాలా వ్యత్యాసం ఉంది. ప్రధానంగా విధాన నిర్ణయాలు, ఆచరణీయతలో ఇది మరింత ఎక్కువగా ఉంది. చాలా జాతీయ ఐసిటి ప్రాజెక్టులు (సాంప్రదాయిక మీడియాతో సహా) లింగసమానత్వంపై నిర్లిప్తంగానే ఉన్నాయి.

**ఫిగర్ 3** : ''నేను ఎక్కడ ఇముడుతాను? నాకు లభించే లాభం ఏమిటి?

ఏ విభాగానికైనా ఐసిటి ప్రణాళిక రూపొందించినప్పటికీ లింగసమానత్వాన్ని అందులో పొందుపరచకపోతే మహిళలు, బాలికలు భాగస్వాములు కావడం తక్కువగానే ఉంటుంది. దేశవ్యాప్తంగా ఇలాంటి ఐసిటి ప్రాజెక్టులపై నిర్వహించిన విశ్లేషణలో ఇలాంటి ప్రాజెక్టుల్లో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉన్నట్టయితే పేదవర్గాల మహిళల భాగస్వామ్యం మరింత తక్కువగా ఉంటుందని తేలింది. అంతే కాదు లింగపరమైన భాగస్వామ్యంపై గణాంకాలు కూడా తక్కువగానే ఉన్నాయి. అందువల్ల ఇలాంటి నివేదికల్లోని వాస్తవాలను మదింపు చేయడం కష్టం అవుతుంది. ఈ కారణంగా గతంలో చేపట్టిన వాటితో పాటు వర్తమాన ప్రాజెక్టులన్నింటినీ లింగసమానత్వ కోణం నుంచి తిరిగి సమీక్షించడం అవసరం.

పేదలు ఇలాంటి ప్రాజెక్టుల్లో తక్కువగా భాగస్వాములు కావడానికి టెక్నాలజీల అందుబాటు లేకపోవడం, భరించగల స్థాయిలో లేకపోవడం, సరైన నైపుణ్యాలు లేకపోవడం కారణం. అలాగే సాంకేతికపరమైన మౌలిక వసతులు, అనుసంధాన వ్యయాలు, కంప్యూటర్ అక్షరాస్యత, భాషా నైపుణ్యాలు కూడా ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి. ఇతర సామాజిక, సాంస్కృతిక అంశాల కారణంగా ఈ అవరోధాలు మరింత తీవ్రతరం అవుతున్నాయి. ఉదాహరణకి భూమిపై యాజమాన్య హక్కులు, గృహసంబంధమైన నిర్ణయాలు తీసుకోవడం వంటి అవకాశాలు మహిళలకు అందుబాటులోకి రాకపోతే కమ్యూనిటీ ఆధారిత ఐసిటి ఇ-వ్యవసాయ ప్రాజెక్టుల ప్రయోజనాలు మహిళలకు అందడం కష్టమే అవుతుంది. పురుషులకు వలెనే మహిళలకు కూడా ఐసిటిలు అందుబాటులో ఉంచకపోతే వారు సాంకేతికతకు మరింత దూరం అయిపోతారు.

మహిళలు ఎదుర్కొంటున్న ఈ అవరోధాలు ఐసిటికే పరిమితం కాదు.

- అక్షరాస్యత మహిళలు ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. మహిళల్లో నిరక్షరాస్యత సమస్యను పరిష్కరించడంలో ఆడియో, వీడియో టెక్నాలజీలు కొంతమేరకు సహాయపడుతున్నప్పటికీ ఐసిటిల నుంచి వారు పూర్తి స్థాయి ప్రయోజనం పొందాలంటే అక్షరాస్యత పెంచడం చాలా అవసరం.
- పేదరికం, ఆర్థిక సాధికారికత లేకపోవడం మహిళలకు మరో ప్రధాన ప్రతికూలత.
- గృహసంబంధ బాధ్యతల కారణంగా మహిళలు అక్షరాస్యులు కావడానికి, అభ్యాసానికి తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు.
- శిశు సంరక్షణ కేంద్రాలు, పరస్పర సంప్రదింపులకు అవసరమైన స్థలాల కొరత, పరివర్తన శక్తులుగా మహిళలను తీర్చి దిద్దడానికి అవసరమైనంత మంది శిక్షకులు, బోధకులు లేకపోవడం కూడా మహిళల ఐసిటి వినియోగ పరిధిని కుంచింపచేస్తున్నాయి.
- సామాజిక, సాంస్కృతిక కట్టుబాట్లు కూడా మహిళలను ఐసిటికి దూరంగా ఉంచుతున్నాయి. ఫలితంగా వారు అక్షరాస్యతను సాధించలేకపోతున్నారు.

పై వాటిలో ఒకటి లేదా కొన్ని అంశాలు కలిసి మహిళల పురోగతికి అవరోధంగా నిలుస్తున్నాయి. పాఠ్యాంశాలు స్థానిక భాషల్లో అందుబాటులో ఉంచలేకపోతే ఐసిటిల ప్రయోజనాన్ని మహిళలు పూర్తిస్థాయిలో అందుకోలేకపోతారు.

### 3.5. మహిళా సాధికారికతలో ఐసిటి

మహిళల సాధికారికత శక్తిగా ఐసిటి గురించి అవగాహన పెంచుకోవాలంటే లింగసమానత్వం, అభివృద్ధికి సంబంధించిన సాహిత్యాన్ని మరోసారి పరిశీలించాల్సి ఉంటుంది. ఆధిపత్యం, సామర్థ్యం, అంతర్గత శక్తి, సహకారం, భాగస్వామ్యం కోణాల నుంచి చూస్తే స్వభావరీత్యా సాధికారికతే ఒక "శక్తి". మహిళా ఉద్యమకారుల కోణంలో నుంచి చూస్తే సాధికారికత అంటే సామర్థ్యాల పెంపు. అందుకే తమ జీవితాలను తీర్చి దిద్దుకోవడంలోను, వనరులు సాధించడంలోను, నిర్ణయాల్లోను మహిళలు పూర్తి అదుపు సాధించడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

ఐసిటి ద్వారా మహిళా సాధికారికత సాధించడానికి రెండు కోణాల నుంచి ప్రయత్నిస్తారు. వ్యక్తిగత సాధికారికత, మహిళాసంఘాల సాధికారికత. ఈ రెండూ కూడా ఒక దానికి ఒకటి బలంగా నిలుస్తాయి. మహిళల వెనుకబాటుకు ప్రధాన అవరోధంగా నిలుస్తున్న అక్షరాస్యత, విద్య, ఆరోగ్యం వంటి అంశాలను గుర్తించి పరిష్కరిస్తే పేదరికం నుంచి బయటపడేందుకు, తమ వాక్కును బలంగా వినిపించేందుకు వారికి ఐసిటి ఒక వేదికను సమకూరుస్తుంది.

ఏ రంగాల్లో ఎంతమంది మహిళలు పని చేస్తున్నారనే అంశంపై జాతీయ స్థాయిలో గణాంకాలు చెప్పుకోదగినంతగా అందుబాటులో లేకపోయిప్పటికీ ఐటి, ఐటి ఆధారిత విభాగాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగిందనేందుకు, తద్వారా ఆయా కుటుంబాల జీవనశైలిలో మార్పులు వచ్చాయనేందుకు ఆధారాలున్నాయి. లింగవివక్షకు కారణమయ్యే అవరోధాలు తొలగించి విద్యావకాశాలు అందుబాటులోకి వస్తే మహిళలు, బాలికలు ప్రయోజనం పొందినట్టు కూడా ఆధారాలు నిరూపిస్తున్నాయి. ముఖ్యంగా భారత్, ఫిలిప్పీన్స్ వంటి ఐటి ఆధారిత సర్వీసులందించే కేంద్రాల్లో తొలితరంలో అక్షరాస్యులైన యువతులు, గ్రామీణ మహిళలు చాలా మంది తమ ముందుకు వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకుని కుటుంబాలను పేదరికం సంకెళ్ళ నుంచి విముక్తం చేశారు. భారతదేశంలో గత దశాబ్ది కాలంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో పని చేసే మహిళల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇంజనీరింగ్ వంటి రంగాలతో పోల్చితే ఐటి రంగం మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించడం ద్వారా లింగసమానతకు దోహదపడింది. మహిళా సాధికారికతకు ఐసిటిలు ఏ విధంగా సహాయపడ్డాయనేందుకు 1,2 కేస్ స్టడీలు దర్పణం పడతాయి.

**కేస్ స్టడీ 1 :** నందిని-ఉబెర్‌దోస్త్

బెంగళూరు సమీపంలో నివసిస్తున్న ఒక పేద కుటుంబంలో పెద్దమ్మాయి నందిని. ఆమె డాక్టర్ కావాలని కలలు కంది. కాని అందుకు అవసరమైన ఆర్థిక వనరులు లేకపోవడం వల్ల ఆమె దూరవిద్యావిధానంలో హైస్కూల్ విద్యను పూర్తి చేసి స్మార్ట్ వ్యాపారం ప్రారంభించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. కాని ఈ ప్రయత్నాలేవీ ఫలించలేదు. తండ్రి మరణించడంతో ఆ కుటుంబాన్ని విషాదం ఆవరించింది. కుటుంబం కోసం భారీ మొత్తాల్లో చేసిన అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఆమెకు ఎదురయింది. సరిగ్గా అదే సమయంలో ఉబెర్ రిఫరల్స్‌లో మంచి ఆదాయం ఆర్జించగల అవకాశం ఆమెకు కనిపించింది. డ్రైవర్లను, ప్రయాణం కోసం వాహనాలు కావాలని కోరే వారిని ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసే రవాణా నెట్‌వర్క్ ఉబెర్. ఈ నెట్‌వర్క్ విస్తరణ కోసం సాధారణ ప్రజలెవరైనా ఉబెర్‌కు డ్రైవర్ల పేర్లు రిఫర్ చేసేందుకు ఆ సంస్థ ఉబెర్‌దోస్త్ అనే ఒక వేదిక ప్రారంభించింది. అందులో ఉన్న అవకాశాన్ని నందిని గుర్తించింది. ఆ అవకాశాలపై కొంత పరిశోధన కూడా నిర్వహించి చిన్న కార్యాలయం ఏర్పాటు చేసుకుని డ్రైవర్ల పేర్లు ఉబెర్‌కు రిఫర్ చేసే పని ప్రారంభించింది. ఈ రోజు ఆమె నెలకు రెండు లక్షల రూపాయలు కేవలం ఉబెర్‌దోస్త్ రిఫరల్ కార్యక్రమం ద్వారా ఆర్జిస్తూ కుటుంబం అప్పులు తీర్చడమే కాకుండా సోదరి వివాహం కూడా చేసింది. సొంతిల్లు కూడా సమకూర్చుకుంది.

**కేస్‌స్టడీ 2 :** షీలా అండ్ ఎలాన్స్

ఫిలిప్పీన్స్‌కు చెందిన లైబ్రేరియన్ షీలా ఓర్సెంటో గంటకి 1.5 డాలర్లు సంపాదిస్తూ కుటుంబపోషణ కనాకష్టంగా జరిగేది. ఇ-పుస్తకాల కేటలాగ్ అయిన ఎలాన్స్‌తో ఫ్రీలాన్సర్‌గా పని చేయడం ప్రారంభించిన తర్వాత ఆమె సంపాదన గంటకి 8.5 డాలర్లకు పెరిగింది. దీంతో పెద్ద మొత్తంలో సొమ్ము ఆదా చేసి రాజధాని మనీలాలోనే ఒక నివాసం, ఇతర ఆస్తులు సమకూర్చుకోగలిగారు. ఫ్రీలాన్సర్లను, ప్రాజెక్టు యజమానులను అనుసంధానం చేసే ఆన్‌లైన్ వేదిక ఎలాన్స్. ఈ వేదికపై పలు స్టార్టప్‌లు, ఎస్ఎంఇలు పేర్లు నమోదు చేసుకుని ఇతరులను ఫ్రీలాన్సర్లుగా నియమించుకుని పని చేస్తారు. తక్కువ రేట్లకు అందుబాటులో ఉండే అమిత వేగవంతమైన ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఐటి రంగానికి కావలసిన డేటా ఎంట్రీ కార్యకలాపాలను నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఐసిటి రంగం ఉపాధికల్పనలో కీలకపాత్ర పోషిస్తున్నదని గణాంకాలు తెలుపుతున్నాయి. అయితే ఈ విస్తరణ పరిపూర్ణంగా లేదు. ఇక్కడ కూడా మహిళలకు చుక్కెదురవుతోంది. కాని అందుబాటులో ఉన్న విద్యావకాశాలు

ఉపయోగించుకుని ఐసిటి ఉపాధి మార్కెట్‌లో మహిళలు తమ శక్తిని చాటుతున్నా పనివత్తిడిని, లింగవివక్షను తట్టుకోలేక చాలా మంది ఉద్యోగాలు వదిలేస్తున్నారు. ఇదే ఐసిటి మాధ్యమంగా మహిళలు లబ్ధి పొందిన ఆధారాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ప్రధానంగా ఇండియా, మలేసియా, ఫిలిప్పీన్స్, శ్రీలంకల్లో వ్యవస్థీకృత మహిళా బృందాలు ఐసిటిని ఉమ్మడిగా ఉపయోగించుకుని లబ్ధి పొందుతున్నాయి.

**కేస్‌స్టడీ 3** : కర్ణాటకలో సాధికారికతకు ఐసిటిని ఉపయోగించుకున్న ఐటి ఫర్ చేంజ్

దక్షిణ భారతంలోని కర్ణాటకలో ఒక ప్రభుత్వేతర సంస్థ ఐటి ఫర్ చేంజ్ మహిళా సాధికారికతకు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా దోహదకారి అవుతుందో 'ప్రక్రియే' (సామాజిక సమాచార, అభివృద్ధి కేంద్రం) అనే సంస్థతో కలిసి పని చేయడం ద్వారా నిరూపించింది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నిర్వహణలో పని చేస్తున్న జాతీయ మహిళా సాధికారికత ప్రాజెక్టుకు అనుబంధమైన రాష్ట్రస్థాయి మహిళా సమాఖ్య ఇది. ఐసిటి సాధనాలను మహిళా సాధికారికతకు ఇటుకరాళ్ళుగా ఉపయోగించుకోవచ్చునన్న విశ్వాసంతో పని చేసిన ప్రక్రియే మూడు డిజిటల్ సాధనాలను అభివృద్ధి చేసింది. అందులో మొదటిది కేలుశక్తి (నా మాట విను మిత్రమా) అనే వారం వారం ప్రసారం చేసే రేడియో కార్యక్రమం. రెండోది బ్యాంకు రుణాలు పొందడం ఎలా, మహిళల హక్కులేమిటి అన్న అంశాలపై వీడియోలు తయారుచేసి ప్రసారం చేసే కార్యక్రమం. మూడోది మహిళలకు అవసరమైన సమాచారం అందించేందుకు గ్రామాల్లో మహిళలే నిర్వహించే సమాచార కేంద్రాల ఏర్పాటు. ఇది టెక్నాలజీ వినియోగం ఒక్కటే కాదు...సామర్థ్యాల నిర్మాణం, సాధికారత సంస్కృతిని అలవాటు చేయడం.

**కేస్‌స్టడీ 4** : బంగ్లాదేశ్‌లో ఇన్ఫోలేడీస్

ఇన్ఫోలేడీస్‌గా పని చేసే యువతులు బంగ్లాదేశ్‌లో గ్రామీణ మహిళలకు, మేథస్సుకు వారధిగా నిలుస్తున్నారు. ఒక లాప్‌టాప్, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ఇన్ఫోలేడీస్ ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ విస్తరణ సమాచార సేవలు, ఐసిటి సేవలను గ్రామీణ ప్రజలకు అందిస్తున్నారు. ఉదాహరణకి వారు గర్భిణీ మహిళలకు గర్భం దాల్చిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై చైతన్యం కల్పించడంతో పాటు తమ దగ్గర ఉండే మెడికల్ కిట్ సాయంతో ప్రాథమిక చెకప్ చేయడం, ఫోలిక్ యాసిడ్ వంటి ఉత్పత్తుల విక్రయం వంటి పనులు కూడా నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వం, ఎన్‌జిఓలు, ప్రైవేటు రంగం అందుబాటులో ఉంచే టెక్నాలజీలను ఉపయోగించుకుని ఆన్‌లైన్ బర్త్ రిజిస్ట్రేషన్, మొబైల్ బ్యాంకింగ్ సేవలందించడం వంటి కార్యకలాపాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్లస్ 2 విద్యార్హతలుండి అల్పాదాయ, పేద కుటుంబాలకు చెందిన బాలికలు ఇన్ఫోలేడీస్‌గా పని చేస్తున్నారు. వీరు విజయం సాధించడానికి మూడు అంశాలు దోహదపడుతున్నాయి. 1) ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ధోరణి, 2) త్వరితగతిన నేర్చుకునే స్వభావం, 3) చక్కని సంభాషణ ప్రసార నైపుణ్యాలు వారికి మద్దతు ఇచ్చేందుకు తక్కువ వడ్డీ రుణాలను కేంద్ర బ్యాంకు అందుబాటులో ఉంచింది.

**కేస్‌స్టడీ 5** : ఆగ్నేయ భారతంలోని థేనిలో గొర్రెల పెంపకందారులు

భారత ఆగ్నేయ ప్రాంతంలోని థేని జిల్లాకు చెందిన మహిళలు రైతన్నలకు కామన్వెల్త్ అందుబాటులో ఉంచిన జీవితకాల అ అభ్యాస కార్యక్రమం కింద గొర్రెల పెంపక, వ్యాపార నిర్వహణపై శిక్షణ పొంది సొంత కంపెనీ ప్రారంభించారు. 15 సంవత్సరాల క్రితం వారికి కనీసం మొబైల్ ఫోన్ అంటే ఏమిటో కూడా తెలియదు. కాని ఇప్పుడు వారు అదే మొబైల్‌ను ఉపయోగించుకుని గొర్రెల్లో ఉత్పాదకత పెంచడం ఎలా, మంచి బ్రీడ్ ఎలా ఎంపిక చేసుకోవాలి, గొర్రెలను ఎలా సంరక్షించుకోవాలి వంటి అంశాలపై తమ సభ్యులందరికీ వాయిస్‌మెయిల్

మెసేజ్‌లు పంపి వ్యాపారాభివృద్ధికి దోహదపడుతున్నారు. వారు ఎంతో గర్వంగా తమను తాము ''వాయిస్‌మెయిల్ రైతులు''గా వ్యవహరించుకుంటారు. గొర్రెల పెంపకం కార్యకలాపాల ద్వారా గరిష్ఠ లాభాలు పొందేందుకు వీలుగా మధ్యదళారీలను దూరంగా ఉంచేందుకు విడియాల్ అనే ఎన్‌జిఓ, నబార్డ్ సహకారంతో థేని జిల్లా గొర్రెల పెంపకందారుల కంపెనీ పేరిట సొంతంగా ఒక సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. 2016 జనవరిలో కంపెనీల చట్టం కింద దీన్ని రిజిస్టర్ చేశారు. 10 మంది సభ్యుల డైరెక్టర్ల బోర్డు ఈ సంస్థను నిర్వహిస్తుంది. బోర్డులో ఎనిమిది మంది మహిళలు, ఇద్దరు పురుషులు ఉంటారు. సొంత సభ్యుల నుంచే షేర్ల కేటాయింపు ద్వారా నిధులు సమీకరిస్తారు. ఒక్కో సభ్యుడు వంద షేర్లు తీసుకోవాల్సి ఉంటుంది. కంపెనీ ఆర్జించే లాభాలను సభ్యులకు డివిడెండుగా చెల్లించడంతో పాటు మిగతా సొమ్మును రిజర్వ్‌గా సొసైటీ వద్ద ఉంచుకుంటారు.

**కేస్‌స్టడీ 6** : ఐసిటి సహకారంతో మార్పు తెచ్చిన 'సేవ'

అవ్యవస్థీకృత రంగంలోని నిరుపేదలు, స్వయంఉపాధి పొందిన మహిళలతో కలిసి పని చేసేందుకు భారత్‌లో ఆవిర్భవించిన సంస్థ సేవా లేదా స్వయంఉపాధి మహిళల సంఘం. ఈ సంఘం తమ సభ్యుల ఇళ్ళలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి వాటితో ఎలా పని చేయాలో శిక్షణ ఇచ్చింది. తదుపరి క్రమంలో ఈ సంస్థ కమ్యూనిటీ లెర్నింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాలు, శిక్షణాశిబిరాలు, సదస్సులు నిర్వహించడం ద్వారా ఐసిటి వినియోగంపై మహిళలను చైతన్యవంతులు చేసింది. ఫలితంగా వారందరూ ఎంతో ప్రయోజనం పొందారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో సంఘటిత శక్తిగా మహిళలు ఏం సాధించగలరో తెలియచేసేందుకు పలు ఉదాహరణలున్నాయి. కొన్ని చోట్ల వారికి అనుకూలమైన విధానాలు కూడా ప్రభుత్వాలు రూపొందించాయి. ఇలా సంఘటితంగా విజయాలు సాధించిన వారి కేసులను ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక సంస్థ (ఎస్కాప్) అధ్యయనం చేసింది. లింగప్రాధాన్యత గల ఇ గవర్నెన్స్ విధానాలు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తేల్చింది. తమ అభిప్రాయాలను స్పష్టంగా, ఎదుటి వారికి అర్థం అయ్యే విధంగా వ్యక్తీకరించడానికి, హక్కులకు మద్దతు కూడగట్టడానికి మహిళలు ఐసిటిని సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు. మంగోలియాకు చెందిన డెమోక్రాటిక్ విమెన్స్ యూనియన్ మహిళల ఆన్‌లైన్ వేదికను ఏర్పాటు చేయడంతో పాటు పార్లమెంటులో మహిళల సంఖ్య పెరిగేందుకు కూడా పోరాటం చేసింది. 2010 నుంచి 2012 మధ్యలో ఈ సంస్థ చేసిన పోరాటం ఫలితంగా పార్లమెంటులో మహిళా ప్రాతినిథ్యం సున్నా నుంచి ఆరుకి పెరిగింది.

**కేస్‌స్టడీ 7** : ఆన్‌లైన్ అడ్వకసీ వేదిక ఏర్పాటు చేసిన లిఖాన్

ఫిలిప్పీన్స్‌లో గ్రామీణప్రాంతాల్లో పని చేస్తున్న మహిళా ఆరోగ్య సంస్థ లిఖాన్. పునరుత్పాదక ఆరోగ్య బిల్లును ఆమోదింపచేసేందుకు ఈ సంస్థ దశాబ్ది పాటు పోరాటం చేసింది. లైంగిక, పునరుత్పాదక ఆరోగ్య సేవలు అవసరమైన సమాజంలోని దిగువ వర్గాలకు చెందిన మహిళలు, యువతులతో అకౌంట్లు తెరిపించి వాటి సహాయంతో తమ కార్యకలాపాలకు ప్రజల మద్దతు కూడగట్టడం ద్వారా చట్టసభలపై వత్తిడి తీసుకువచ్చి ఆ బిల్లు ఆమోదం పొందేందుకు కృషి చేసింది. భారత్‌లో 2012 డిసెంబరులో జరిగిన దారుణమైన గ్యాంగ్‌రేప్ కేసు అనంతరం మహిళలు, బాలికలు సోషల్ మీడియా ద్వారా అనుసంధానం కావడం పెరిగింది. వారందరూ భారతదేశంలో అమలులో ఉన్న రేప్ చట్టాలపై ఆగ్రహజ్వాలలు ప్రకటించడం ద్వారా చట్టాల్లో మార్పులు తీసుకురాగలిగారు. ఆన్‌లైన్ వేదికగా జరిగిన ఈ పోరాటంతో కదలిక వచ్చిన చట్టసభల సభ్యులు ఆ బిల్లులో మార్పులు చేసే విషయం ఆలోచించారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా మహిళలు తమ జీవితాలను మెరుగుపరుచుకునేందుకు ఐసిటిని మాధ్యమంగా ఉపయోగించుకున్నారు.

**అభ్యాసం చేయాల్సినవి...**

- సమాజంలో మహిళలు, బాలికల హోదాను నిర్వచించే పలు పరిస్థితులను ఈ విభాగంలో పొందుపరచడం జరిగింది.
- మీ దేశంలో మహిళలు, బాలికల పురోగతికి అవరోధాలుగా ఉన్న అంశాలను రాసి పెట్టుకోండి. పైన పొందుపరిచిన పరిస్థితులకు అవి భిన్నంగా ఉండవచ్చు. ఆ తేడా ఏమిటో గుర్తించండి.
- మహిళలు, బాలికల జీవితాలను మార్చగల శక్తిగా ఐసిటిని ఏ విధంగా ఉపయోగించవచ్చు అధ్యయనం చేయండి.

# IV. మహిళల కోసం లింగసమానత్వ విధానాల రూపకల్పన

## బోధన ఫలితం

ఈ సెక్షన్‌ను చదివిన తర్వాత చదువరులకు ఈ దిగువ అంశాలపై అవగాహన ఏర్పడుతుంది.

- లింగ సమానత్వం అందించే విధానాలను, వ్యక్తిగత లక్షణాలు గుర్తించగలుగుతారు.
- ఆయా దేశాల పరిస్థితులకు అనుగుణంగా ఐసిటిడి కార్యక్రమాల అమలుపై పరిస్థితి విశ్లేషణ, జండర్ ఆడిట్
- తమతమ దేశాల్లో ఐసిటిడి చొరవల్లో లింగసమానత్వ దశలను గుర్తించగలుగుతారు.
- 'మొత్తం దేశంలో' లేదా ప్రాజెక్టులవారీగా లింగసమానతకు పట్టం కట్టే విధానాల గుర్తింపు, కార్యాచరణపై అవగాహన

సామాజిక పరివర్తన జాగ్రత్తగాను, ప్రణాళికాబద్ధంగాను రూపొందించే విధానాలు, కార్యక్రమాలతోనే లింగసంబంధాల్లో మార్పులు సాధ్యమవుతాయి. మానవ హక్కులు, ఆత్మగౌరవ సిద్ధాంతాల ఆధారంగా పరిణతి సాధించిన, అభివృద్ధి చెందిన సమాజం లింగసమానత్వ విధానాలు, కార్యక్రమాల ద్వారా లింగవివక్ష లేని పాలన అందించగలుగుతుంది. లింగసమానత్వ సిద్ధాంతంతో పని చేసే ప్రభుత్వం మహిళలు, పురుషుల వేర్వేరు అవసరాలు, ప్రయోజనాలు, ప్రాధాన్యతలు, లింగఅసమానతల్లో గల సవాళ్ళు గుర్తిస్తుంది. అలాంటి సమాజంలోని సంస్థలు, అవి అనుసరించే విధానాలు కూడా అన్నికోణాల నుంచి పరిశీలించి లింగసమానత్వంతో కూడిన విధానాలు, ప్రణాళికలు, కార్యక్రమాల ప్రాధాన్యతను గుర్తించి సమాజంలో మహిళలు, పురుషులు సమానంగా లబ్ధి పొందే విధంగా వాటిని ఆచరిస్తుంది. లింగసమానత్వం సాధించడానికి సమగ్ర వ్యూహం అనుసరించడాన్నే జండర్ మెయిన్‌స్ట్రీమింగ్‌గా వ్యవహరిస్తారు. లింగసమానతకు 1997లో ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నిర్వచనం ఇలా ఉంది...

"చట్టాలు, విధానాలు, కార్యక్రమాలు...అన్ని స్థాయిల్లోనూ ఎలాంటి ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ అయినా మహిళలు, పురుషులపై దాని ప్రభావాన్ని గుర్తించేదే లింగసమానత్వం. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల కోసం రూపొందించే విధానాలు ఏవైనా మహిళలు, పురుషుల అవసరాలే కేంద్రబిందువుగా రూపొందించి వాటి అమలు, పర్యవేక్షణ, మదింపు అన్నింటికీ లింగసమానత్వ ధోరణి అనుసరించడం వల్ల మహిళలు,పురుషులు సమానంగా లాభం పొందుతారు. అసమానతలు విజృంభించవు."

దీన్ని మరోకోణంలో కూడా నిర్వచించవచ్చు.

"అభివృద్ధిక్రమంలోని అన్ని దశలు, ప్రాజెక్టులు, విధానాలు, కార్యక్రమాల్లో మహిళలు, పురుషులకు సమ ప్రాధాన్యం కల్పించడం, వనరులపై ఉభయ వర్గాలకు సమాన అదుపు ఉండడం, రెండు వర్గాలు కూడా సమానంగా లబ్ధి పొందడమే లింగ సమానత్వం".

సామాజిక సమానత్వ సాధనకు లింగసమానత్వంతో కూడిన విధానాలు, ప్రాజెక్టులు, కార్యక్రమాలు అవసరం అన్న అవగాహన లేని కారణంగా ఎలాంటి దురుద్దేశాలు లేకుండానే లింగప్రాధాన్యం లేని కార్యాచరణ విధానాల రూపకల్పన జరిగే ఆస్కారం ఉంది. అలాగే కొన్ని సందర్భాల్లో "లింగతటస్థ" విధానాలే మహిళలు, పురుషులకు

అనుకూలం, ఆచరణీయం అనే నమ్మకంతో విధానాలు రూపొందించడం పరిపాటి. కాని అవి లింగసమానత్వ విధానాలకు విరుద్ధంగా ఉంటాయి. లింగసమానత్వ విధానం అంటే ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, కార్యక్రమాలను పనికిరానివిగా ప్రకటించి కొత్త విధానాలు ప్రవేశపెట్టడం కాదు. ఆచరణలో ఉన్న విధానాలే మరింత సమర్థవంతంగాను, లబ్ధిదారుల అవసరాలకు స్పందించేవిగాను, పారదర్శకంగాను, బాధ్యతాయుతంగాను తీర్చి దిద్దడమే లింగసమానత్వ లక్ష్యం. ఈ లింగసమానత్వ విధానం అనేది యావత్ ప్రభుత్వానికి, వేర్వేరుగా భిన్న రంగాలకు కూడా వర్తింపచేయవచ్చు.

**కేస్‌స్టడీ 8** : కంబోడియాలో లింగసమానత్వం

1993లో ఆమోదించిన కంబోడియా రాజ్యాంగంలో 35వ అధికరణం మహిళలు, పురుషులకు చట్టం ముందు సమాన హక్కులు కల్పించింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవనంలో సమానంగా పాల్గొనే స్వేచ్ఛ ఇచ్చింది. ఉపాధిలో సమానత్వం, వేతనాల్లో సమానత్వం కల్పించింది. 45వ అధికరణం మహిళల పట్ల వివక్షను పూర్తిగా నిషేధించింది. ఇందుకు అనుగుణంగానే కంబోడియాలోని రాచరిక ప్రభుత్వం మొత్తం కార్యకలాపాలన్నింటిలోనూ లింగసమానత్వానికి పెద్దపీట వేసింది. ఇందుకు అత్యున్నత స్థాయి రాజకీయ మద్దతు కూడా లభించింది. ఈ విధానం ఎలా అమలుజరుగుతున్నది మదింపుచేసేందుకు ఉమ్మడి పర్యవేక్షణ సూచికలు రూపొందించి ప్రతీ 18 నెలలకు ఒకసారి టెక్నికల్ వర్కింగ్ గ్రూప్ దాన్ని సమీక్షించే ఏర్పాటు చేసింది. 2014 నుంచి ఈ విధానం అమలులో ఉంది. భిన్న రంగాల్లో లింగసమానత్వం ఏ విధంగా ఉన్నది తెలియచేసేందుకు మహిళా వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రమం తప్పకుండా (2004, 2008, 2014) సమగ్ర విశ్లేషణ నిర్వహిస్తూ వస్తోంది. ప్రాజెక్టు ఆధారిత విధానం నుంచి కార్యక్రమం ఆధారిత విధానంలోకి మారడం ద్వారా అన్ని కార్యక్రమాలు, కార్యకలాపాల్లో లింగసమానత్వం కచ్చితంగా అమలుజరిగేలా చూసేందుకు జాతీయ స్థాయి నుంచి కమ్యూనిటీ స్థాయి పర్యవేక్షణకు క్రియాశీల యంత్రాంగాలను ఏర్పాటు చేసింది. అన్ని స్థాయిల్లోను విధానాలకు, ఆచరణీయతకు మధ్యన భారీ వ్యత్యాసం ఉంటుందని రాచరిక ప్రభుత్వం గుర్తించింది.

ఇక ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) ఆసియా, పసిఫిక్ దేశాల్లో లింగసమానత్వంతో కూడిన విధానాల అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక విధానాలను తయారుచేసింది.

- నేపాల్‌లో ఎడిబి, నేపాల్ ప్రభుత్వం ఉమ్మడిగా లింగసమానత్వం, మహిళా సాధికారికత ప్రాజెక్టును అమలుచేస్తున్నాయి. రాజకీయ, సామాజిక, చట్టపరమైన విధానాలన్నింటినీ సంఘటితం చేసి ప్రాజెక్టులను అమలుచేయడం, గ్రామీణ, నిరాదరణకు గురవుతున్న వర్గాలకు చెందిన మహిళలను భాగస్వాములను చేయడం ద్వారా పేదరికాన్ని తగ్గించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. స్థానిక పరిస్థితులకు స్పందించే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించడం దీని ప్రత్యేకత.
- శ్రీలంకలో రెండు ప్రాజెక్టులను భాగస్వామ్య విధానంలో స్థానిక సమాజాల అభివృద్ధి మూలబిందువుగా రూపొందించారు. స్థానిక సమాజాలకు అవసరం అయిన మౌలిక వసతులకు అందరినీ భాగస్వాములను చేయడం, లింగసమానత్వ ప్రాతిపదికన అభివృద్ధి చేయడం, గుర్తించిన సమాజ వర్గాల్లో జీవనోపాధి పునరుద్ధరణ చేపట్టడం ఈ ప్రాజెక్టుల లక్ష్యం.
- బంగ్లాదేశ్‌లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి ప్రాజెక్టు కింద ఎస్ఎంఇల అభివృద్ధి, విస్తరణకు 2009-2013 మధ్య కాలంలో చక్కని మద్దతు అందించారు. ప్రధానంగా మహిళలు నడుపుతున్న ఎస్ఎంఇలు ఎదుర్కొంటున్న సవాళ్ళు, అవరోధాలను అధిగమించేందుకు అవసరమైన సహకారం అందించడం ఈ

ప్రాజెక్టులో ఒక అంశం. దీన్ని ప్రయోగాత్మకంగా అమలుపరిచిన జిల్లాల్లో మహిళల యాజమాన్యంలోని ఎస్ఎంఇలు 10 శాతం మేరకు పెరిగాయి. మహిళా ఎస్ఎంఇ యజమానులకు వ్యాపారాభివృద్ధి, అకౌంటింగ్, రుణదరఖాస్తుల నిబంధనలు, ప్రాసెసింగ్, వ్యాపారాలకు వర్తించే నియంత్రణలపై శిక్షణ ఇవ్వడం వల్ల వారికి సంస్థాగత రుణాల లభ్యత పెరిగింది. అలాగే వారికి మార్గదర్శకత్వం చేసే బృందాలు, సభ్యత్వ సంఘాలు ఏర్పాటు చేయడం వల్ల ఎస్ఎంఇ యజమానుల్లో స్వంత సామర్థ్యాలపై విశ్వాసం పెరిగి విధానాల్లో మార్పుల కోసం వత్తిడి చేయగలిగే సామర్థ్యాలు ఏర్పడ్డాయి.

- ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతిస్థాపన కృషిలో కూడా మహిళలను భాగస్వాములను చేయడం కోసం యుఎన్ హాబిటాట్ ఒక ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా కమ్యూనిటీ సాధికారికత సాధన ద్వారా శాంతిని స్థాపించే ప్రయత్నం చేశారు. దీనివల్ల మహిళల్లో సంఘటితత్వం పెరిగి ఒకరి అనుభవాల నుంచి మరొకరు పాఠాలు నేర్చుకుని తమ వాక్కును వినిపించే సామర్థ్యాలు సాధించారు. ప్రాజెక్టు నిర్వాహకులు ఆయా సమాజాల్లో లింగవివక్ష గల విభాగాలను గుర్తించి మహిళలకు అనుకూలమైన సామాజిక, ఆర్థిక ప్రాజెక్టులను ప్రత్యేకంగా చేపట్టారు.

సమాజంలోని విభిన్న వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడానికి లింగ విశ్లేషణ నైపుణ్యాలను ఉపయోగించవచ్చునేందుకు ఈ ఉదాహరణలు దర్పణం పడుతున్నాయి. అయితే లోతైన విశ్లేషణకు మాత్రం ప్రత్యేకనైపుణ్యాలు అవసరం.

విధానాల రూపకల్పనలో లింగసమానత్వాన్ని కూడా ఒక భాగం చేసేందుకు మార్గాలెన్నో ఉన్నాయి. అలాంటి ఉపకరణాలు, వనరుల ఆధారంగా లింగసమానత్వ సాధన విధాన నిర్ణయాల్లో భాగంగా చేయడం ఎలా అనే విషయం ఈ దిగువన చర్చిద్దాం.

## 4.1. లింగసమానత్వ సాధనకు మార్గాలు

లింగసమానత్వ సాధన అనేది ప్రభుత్వ శాఖలు, మంత్రిత్వ శాఖలు ప్రత్యేకంగా చేపట్టాల్సిన అంశం ఏ మాత్రం కాదు. భిన్న విధానాలు, కార్యక్రమాల్లో అది అంతర్గతంగానే ఉండాలి. లింగసమానత్వ సాధన అంటే మహిళలను వేరుగా చూడడం కూడా కాదు. అభివృద్ధి క్రమంలో వారిని పురుషులతో సమాన భాగస్వాములుగా పరిగణించడం. సమాజంలో అందుబాటులో ఉన్న వనరులనే మహిళలు, పురుషులకు సమాన లాభం చేకూరేలా వినియోగంలోకి తేవడం. సూక్ష్మంగా చెప్పాలంటే అసమానతలకు కారణం అవుతున్న అంశాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం ద్వారా సత్ఫలితాలు సాధించేందుకు కృషి చేసే ప్రక్రియనే లింగసమానత్వ విధానంగా చెప్పవచ్చు. ఈ లింగసమానత్వం సాధించేందుకు భిన్న మార్గాలున్నాయి. వేర్వేరుగా ఆ విధానాల వల్ల సమకూరే ప్రయోజనం కూడా భిన్నంగానే ఉంటుంది.

### 4.1.1. లింగ చైతన్యం

ప్రవర్తనాపరంగా మహిళలు, పురుషుల మధ్య వ్యత్యాసం ఉంటుందన్న అవగాహన చాలా అవసరం. మహిళలు, పురుషుల మధ్య ప్రవర్తనలో ఈ వ్యత్యాసానికి కారణం సామాజికమైన అంశాలే. ఈ వ్యత్యాసాలు వనరుల అందుబాటు, అదుపు రెండింటినీ ప్రభావితం చేస్తాయి. ఇలాంటి అంశాలను గుర్తించి విధానకర్తలను, కార్యక్రమ నిర్వాహకులను, ప్రాజెక్టుల్లో పని చేసే వారిని కూడా చైతన్యపరచాల్సిన అవసరం ఉంది.

**అభ్యాసం చేయాల్సిన అంశాలు...**

ఈ కింది సమస్యను అవగాహన చేసుకుని దాన్ని పరిష్కరించేందుకు మీ మార్గం ఏమిటో ఆలోచించండి...

మీ కార్యాలయంలో మధ్యస్థాయి ఉద్యోగానికి ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు అర్హులుగా గుర్తించారు. ఈ ముగ్గురూ సమానార్హతలు, సమానమైన అనుభవం ఉన్న వారే. మీరడిగిన ఒక ప్రశ్నకు తాను త్వరలో వివాహం చేసుకుంటానని షీలా చెప్పింది, తనకు అప్పటికే వివాహం అయిందని రోమా చెప్పింది. పురుషుని మాత్రం మీరు ఈ ప్రశ్న అడగలేదు.

- ఈ అవగాహన ఆధారంగా చివరి ఎంపికకు మీరు తీసుకునే కొలమానం ఏమిటి?
- ఎవరిని ఉద్యోగానికి ఎంపిక చేస్తారు, అందుకు కారణం ఏమిటి?
- మీలో అంతర్గతంగా ఉన్న మొగ్గు గురించి మీ ఎంపిక ఏం చెబుతుంది?

### 4.1.2. లింగ విశ్లేషణ

లింగసమానత్వం కోసం విధానాల రూపకల్పనలో భాగంగా అవసరమైన సమాచార సేకరణ, ప్రాసెసింగ్, విశ్లేషణ ఇందులో భాగంగా ఉంటాయి. దీని వల్ల స్త్రీపురుషులు పోషిస్తున్న పాత్ర, కార్మికశక్తి విభజన, విలువ వంటి అంశాలకు సంబంధించి లింగపరమైన గణాంకాలు అందుబాటులో ఉంటాయి. ఏయే దేశాల్లో లింగసమానత్వం ఏ విధంగా ఉన్నది అన్న అవగాహన ఏర్పడుతుంది. కొన్ని సూచికలైతే దేశాలవారీగాను, గృహాలవారీగాను మహిళలు పోషిస్తున్న పాత్రపై అంతర్గత దత్తాంశాన్ని కూడా అందుబాటులో ఉంచుతాయి. వనరులను సమానంగా అందించేందుకు, స్త్రీపురుషులు సమానంగా లబ్ధి పొందేందుకు అవసరమైన విధానాల రూపకల్పనకు ఈ విశ్లేషణ సహాయకారిగా నిలుస్తుంది. అలాగే లింగసమానత్వ సాధనకు అవరోధాలు, ప్రతికూలతలు కూడా గుర్తించే వీలు కల్పిస్తుంది. అభివృద్ధి ప్రాజెక్టులు లింగవివక్షతో కూడినవి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకునేందుకు వీలు కలుగుతుంది.

**అభ్యాసం చేయాల్సిన అంశాలు...**

- మీ దేశంలో పురుషులు, మహిళల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కి సంబంధించి వేర్వేరుగా గణాంకాలు అందుబాటులో ఉన్నాయా?
- అందుబాటులో ఉన్నట్టయితే ఆ గణాంకాలు ఎక్కడ పొందవచ్చు, జాతీయ స్థాయిలో విధానాల రూపకల్పనలో ఆ గణాంకాలను ఎలా ఉపయోగించుకోవచ్చు?

భారత్‌లో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు అనుకూల వాతావరణంపై షా నిర్వహించిన అధ్యయనంలో లింగవిశ్లేషణకు ఒక చార్టును రూపొందించారు. (ఫిగర్ 4 చూడండి). షా సిఫారసులు భిన్న విభాగాలకు విస్తరించి ఉన్నాయి.

- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఏమిటి?
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి పౌర సమాజం చేస్తున్న కృషి ఏమిటి?
- ప్రస్తుత విధానాలు -నియంత్రణ, ప్రోత్సాహం, ఆర్థిక సహాయం, ప్రాతినిధ్యం- పరిశ్రమల అభివృద్ధికి ఏ విధంగా దోహదపడేవిగా ఉన్నాయి.
- మహిళల్లో ఔత్సాహిక పారిశ్రామిక ధోరణులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, స్కీమ్‌లు ఏమిటి?
- వ్యాపారాభివృద్ధి సేవలు అందిస్తున్న సంస్థలు -మద్దతు ఇస్తున్న సంస్థలు

లింగవిశ్లేషణపై షా రూపొందించిన విధానం

పనిముట్లు

- ప్రశ్నావళి
- టెలిఫోన్ ద్వారా సవివరమైన ఇంటర్వ్యూ

## మొదటి భాగం

- సెకండరీ గణాంకాల సేకరణ
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లపై ప్రస్తుత పరిశోధన పత్రాల సమీక్ష
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం అందుబాటులో ఉన్న జాతీయ విధానాలు, నిర్మాణాల సమీక్ష
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం అందుబాటులో ఉన్న రాష్ట్ర, ప్రాంతీయ స్థాయి విధానాలు, నిర్మాణాల సమీక్ష
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం కృషి చేస్తున్న సంస్థలు, ఏజెన్సీలు
- సంబంధిత గణాంకాల విశ్లేషణ
- విశ్లేషణ మరియు ముగింపు
- సిఫారసులు మరియు సూచనలు

## రెండో భాగం

- ప్రాథమిక గణాంకాల విశ్లేషణ

మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల ఎంపికకు అర్హతలు, గుర్తింపు, జనాభాపరమైన అధ్యయనాంశాలు

- విద్య
- అనుభవం
- వయసు
- వివాహ హోదా
- సామాజిక మద్దతు
  - పర్యావరణం
  - సవాళ్ళు
  - అవరోధాలు

సామాజిక, సాంస్కృతిక అధ్యయనాంశాలు

- హోదా
- ఇంటిలోను, సమాజంలోను అనుబంధం
- స్వయం అవగాహన

  సంస్థలపరంగా అధ్యయనం
  - ఉత్పత్తి
  - పారిశ్రామిక బృందం, రంగం
  - ఉపాధి
  - ఉత్పత్తి
  - మార్కెటింగ్
  - ఆర్థికసహాయం
  - ఆదాయం

### 4.1.3 లింగశోధన

లింగసమానత్వ సాధన కోసం అనుసరిస్తున్న విధానాలు, చేపట్టిన కార్యక్రమాలు, ప్రాజెక్టులు ఒక దానితో ఒకటి ఏ విధంగా అనుసంధానం అయ్యాయన్నది పరిశీలించడమే జండర్ ఆడిట్. దీని పరిధి విస్తృతమైనది. లింగసమానత్వం కోసం అమలులో ఉన్న చట్టాలు, విధానాలు, బడ్జెట్లు, సిబ్బంది సామర్థ్యం, ఉపకరణాలు, వనరులు, పనిప్రదేశాల్లోని పరిస్థితులు, వ్యవస్థాత్మకమైన అంశాలు అన్నీ పరిశీలనకు వస్తాయి. వేర్వేరుగా ప్రాజెక్టు స్థాయిలో పరిశీలన, అధ్యయనానికి కూడా వర్తిస్తుంది.

**కేస్‌స్టడీ 9** : వియత్నాంలో జండర్ ఆడిట్ టూల్

సోషల్ ఆడిట్‌కు ప్రయోగిస్తున్న ఉపకరణాల్లో భాగంగా జండర్ ఆడిట్‌కు వియత్నాంకు చెందిన ప్రణాళిక, పెట్టుబడుల శాఖ, ఐక్యరాజ్యసమితి బాలల నిధి (యునిసెఫ్) ఉమ్మడిగా ఒక ఉపకరణాన్ని రూపొందించాయి. వియత్నాం అనుసరిస్తున్న సామాజిక, ఆర్థికాభివృద్ధి ప్రణాళిక పురోగతిని, సమాజంపై దాని ప్రభావాన్ని, సామాజికంగా చోటు చేసుకుంటున్న పురోగతిని ఇది సమీక్షిస్తుంది. జనాభాలో సామాజిక, ఆర్థిక అసమానతల తొలగింపు, ప్రజలు ప్రత్యేకించి నిరాదరణకు గురవుతున్న వర్గాల జీవన ప్రమాణాల మెరుగుదల దీని ప్రధాన లక్ష్యం. లింగసమానత్వంపై ప్రాథమిక, సెకండరీ స్థాయిల్లో గణాంకాల సేకరణకు కూడా ఈ ఉపకరణం ఉపయోగపడుతుంది.

### 4.1.4. జండర్ బడ్జెటింగ్

విధానాలు/కార్యక్రమాల రూపకల్పన, వనరుల కేటాయింపు, అమలు, సమీక్ష, ప్రభావం మదింపు, ప్రాధాన్యతలు, కేటాయింపుల్లో అవసరమైన మార్పులు అన్ని స్థాయిల్లోనూ చేయడానికి అనుసరించే విధానమే జండర్ బడ్జెటింగ్. విధానాలు పత్రాల స్థాయిని దాటి ఆచరణ స్థాయికి చేరడం ఇందులో ప్రధానం. సరైన ఆర్థిక వనరులు కేటాయించకుండా ఏ విధానం కూడా సమర్థవంతంగా పని చేయదు. అందుకే సంబంధిత విధానం అమలుకు ఆర్థిక వనరులు కేటాయించారా, కేటాయించిన పనులకే ఆ సొమ్ము వినియోగిస్తున్నారా, సొమ్ము ఎవరి చేతుల్లోకి చేరుతోంది, కేటాయించిన సొమ్ము లింగసమానత్వ సాధనకు ఉపయోగపడుతోందా అన్న అంశాలు పరిశీలనకు వస్తాయి. జండర్ బడ్జెటింగ్ విశ్లేషణ వల్ల ఏర్పడే లాభాలు...

- లింగసమానత్వం, మహిళల అవసరాలు, సాధికారికత సాధన దిశగా ప్రభుత్వాలు, ప్రతినిధుల బాధ్యతలు పెరుగుతాయి. ప్రభుత్వ వ్యయాల్లో మహిళా హక్కులకు ప్రాధాన్యత ఏర్పడుతుంది.
- పారదర్శకత పెరిగి అవినీతి తగ్గుతుంది.
- ప్రణాళిక, బడ్జెటింగ్ విధానాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుంది.

**కేస్‌స్టడీ 10** : ఫిలిప్పీన్స్‌లో లింగసమానత్వ సాధనకు బడ్జెట్ కేటాయింపు

ఫిలిప్పీన్స్‌లో 1996 నుంచి ప్రతీ ప్రభుత్వ విభాగం బడ్జెట్‌లో కనీసం ఐదు శాతం నిధులను లింగసమానత్వానికి కేటాయించాలి. లింగసమానత్వ, అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. లింగసమానత్వ సాధనకు ఏర్పాటైన జాతీయ స్థాయి యంత్రాంగంతో అనుసంధానమైన మంత్రిత్వ శాఖల వల్ల సమాజంలో చైతన్యం ఏర్పడడం, కట్టుబాటు పెరగడం, ఆయా మంత్రిత్వ శాఖల సామర్థ్యాలు విస్తరించడం ఒక సానుకూలత.

అయితే లింగసమానత్వం కోసం ప్రతీ శాఖలోను అంత తక్కువ మొత్తాన్ని కేటాయించడం వల్ల కొంత ఇబ్బంది కూడా ఉన్నదని, ప్రధానంగా మహిళలకు అవసరమైన వనరులు అందకుండా పోతాయనే వాదం కూడా

ఉంది. అందుకే మొత్తం బడ్జెట్‌నే లింగసమానత్వ ప్రాతిపదికన తయారుచేయాలన్న వాదన వినిపిస్తోంది. కాగా పనితీరు ఆధారిత బడ్జెటింగ్ విధానంలో అన్ని రకాల వ్యయాలను లింగసమానత్వంతో అనుసంధానం చేయాలని బడ్జెట్, వ్యయనిర్వహణ మంత్రిత్వ శాఖ గట్టిగా వాదిస్తోంది.

జండర్ బడ్జెట్ విశ్లేషణ ఐదు దశలుగా నిర్వహించవచ్చు...

◆ బడ్జెట్ తయారుచేసే సమయంలో అవసరాలకు దీటుగా అన్ని రకాల కేటాయింపులు చేయాలి. తగు దిద్దుబాట్లు చేయడానికి వీలుగా వర్తమాన సంవత్సర బడ్జెట్ అంచనాలను ముందు సంవత్సరంలోని సవరించిన అంచనాలు, వాస్తవిక వ్యయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

◆ బడ్జెట్ కేటాయింపుల తర్వాత కూడా ఆయా శాఖలకు కేటాయింపులు, వ్యయాలపై మంత్రిత్వశాఖలు, ప్రభుత్వశాఖలవారీగా విశ్లేషణ నిర్వహించాలి. ఆదాయ కోణం నుంచి ఆదాయం ఎంత వస్తుంది, సబ్సిడీల భారం ఎంత, మహిళలు, పురుషులపై వాటి ప్రభావం ఎంత అన్నది విశ్లేషించాలి.

◆ అమలుకోణంలో నుంచి చూస్తే బడ్జెట్ కేటాయింపులు నిర్దేశిత ప్రయోజనాలకే ఖర్చవుతున్నాయా అని విశ్లేషించాలి.

◆ అమలు అనంతర దశలో బడ్జెట్ సాధించిన ఫలితాలేమిటి, వాటి ప్రభావం ఎంత అన్నది పరిశీలించాలి. కేటాయింపుల ద్వారా నిర్దేశించుకున్న వాస్తవ లక్ష్యాలేమిటి, బడ్జెట్ ప్రభావం ఎంత అన్నది విశ్లేషించాలి. కేటాయించిన వనరులు ఆశించిన ఫలితాలు సాధిస్తున్నాయా అని కూడా చూడాలి.

**కేస్‌స్టడీ 11** : ఇండోనేసియాలో లింగసమానత్వం

ఇండోనేసియాలో లింగసమానత్వ సాధనకు లింగవివక్ష లేని విధానాల ఆచరణ ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా స్వీకరించింది. ప్రభుత్వ ఏజెన్సీలు, ప్రభుత్వ సంస్థలన్నింటి కార్యకలాపాల్లోనూ లింగసమానత్వం స్పష్టమైన విధానంగా ఉండాలని 9/2000 అధ్యక్ష డిక్రీ (శాసనం/చట్టం) నిర్దేశించింది. అందుకు అనుకూలంగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని జాతీయ, ప్రాంతీయ ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి. ఇండోనేసియాలో జండర్ బడ్జెటింగ్‌కు వ్యూహాత్మక భాగస్వామ్యాలు మద్దతుగా నిలుస్తున్నాయి. గ్రామాలు, జిల్లాల దిగువ స్థాయి, జిల్లాలు/ పురపాలక సంఘాల స్థాయిల్లో అభివృద్ధి ప్రణాళికల్లో మహిళా బృందాలు భాగస్వాములవుతున్నాయి. జాతీయ, ప్రాంతీయ స్థాయిలో జరుగుతున్న చర్చల్లో వారు విలువైన సూచనలు అందిస్తున్నారు. ప్రజాసంఘాలను భాగస్వామ్యాన్ని పెంచేందుకు పౌర సమాజంతో జాతీయ, స్థానిక ప్రభుత్వాలు భాగస్వాములవుతున్నాయి. ఇండోనేసియా మంత్రిత్వ శాఖలు, విరాళాలిచ్చేసంస్థలు, ఐక్యరాజ్యసమితి మధ్య మూలధన, సాంకేతిక బాంధవ్యం ఏర్పడింది. ఆర్థికమంత్రిత్వ శాఖ, బడ్జెట్ శాఖ డైరెక్టరేట్ జనరల్ వంటి ప్రభుత్వ విభాగాలు సామర్థ్యాల విస్తరణకు చేపడుతున్న చర్యల్లో విశ్వవిద్యాలయాలు, ఎన్‌జిఓలు చురుకైన భాగస్వాములుగా ఉన్నాయి. ఆ రకంగా లింగసమానత్వానికి దోహదపడే బడ్జెటింగ్ కార్యక్రమాలను పటిష్ఠం చేయడంలోను, వ్యవస్థీకృతం చేయడంలోను అన్ని సంస్థలు సమానభాగస్వాములుగా ఉన్నాయి.

### అభ్యాసం చేయవలసిన అంశాలు...

మరింత సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన పౌరసేవలందించడానికి వీలుగా ఇంచుమించు 60 ప్రభుత్వాలు లింగసమానత్వాన్ని ప్రధానాంశంగా గుర్తించాయి.

- మీ దేశం ఆ 60లో ఉన్నదా, లేదా?
- మీ దేశంలో లింగసమానత్వ విధానం అమలుజరుగుతున్నట్లు మీరు భావిస్తున్నారా?
- లింగసమానత్వ విధానం ఏ లక్ష్యంగా సాగుతోంది, ప్రభుత్వంలో సార్వత్రిక స్థాయిలో నడుస్తోందా లేక రంగాలకు కూడా విస్తరించిందా?
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విషయానికి వస్తే లింగవిభజన వారీగా గణాంకాలు అందుబాటులో ఉన్నాయా, ఉన్నట్టయితే ఆ డేటా ఏం సూచిస్తోంది?

### 4.2. లింగసమానత్వ దశలు

లింగసమానత్వం అనేది మహిళా వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇతర మంత్రిత్వ శాఖలకే పరిమితం అయిన అంశం కాదు. సమర్థవంతంగా పని చేయాలంటే అది ప్రభుత్వం మొత్తానికి విస్తరించి. అనుసరించాల్సిన అంశం. దానికి హద్దులనేవి లేవు. అన్ని ప్రభుత్వ శాఖలు, మంత్రిత్వ శాఖల, ప్రభుత్వ సంస్థలు అన్నింటికీ అనుసంధానం చేయాల్సినది. ఒక శాఖ అనుసరించే విధానం మరో శాఖపై అనుకూల, ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఏ విభాగం ఏ ధోరణి అనుసరిస్తుందనే అంశంతో సంబంధం లేకుండా లింగసమానత్వం అనేది అన్ని దశలకు విస్తరిస్తుంది. ఆ దశలేమిటో దిగువ చర్చిద్దాం....

#### 4.2.1. ఇందులో భాగస్వాములెవరు?

అభివృద్ధిలో పాలు పంచుకునే ప్రతి ఒక్క శాఖ ఈ క్రమంలో భాగస్వామిగానే ఉంటుంది. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోణంలో నుంచి చూస్తే పారిశ్రామిక, గ్రామీణాభివృద్ధి, మహిళ, శిశు, విద్య, ఆరోగ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖల అధికారులు, బ్యాంకింగ్, సుజెం రుణాలు, ఇతర ఆర్థిక సంస్థల అధికారులు, విద్యావేత్తలు, విద్యారంగం, సామర్థ్యాల నిర్మాణ సంస్థల ప్రతినిధులు, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు భాగస్వాములుగా ఉంటారు.

- ఇతర అంశాల విషయానికి వస్తే లింగసమానత్వం పైన పేర్కొన్న భాగస్వాముల్లోను, విధాననిర్ణయ సంస్థల్లోను ఉన్నదా, లింగ అసమానత ఉన్నట్టయితే దాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సంస్థల్లో కనీసం 30 శాతం నిరాదరణకు గురవుతున్న వర్గాల నుంచి ఉండాలి.
- భాగస్వామ్య బృందాలు ఏ నైపుణ్యాలు, పరిజ్ఞానం అందిస్తాయి? ఉదాహరణకి ఎన్నికైన ప్రజాప్రతినిధులైతే తమ రాజకీయ నైపుణ్యాలను, ఎన్‌జిఓలైతే క్షేత్ర స్థాయిలో తమకు గల అనుభవాన్ని, పరిశోధకులైతే తమ వద్ద గల విలువైన గణాంకాలను అందించగలుగుతారు. మీ గ్రూప్‌లో లింగపరమైన నైపుణ్యాలున్నాయా?

#### 4.2.2. ప్రధాన సమస్య ఏమిటి?

కొన్ని మౌలిక ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్టయితే మీరు పరిష్కరించాల్సిన సమస్య ఏమిటన్న అవగాహన ఏర్పడుతుంది.

- మీ పరిశీలనలోని సమస్య ఏమిటి? మనం ప్రస్తుతం అధ్యయనం చేస్తున్న అంశానికి వస్తే "ఐసిటి సాధనంగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లను ప్రోత్సహించడం ఎలా?"
- ఏం సాధించాలనుకుంటున్నారు? ఈ కేసులో "మహిళల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా సాధికారికత కల్పించడం".
- ఇది మహిళలు, పురుషులను భిన్నంగా ప్రభావితం చేస్తుందా?
- ఈ అంశానికి లింగప్రాధాన్యత కల్పించడం ద్వారా సంస్థలు, ధోరణులు, లింగసమానత్వాన్ని మరుగున

పరుస్తున్న ఇతర అంశాల్లో పరివర్తన తీసుకురాగలదా?

ఈ ప్రశ్నలకు "అవును" అనే సమాధానం మూడు లేదా నాలుగింటికి వస్తే తప్పనిసరిగా జండర్ ఆడిట్ చేయించాలి.

### 4.2.3. జండర్ మ్యాపింగ్, ఆడిట్

అప్పటికే అందుబాటులో ఉన్న సమాచారాన్ని గుర్తించి ఏది అవసరమో ఎంపిక చేసుకుని సేకరించే ప్రక్రియనే జండర్ మ్యాపింగ్‌గా వ్యవహరిస్తారు.

- ఈ అంశంపై మీకు అందుబాటులో ఉన్న సమాచారం ఏది, ఇంతకు ముందు సేకరించిన సమాచారం పురుషులు, మహిళలపై వేర్వేరుగా ఏ విధమైన ప్రభావం చూపించింది?
- మీ చేతిలో అందుబాటులో లేని సమాచారం ఏమిటి?
- ఈ అంశానికి సంబంధించి ఏ ప్రాజెక్టులు లేదా ఏ విధానపరమైన చొరవలు ఇప్పటికే తీసుకున్నారు?
- ఈ అంశంపై ప్రస్తుతం ఏ ప్రాజెక్టులు లేదా విధానాలు ఆచరణలో ఉన్నాయి?
- ఈ అంశానికి సంబంధించి ఏ ఇతర చర్యలు అవసరం అని మీరు భావిస్తున్నారు?

పై ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెలుసుకోవడం వల్ల ఎక్కడ సమాచార లోటు ఉన్నది తెలుసుకుని ఆ లోటును పూడ్చేందుకు ప్రయత్నించవచ్చు. చక్కని అవగాహనతో కూడిన విధానాల రూపకల్పనకు జండర్ ఆడిట్ అత్యంత కీలకం. ఇందులో కీలకాంశాలు...

- జండర్ ఆడిట్‌కు కావలసిన ముందస్తు ఏర్పాట్లు
- పత్రాల సమీక్ష
- కీలక సమాచారం అందించే వారితో ఇంటర్వ్యూలు
- గ్రూప్ చర్చలు
- మిమ్మల్ని మీరు మదింపు చేసుకునే ప్రశ్నలు
- దత్తాంశ విశ్లేషణ, లింగసమానత పెరుగుదలకు కార్యాచరణ ప్రణాళిక
- కార్యాచరణ ప్రణాళిక పంపిణీ
- కార్యాచరణ ప్రణాళిక అమలుపై పర్యవేక్షణ

జండర్ ఆడిట్ సమర్థవంతంగా నిర్వహించడానికి ఫిలిప్పీన్స్ మహిళా కమిషన్ "సామరస్యపూర్వక జండర్ అభివృద్ధి మార్గదర్శకాలు" సిద్ధం చేసింది. రంగాలవారీగా జరుగుతున్న కార్యకలాపాలపై చెక్‌లిస్ట్‌తో సహా విధాన రూపకర్తలు జండర్ ఆడిట్ నిర్వహించడానికి కావలసిన వేదికను అవి సిద్ధం చేస్తాయి.

### 4.2.4. కార్యాచరణ, బడ్జెట్లపై కసరత్తు

జండర్ మ్యాపింగ్, జండర్ ఆడిట్ అనంతరం విధాన రూపకల్పన, బడ్జెట్ కేటాయింపులకు రంగం సిద్ధం అవుతుంది. ఈ సందర్భంగా ఈ దిగువ అంశాలు కీలకం...

- **సమర్థత** : పరిమిత వనరులతో మంచి ఫలితాలు సాధించడం ఎలా?
- **ఫలితం** : విధానపరమైన చర్యల వల్ల వాస్తవిక వాతావరణంలో ఎలాంటి మార్పు రావచ్చు?

- **లింగసమానత్వం** : మహిళలు, పురుషుల మధ్య సామాజిక, చారిత్రక, ఆర్థిక అసమానతలు ఎంతమేరకు తొలగించవచ్చు?

◆ సామాజిక న్యాయం వంటి ఇతర అంశాలు ఈ విధానంతో ఎలా అనుసంధానం చేయవచ్చు, దుర్భర దారిద్ర్యంలో కాలం గడుపుతున్న ఇతర వర్గాల ప్రజలకు కూడా ఈ విధానపరమైన చర్యలతో ప్రయోజనం చేకూరుతుందా?

ఉదాహరణకి మైక్రో వ్యాపార సంస్థ ప్రారంభించాలని ఆశ పడుతున్న మహిళలకు అవసరం అయిన మూలధనం, ఆర్థిక సహాయం అందించడానికి మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో ఐసిటి వినియోగం ఆధారంగా రూపొందిస్తున్న ఆర్థిక విధానంలో విద్య, సామర్థ్యాల నిర్మాణ విభాగాలను వర్తింపచేయడం సాధ్యమా? అవునని సమాధానం వస్తే ఒక చిన్న వాటర్‌పంప్ నిర్వహణ దుకాణం పెట్టుకోవాలని ఆశించే మహిళలకు విడివిడిగాను, బృందాలవారీగాను కూడా ఆర్థిక సహాయం అందించవచ్చునా?

**అభ్యాసం చేయాల్సిన అంశాలు...**

- మీ చేతిలో ఉన్న సమాచారం ఆధారంగా మీ దేశంలోని మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల జాబితా తయారుచేయండి.
- సమగ్ర అవగాహనతో విధానాలు రూపొందించేందుకు వీలుగా మీ దగ్గర అందుబాటులో లేని సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని మరో జాబితా తయారుచేయండి.
- జండర్ మ్యాపింగ్, ఆడిటింగ్ ప్రతిపాదనలతో ఒక ముసాయిదా తయారుచేయండి. మీ శాఖ లేదా మంత్రిత్వ శాఖలో జండర్ ఆడిట్‌ను కోరుతూ ఒక ప్రతిపాదన సిద్ధం చేయండి.
- మీ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ మంత్రితో మీ ప్రతిపాదనకు మద్దతుగా మాట్లాడండి.

### 4.2.5. సమాచార పంపిణి, సలహాలు

ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న పలు అధ్యయన నివేదికలు వివిధ దేశాల మహిళలకు తమకు అందుబాటులో గల అవకాశాలపై సరైన అవగాహన లేదన్న విషయం తెలియచేస్తున్నాయి. కేస్‌స్టడీ 12 ఇందుకు చక్కని ఉదాహరణ.

**కేస్‌స్టడీ 12** : హైదరాబాద్‌కు (ఇండియా) చెందిన వెండర్లకు బ్యాంకు రుణాలపై అవగాహన లేమి

హైదరాబాద్‌లోని ఒక పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ప్రధాన కార్యాలయం పరిసరాల్లో పెద్ద మార్కెట్ ఉంది. అక్కడ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిలో ఎక్కువ మంది మహిళలే. భారత ప్రభుత్వ నిర్దేశకత్వం మేరకు ఆ బ్యాంకు వారందరికీ జీరో నిల్వ ఉంచేందుకు వీలు గల ఎస్‌బి ఖాతాలు, చిన్న తరహా మహిళా వ్యాపారులకు తక్కువ వడ్డీ రుణాలు అందుబాటులో ఉంచుతుంది. తమ ముంగిటనే అందుబాటులో ఉన్న ఈ అవకాశం బయట వ్యాపారాలు చేసుకుంటున్న మహిళలకు తెలియదు.

లింగసమానత్వ విధానాల తయారీ విషయంలో విధానకర్తల్లోను, లబ్ధిదారుల్లోను కూడా వ్యతిరేకత ఉన్నదన్న విషయం ఇక్కడ గమనించాల్సిన అంశం. ఇందుకు కొన్ని కారణాలు

1) లింగసమానత్వానికి సంబంధించిన అంశాలపై సరైన సమాచారం అందుబాటులో లేకపోవడం లేదా దుష్ప్రచారం

2) వనరుల కొరత

3) సమాజంలో స్త్రీపురుషుల పాత్రపై సాంస్కృతిక, సాంప్రదాయిక కారణాలు.

ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే లింగసమానత్వ సాధనకు కమ్యూనికేషన్, సలహాల వ్యూహాలు అత్యంత కీలకం అన్న విషయం తెలుస్తుంది.

### లబ్ధిదారుల్లో చైతన్యం

విధానాల రూపకల్పన, కార్యక్రమాలు, ప్రాజెక్టుల అమలు వంటి బిన్న దశలకు కమ్యూనికేషన్ వ్యూహాలను విస్తరించాల్సి ఉంటుంది. మహిళలు, పురుషుల ప్రత్యేక అవసరాలన్నింటికీ ఈ కమ్యూనికేషన్ వ్యూహాలు వర్తిస్తాయి. కమ్యూనికేషన్ అంటే సమాచారాన్ని అందరికీ అందేలా చూడడం ఒక్కటే కాదు చైతన్యం పెంచడానికి వీలుగా లక్ష్యనిర్దేశం, ప్రవర్తనలో మార్పులు, మంచి అంశాలు నలుగురితో పంచుకోవడం అన్నీ ఇందులోకి వస్తాయి. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల విషయానికి వస్తే ప్రాధాన్యతలు, మీడియా, ఐసిటి వంటి అంశాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. మీడియా వినియోగం విషయంలో ఒక అవగాహన ఏర్పడేందుకు ఈ దిగువ అంశాలు ఉపయోగపడతాయి.

- మహిళలు, పురుషులు వేర్వేరు ప్రచురణలు చదువుతారా?
- మహిళలు, పురుషులు వేర్వేరు ఎలక్ట్రానిక్ మీడియా వీక్షిస్తారా?
- రెండు వర్గాల వారు ఎక్కువగా చూసేవి లేదా చదివేవి ఏమిటి, కంటెంట్‌లో ఉభయుల మధ్య తేడా ఏమైనా ఉన్నదా?
- వారు చూసే లేదా చదివే అంశాల (ఫ్రీక్వెన్సీ, సమయం) వేర్వేరుగా ఉన్నాయా?
- సమాచారం, సహాయం కోసం మహిళలు ఎవరి వైపు ఎదురుచూస్తారు, మీడియా, ఐసిటి విభాగాలా లేదా వ్యక్తిగత పరిజ్ఞానం ఉన్న బంధుమిత్రులు, మార్గనిర్దేశకులు, స్థానిక ఎన్‌జిఓలు లేదా స్థానిక ప్రభుత్వాలు...వీటిలో ఏది?
- ఏ సమాచార విభాగాన్ని వారు ఎక్కువగా విశ్వసిస్తారు?
- సందేశాలకు స్పందించే విషయంలో మహిళలు భిన్న ధోరణులు ప్రదర్శిస్తారా, వేర్వేరు విలువలిస్తారా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు సాధించగలిగితే విధానాలు, సంస్థలు, ధోరణులు, సదుపాయాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు సరైన కమ్యూనికేషన్ వ్యూహం రూపొందించడం సాధ్యమవుతుంది. ఇది చేయలేకపోతే చీకట్లో బాణం వేసినట్టే ఫలితం కూడా ఉంటుంది.

### భాగస్వాములకు చక్కని సలహాలు

లింగసమానత్వంపై నిర్లక్ష్యం లేదా లింగతటస్థత సమస్యను పరిష్కరించడానికి విధాన రూపకర్తలు, విద్యావేత్తలు, డోనర్లు, అభివృద్ధి భాగస్వాముల మధ్య చక్కని సమాచార పంపిణీకి తగు వ్యూహం అవసరం.

- జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ స్థాయిల్లో మంత్రిత్వ శాఖల్లో జండర్ నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేయాలి. అలాగే ఫేస్‌బుక్ లేదా గూగుల్ ప్లస్ వేదికలుగా సోషల్ మీడియా గ్రూప్ ఒకటి కూడా ఏర్పాటు చేయడం అవసరం.
- లింగసమానత్వ సాధనపై వార్షిక నివేదికలు రూపొందించాలి. జరుగుతున్న పురోగతిని తెలుసుకుని, సమాచారాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఇలాంటి నివేదికలు చక్కని సమాచార వనరుగా నిలుస్తాయి.
- వెబ్‌సైట్లు, కమ్యూనిటీల వంటి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ కూడా ఉపయోగించుకోవాలి. భారత్‌లోని ఐక్యరాజ్యసమితి కంట్రీ టీమ్ లింగసమానత్వ ధోరణులపై రూపొందించిన సొల్యూషన్ ఎక్స్ఛేంజి ఇందుకు

చక్కని ఉదాహరణ. 2005లో ఏర్పాటు చేసిన ఈ ఆన్‌లైన్ వేదిక విధానకర్తలు, అంతర్జాతీయ సంస్థలు, పౌర సమాజంతో కలిసి పని చేసే ఎన్‌జిఓలు, అంతర్జాతీయ సంస్థలు, ప్రైవేటు రంగం, విద్యావేత్తలు, మీడియా అందరినీ ఒకే వేదిక పైకి తెచ్చి ఒకరి అనుభవాలు మరొకరు పంచుకునే అవకాశం కల్పిస్తోంది.

- లింగసమానత్వం కోసం కృషి చేస్తున్న సంస్థలు ప్రచురించిన నివేదికలు,పుస్తకాలు, బులెటిన్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంచేందుకు జండర్ రీసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.
- లింగసమానత్వ ప్రాధాన్యతను తెలియచేసే సమాచారం ముద్రించి అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు మీడియాతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలి.

**అభ్యాసం చేయాల్సిన అంశాలు...**

- మీ దేశం సమాజంలో లింగసమానత్వానికి సంబంధించి నివేదిక ఏదైనా ప్రచురించిందా, మీ దేశానికి చెందిన వెబ్‌సైట్‌లో అది ఉన్నదా?
- ఉన్నట్టయితే తాజాగా ప్రచురించిన నివేదిక ఏం చెబుతోంది, అందులో ప్రధానాంశాలేమిటి?
- ఒకవేళ అలాంటి నివేదికలు లేకపోతే దాని అవసరం ఏమిటో తెలియచేసేందుకు గోష్ఠిని నిర్వహించండి. ఇలాంటి నివేదిక రూపకల్పన కోసం భిన్న మంత్రిత్వ శాఖల ప్రాతినిధ్యంతో ఏర్పాటైన బృందానికి ఎలా నచ్చచెప్పవచ్చు ఆలోచించండి.

# V. లింగసమానత్వ విధానం రూపకల్పన
## మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో ఐసిటి వినియోగానికి ప్రణాళిక

### బోధన ఫలితం

ఈ సెక్షన్‌ను చదివిన తర్వాత చదువరులకు ఈ దిగువ అంశాలపై అవగాహన ఏర్పడుతుంది.

- విధానపరంగా అందుబాటులో ఉన్న అంశాలు, ఆచరణీయత మధ్య తేడాను గుర్తించగలుగుతారు.
- డిజిటల్ ఆర్థిక సమ్మిళితత్వం ప్రాధాన్యత, మహిళల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు మద్దతు ఇవ్వడంలో దాని పాత్రపై అవగాహన ఏర్పడుతుంది.
- ఆర్థిక సమ్మిళితత్వానికి ఐటి సొల్యూషన్లను రూపొందించి అమలుచేసే ప్రయత్నంలో పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలపై అవగాహన సాధించగలుగుతారు.
- మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం ప్రస్తుత విధానాల్లో లింగసమానత్వాన్ని భాగంగా చేసేందుకు విధానరూపకర్తలు తీసుకోవాల్సిన చర్యలను గుర్తించగలుగుతారు.

ఈ మాడ్యూల్‌లో నాలుగు ప్రధాన అంశాలు -ప్రభుత్వం, మహిళా సాధికారికత, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఐసిటి- అన్నింటి మధ్య సమన్వయం తీసుకురావడం దీని ప్రధాన ధ్యేయం. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌తో సహా ఏ రంగం అభివృద్ధికైనా సమర్థవంతమైన లింగసమానత్వ విధానం రూపొందించాలంటే మూడు అంశాలు ప్రధానం.

**పరిస్థితిపై విశ్లేషణ:** సంస్థలో అంతర్గతంగాను, లబ్ధిదారుల బృందంలోను లింగసమానత్వంతో కూడిన అంశాలపై విశ్లేషణ జరుగుతుంది. సంస్థపరంగా వస్తే ఎ) సిబ్బంది పరిజ్ఞానం, నైపుణ్యాలు, కట్టుబాట్లు, లింగసమానత్వంతో కూడిన అంశాలపై ఆచరణీయమైన అంశాలు బి) లింగపరమైన అంశాలకు సిబ్బంది కట్టుబాట్లు సి) ప్రమోషన్ అవకాశాల్లో లింగ విభేదాలు, పని ప్రదేశంలో వేధింపులు వంటివన్నీ ఈ విశ్లేషణలో పరిశీలనకు వస్తాయి. ఒక వేళ సంస్థలో లింగసమానత్వం లేకపోయి ఉంటే లింగపరమైన అంశాలను సమర్థవంతంగా పరిశీలించడం సాధ్యం కాదు.

**విధానం** : విశ్లేషణ నుంచి లింగసమానత్వంతో కూడిన విధానం రూపొందించగలుగుతారు. విజన్‌లోని వివిధ అంశాలను ఆచరణీయం చేసేందుకు ఇది సహాయకారిగా ఉంటుంది. విధానం ఏదైనా ప్రభుత్వ పత్రంగానే ఉంటుంది.

వ్యూహం లేదా కార్యాచరణ ప్రణాళిక అమలు : విశ్లేషణ, విధానం ఆధారంగా రూపొందించిన అంతర్గత పత్రం ఇది. నిర్దిష్ట కాలపరిమితిలో విధానాన్ని ఏ విధంగా అమలుపరుస్తారన్న వివరాలు ఇందులో ఉంటాయి. నిర్దిష్ట కాలపరిమితితో కూడిన లక్ష్యాలు, బడ్జెట్లు, పర్యవేక్షణ, అంచనా సూచికల ఆధారంగా ఈ కార్యకలాపాలు చేపడతారు. ప్రభుత్వాలు తమ విధానం, నిర్ణయాధికార సంస్థల ద్వారా ప్రజల విస్తృత ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని విధానాలు రూపొందించి కార్యక్రమాలు నిర్మిస్తారు. ఇలాంటి విధానాలు, కార్యక్రమాల అమలుపై స్పష్టమైన నిర్దేశకాలు లేకపోతే కొన్ని సునిశిత బృందాల కీలక ఆందోళనలను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వ కార్యకలాపాల్లో లింగసమానత్వాన్ని స్పష్టంగా నిర్దేశించడం అవసరం. ఆ చర్యలు ఇలా ఉంటాయి...

- విధానాలు, కార్యక్రమాలు రూపొందించడానికి ముందు చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఇ) జండర్ ఆడిట్, విధానాలు, చట్టాల విశ్లేషణ చేయించాలి.
- లింగవిభజనవారీగా గణాంకాలను సేకరించి ప్రతి ఒక్క రంగానికి జండర్ వ్యూహాన్ని రూపొందించాలి.
- ప్రభుత్వాధికారుల్లో లింగసమానత్వంతో కూడిన కార్యక్రమాల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. ఫిలిప్పీన్స్‌లో ఆచరణలో ఉన్న "లింగసమానత్వ విధానాలు, అభివృద్ధి మార్గదర్శకాలు" ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడానికి ఉపయోగకరమైన రిఫరెన్స్‌గా ఉంటాయి.
- అన్ని మంత్రిత్వ శాఖల్లోను, ప్రభుత్వ ఏజెన్సీల్లోను, ప్రభుత్వస్థాయి లన్నియునూ లింగసమానత్వ కేంద్రీకృత అంశాలను పర్యవేక్షించే విభాగాలు ఏర్పాటు చేయాలి.

**అభ్యాసం చేయాల్సిన అంశాలు...**

- వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మీ సంస్థలో లింగసమానత్వం ఏ విధంగా అమలుజరుగుతున్నది విశ్లేషించండి.
- మీ సంస్థలో లింగసమానత్వం సాధించేందుకు మీ దృష్టిలో చేయాల్సిన అంశాలేమిటి?

### 5.1. ప్రభుత్వ పాత్ర : దోహదపడే చట్టాలు

మహిళలు తమకు, తమ కుటుంబాలకు, తమ సమాజానికి అనుకూలమైన అంశాలను ఎంపిక చేసుకునేందుకు సమానావకాశం కలిగి ఉండడమే మహిళా సాధికారికత. చట్టపరంగా లింగభేదాలున్న ప్రదేశాల్లో దాని ప్రభావం కూడా తీవ్రంగానే ఉంటుంది. అయితే ఒకే రకమైన వైవాహిక హోదా కలిగి ఉన్న పురుషులు, మహిళల్లో లింగభేదం ఏ మేరకు ఉన్నది మహిళలు, వ్యాపారాలు, చట్టం 2016పై ప్రపంచబ్యాంకు రూపొందించిన నివేదిక తేల్చిచెప్పింది. (బాక్స్ 4 చూడండి)

ఈ దిగువ 21 అంశాల్లో ఒకే రకమైన వైవాహిక హోదా ఉన్న మహిళలు, పురుషుల్లో లింగభేదం ఏ విధంగా ఉన్నది మహిళలు, వ్యాపారం, చట్టం నివేదిక తేల్చిచెప్పింది.

1. పాస్‌పోర్టుకు దరఖాస్తు, 2. ఇంటి వెలుపల ప్రయాణం, 3. దేశం వెలుపల ప్రయాణం, 4. ఉద్యోగం పొందడం లేదా ఎవరి అనుమతి లేకుండా వ్యాపారం, వృత్తి చేపట్టడం, 5. కాంట్రాక్టులపై సంతకం, 6. వ్యాపారం రిజిస్ట్రేషన్, 7. "ఇంటి పెద్ద" లేదా "కుటుంబ పెద్ద"గా వ్యవహరించడం, 8. తన సంతానానికి పౌరసత్వం సాధించడం, 9. బ్యాంకు ఖాతా తెరవడం, 10. ఎక్కడ నివశించాలో ఎంచుకోవడం, 11. జాతీయ గుర్తింపు కార్డు పొందడం, 12. ఆస్తిపై యాజమాన్య హక్కు సాధించడం, 13. ఆస్తిపై వారసత్వ హక్కు, 14. రాత్రి వేళల్లో పని చేయడం, 15. ఒకే రకమైన ఉపాధి, 16. పురుషులతో సమానంగా చట్టబద్ధమైన ఒకే రిటైర్మెంట్ వయస్సు, 17. పురుషులతో సమానంగా పన్ను మినహాయింపులు లేదా క్రెడిట్లు పొందడం, 18. కోర్టులో ఒకే రకమైన ఆధారంతో సాక్ష్యం నమోదు చేయగల అవకాశం, 19. రాజ్యాంగంలో లింగపరమైన వివక్షారహిత అవకాశం, 20. రాజ్యాంగ ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో ఒకే చట్టం ఉపయోగించుకోవడం, 21. రాజ్యాంగ ఉల్లంఘన జరిగిన సందర్భంలో మతచట్టాన్ని ప్రయోగించే స్వేచ్ఛ. ఇవి కాకుండా మరో ఐదు అంశాలు కూడా ఉన్నాయి. అవి...

22. భర్తల మాటలకు చట్టానికి లోబడి కట్టుబడి ఉండాల్సిన స్థితి, 23. తన జాతీయుడు కాని భర్తకు పౌరసత్వహక్కు కల్పించడం, 24. వైవాహిక ఆస్తి హక్కులు ఉపయోగించుకోవడం, 25. వివాహంతో సంక్రమించిన ఆస్తులకు అందించే ఆర్థికేతర సేవలకు చట్టపరమైన గుర్తింపు, 25. మరణించిన భర్తకు సంబంధించిన ఆస్తులపై వారసత్వ హక్కు పొందడం.

లింగసమానత్వసాధనకు ఎన్ని చట్టాలున్నా దాని ప్రయోజనాలు వారికి చేరడంలేదు. అంటే మహిళల కోసం రూపొందించిన చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి తప్పితే ఆచరణలో కనిపించడంలేదని అర్థం అవుతోంది. అంటే కొత్త చట్టాలు మరిన్ని రూపొందించాల్సిన అవసరం లేదు. దాని కన్నా కంబోడియా తరహాలో ప్రస్తుత విధానాల్లోకి లింగసమానత్వాన్ని సాధించడం పరిష్కారం కావచ్చు. అన్ని విధాన నిర్ణయ సంస్థలు, చట్టవ్యవస్థలు, భాగస్వామ్య వ్యవస్థలు, ప్రణాళికల అమలు బాధ్యత గల బృందాల్లోను (ప్రపంచస్థాయి బెంచ్‌మార్క్ 30 శాతం) మహిళా ప్రాతినిథ్యాన్ని పెంచాల్సి ఉంటుంది. మొత్తం ప్రభుత్వ కార్యకలాపాలన్నింటిలోనూ లింగసమానత్వాన్ని ప్రధానాంశంగా చేయాలి (ఫిలిప్పీన్స్‌కు చెందిన కేస్ స్టడీ 10 చూడండి)

**కేస్‌స్టడీ 13.** ఎంజిఎన్‌ఆర్‌ఇజిఏలో లింగసమానత్వం

భారత్‌లో గరిష్ఠస్థాయిలో ఉన్న పేదరికాన్ని నిర్మూలించేందుకు, గ్రామీణ ప్రాంతాల ప్రజల పట్ల చోటుచేసుకున్న నిరాదరణను తొలగించడానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఏ) ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ఇళ్ళలోని వారికి కనీస ఉపాధి కల్పించడం దీని లక్ష్యం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్ళను కూడా దీని రూపకల్పనలో పరిగణనలోకి తీసుకున్నారు. మహిళలకు ఎంజిఎన్‌ఆర్‌ఇజిఏ పనుల్లో మహిళలకు మూడింట ఒక వంతు కోటా కేటాయించడం, పిల్లల సంరక్షణకు క్రెచ్‌ల ఏర్పాటు, ఒంటరి మహిళలకు వారి నివాసానికి సమీపంలోనే ఉపాధి చూపించడం వంటి అంశాలను వాటిలో చేర్చారు. 1976 సంవత్సరం నాటి సమాన వేతన చట్టానికి అనుగుణంగా మహిళలు, పురుషులకు సమానంగా వేతనాలు చెల్లించడం వేతనపరమైన అసమానతలు తొలగించడంలో ప్రధాన చర్య. లబ్ధిదారుల పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచే సమయంలో ఇంటి పెద్ద పేరు మీద కాకుండా ఉమ్మడి ఖాతాలు తెరిపించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని మార్గదర్శకాలు స్పష్టంగా నిర్దేశించాయి. మహిళలు, నిరాదరణకు గురవుతున్న వర్గాలు కూడా హాజరయ్యేందుకు వీలుగా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఏకు చెందిన సామాజిక ఆడిట్ వేదికల సమావేశం సమయాన్ని నిర్ణయించాలని సూచించారు. లింగసమానత్వసాధనకు ఇవన్నీ కీలకంగా నిలుస్తాయి. కోటాల ద్వారా సమానత్వం ఎలా సాధించాలి, మరింత లింగసమానత్వం సాధించేందుకు ప్రస్తుత చట్టాలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు అనేందుకు కేస్‌స్టడీ 13 నిదర్శనంగా నిలుస్తుంది.

ఆర్థిక కార్యకలాపాలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించిన నిబంధనలు, చట్టాలు, రాజ్యాంగ నియమాలు అన్ని ప్రభుత్వాలు రూపొందించాయని వాదించవచ్చు. అలాంటి చట్టాలు, నిబంధనలు ఉండవచ్చు కాని వాటిలో ఎక్కువ లింగతటస్థత కలిగినవై ఉండవచ్చు.

లింగపరమైన కోణం నుంచి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించిన చట్టాలపై ఎస్కాప్ నిర్వహించిన సర్వేలోని ముఖ్యాంశాలు...

- లింగపరమైన అంశాలకు స్పందించాల్సిన విధానాలు, కార్యక్రమాలు తాత్కాలికంగాను, వేటి దారి వాటిదే అన్నట్టున్నాయి.
- ప్రభుత్వ సంస్థల్లో సమన్వయలోపం వల్ల ఎస్ఎంఇ పాలసీలో లింగసమానత్వ సాధనకు వాటిని అనుసంధానం చేయడం కష్టంగా ఉంది.
- విధానాల ఆచరణీయత అసంపూర్ణంగా ఉంది.
- సంక్లిష్టంగా ఉన్న రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్ విధానాలు మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల అభివృద్ధికి అవరోధంగా ఉన్నాయి.
- ప్రభుత్వ నియంత్రణలపై అవగాహనాలోపం, మార్గదర్శకత్వం పరిమితంగానే ఉండడం మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు మరో అవరోధం.

ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలు లింగభేదాన్ని పరిష్కరించగలవిగా లేవని ఈ అంశాలు నిరూపిస్తున్నాయి. సెంట్రల్ ఆసియాలో ఎడిబి నిర్వహించిన అధ్యయనం కూడా ఈ అంశాలను ధ్రువీకరించింది. మహిళల ఆర్థిక హక్కుల కల్పన కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పౌరసమాజ సంస్థలు కలిసి పని చేయాలి. (చూడండి ఫిగర్ 5)

**ఫిగర్ 5.** ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వ్యవస్థ

- తొలి కస్టమర్లు, మద్దతు సేవలు, మానవ నెట్‌వర్క్, ఆర్థిక క్లస్టర్లు, మౌలిక వసతులు, విద్యాసంస్థలు
- నాయకత్వం, ప్రభుత్వం, సంస్కృతి, విజయగాథలు, మానవ వనరులు, ఆర్థిక మూలధనం, ప్రభుత్వేతర సంస్థలు

మొత్తం మీద అంశాలన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నందువల్ల లింగసమానత్వ సాధనకు ఎలాంటి ప్రయత్నం చేసినా ఈ అనుసంధానాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించాలి. అలాగే ఆచరణీయతకు చక్కని యంత్రాంగం అవసరం. ఐసిటిలు వేగం, విస్తృతి, బహుముఖీన కోణాల్లో నుంచి అత్యంత కీలకమైన చోదక శక్తులు. ప్రభుత్వాలు వీటిని ఉపయోగించడం వల్ల ఇ-గవర్నెన్స్ నుంచి పౌరుల ప్రకటిత, అప్రకటిత, అనుభవనీయమైన అవసరాలన్నింటినీ పరిష్కరించగల స్మార్ట్-గవర్నెన్స్‌లో అడుగు పెట్టగలుగుతాయి. ఫలితంగా ప్రభుత్వం లింగవివక్ష లేని పాలన అందించగలుగుతుంది. మహిళా సాధికారికతకు, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఐసిటిలను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఇలాంటి 12 కేసులను విశ్లేషించిన ఎస్కాప్ ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో మహిళాసాధికారికతకు ఇ గవర్నమెంట్ పేరిట రూపొందించిన నివేదికలో ఈ విధంగా పేర్కొంది.

లింగభేదాలకు తావు లేని ఇ-గవర్నమెంట్ చొరవల వల్ల లింగసమానత్వ సాధనకు సానుకూల ఫలితాలు తీసుకురాగలుగుతుంది. ఇవి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. తద్వారా వారు సాంప్రదాయిక నిబంధనలు, అంతకు ముందు సామాజికంగా ఆచరణీయంగా ఉన్న విధానాల నుంచి వస్తున్న సవాళ్ళను దీటుగా ఎదుర్కొని ఉపాధి మార్కెట్‌లో సమర్థవంతంగా పోటీ పడగలుగుతారు. వారు ప్రజాసంస్థల్లో పరివర్తనకు కారకులై సాంకేతికంగాను, రాజకీయంగాను లింగసమ్మిళితత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందించగల సామర్థ్యాలు పొందగలుగుతారు.

**ఐసిటిల మద్దతు విధానాలు ఈ దిగువ అంశాల ఆధారంగా జరగాలి...**

- స్థూల, సూక్ష్మస్థాయిల్లో అందుబాటులో ఉన్న సూచికలు, గణాంకాలను ప్రభుత్వం ఉపయోగించాలి.
- ప్రభుత్వం వద్ద బహిరంగంగా అందుబాటులో ఉన్న గణాంకాలను ఉపయోగించి లింగభేదం ఆధారంగా ఆ డేటాను విభజించడం వల్ల లింగభేద ఆధారిత గణాంకాలు మనకి అందుబాటులోకి వస్తాయి.
- లింగపరమైన అంశాలపై అధ్యయనం చేసే నిపుణులు, ఎన్‌జిఓలు, భాగస్వామ్య వర్గాల కోసం సొల్యూషన్ ఎక్స్ఛేంజి తరహాలో ఆన్‌లైన్ జండర్ కమ్యూనిటీ ఒకటి ప్రారంభించాలి. దీని వల్ల వారు తమ అనుభవాలను పరస్పరం పంచుకుని అత్యుత్తమ ప్రమాణాలు, కేస్‌స్టడీలు, లింగసమానత్వ ఉపకరణాలు పరస్పరం పంచుకోగలుగుతారు.
- దీని వల్ల మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల ప్రోత్సాహానికి సానుకూలమైన విధానాలతో కూడిన వాతావరణం ఏర్పడుతుంది.

ఇక రానున్న విభాగాల్లో నిర్దిష్ట లింగసమస్యలు, ఆ సమస్యల పరిష్కారానికి అందుబాటలులో ఉన్న ఐసిటి సొల్యూషన్లు ఏమిటి వంటి అంశాలు చర్చిద్దాం.

## 5.2. ఎంఎస్ఎంఇ విధానాలు, చట్టాలు, నియంత్రణలు

ప్రస్తుతం అమలులో ఉన్న ఎంఎస్ఎంఇ విధానాలు, చట్టాలు, నియంత్రణలపై జండర్ ఆడిట్ నిర్వహించడం వల్ల అవి లింగవివక్షను పట్టించుకోలేదని గాని, లింగతటస్థత కలిగినవి అని గాని తెలుతుంది. లైసెన్సింగ్, పనిగంటలు, సమానవేతనాలను నిర్ణయించే కార్మిక చట్టాల్లో యాదృచ్ఛికంగానే ఇలాంటి విధానాలు చోటుచేసుకుంటున్నాయి. వాటిని పరిష్కరించేందుకు తీసుకోవలసిన చర్యలు...

- అసమానతలు, లోపాలు సవరించేందుకు అప్పటికి అమలులో ఉన్న విధానాలు, చట్టాలన్నింటినీ సమగ్రంగా సమీక్షించండి.
- రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్, నిర్వహణ, పన్ను విధానాలను సరళీకృతం చేయడం ద్వారా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు సమయం, వ్యయం ఆదా చేయాలి. అధికారులు, ఏజెంట్ల వేధింపులకు స్వస్తి పలకాలి. సింగిల్ విండో ఆధారిత వెబ్ పోర్టల్ ఏర్పాటు, మొబైల్ యాప్, ఎస్ఎంఎస్ ఏర్పాటు చేయాలి. ఈ వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్ కూడా స్థానిక భాషలో, ఉపయోగించడానికి సరళంగా,స్పష్టంగా, చిహ్నాల ఆధారిత కమాండ్‌లతో ఉండాలి.
- మహిళల కోసం అందుబాటులో ఉన్న చట్టాల గురించి మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ''టిప్ ఆఫ్ ద డే'' సహాయంతో అవగాహన కల్పించాలి. అలాగే రేడియో, టివి వంటి మీడియాల ద్వారా చిన్న చిన్న ప్రకటనలు చేయవచ్చు.

## 5.2. డిజిటల్ ఆర్థిక సమ్మిళితత్వం

విధానపరమైన చర్యలేవైనా సంబంధిత దేశానికి, సందర్భానికి తగినవిగా ఉండాలి. మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, విస్తృతిపరంగాను, లింగపరంగాను వివక్షకు కారణం అవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆర్థిక సమ్మిళితత్వ సాధనకు లక్ష్యాలు నిర్దేశించుకుని అందుకు అనుకూలమైన విధానాలు రూపొందించాలి. ఉదాహరణకి పపూవా న్యూగినియాలో కొత్తగా తెరిచే బ్యాంకు ఖాతాలన్నింటిలోనూ సగం మహిళాఖాతాలే అయి ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది.

**కేస్‌స్టడీ 14.** పపువా న్యూగినియాలో మహిళల కోసం జాతీయ స్థాయి మైక్రోబ్యాంక్ టార్గెట్లు

బ్యాంకింగ్ సదుపాయాలు అందుబాటులో లేని వారికి వాటిని అందించేందుకు పపూవా న్యూగినియా మైక్యాష్ పేరిట జాతీయ స్థాయిలో మైక్రోబ్యాంకును ప్రారంభించింది. ప్రారంభంలో పొదుపు ఖాతాలు, మొబైల్ మనీ సర్వీస్‌పై దృష్టి పెట్టారు. 2012 జూన్‌లో ప్రవేశపెట్టిన ఈ సర్వీసుకు అద్భుత స్పందన వచ్చింది. మైక్యాష్ కస్టమర్లలో 70 శాతం మంది అంతకు ముందు ఏ బ్యాంకులోనూ ఖాతాలు లేని వారే. 38 శాతం మంది మహిళలే. వారు పొదుపు అవసరాలకు ఈ సర్వీసును ఉపయోగించుకున్నారు. మహిళా కస్టమర్ల సంఖ్యను పెంచుకునేందుకు మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతకు మైక్రోబ్యాంకు చర్యలు తీసుకుంది.

**ఒక విధానంగా ప్రభుత్వాలు ఈ దిగువ చర్యలు తీసుకోవచ్చు.**

- డిజిటల్ ఆర్థిక సమ్మిళితత్వానికి ఉదాహరణకి డిజిటల్ సంతకాలకు అవసరమైన నియంత్రణాపరమైన చర్యలు తీసుకోవాలి.
- చట్టపరమైన, నియంత్రణ వ్యవస్థలను సంస్కరించాలి. ఉదాహరణకి "మీ కస్టమర్‌ను తెలుసుకోండి" (కెవైసి) విధానాన్ని సరళం చేయాలి.
- ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మహిళల్లో చైతన్యం పెంచాలి.

ఈ మూడింటిలోనూ కూడా ఐసిటిని ఉపయోగించేందుకు అవకాశాలు చాలా ఉన్నాయి. వాటికి కొన్ని ఉదాహరణలు...

### 5.3.1 ప్రభుత్వ చెల్లింపుల డిజిటైజేషన్

ప్రభుత్వానికి చేయాల్సిన చెల్లింపులన్నీ మొబైల్ ఫోన్ ద్వారా లేదా ఆన్‌లైన్‌లో చేసే అవకాశం కల్పించడం వల్ల సమయం, వ్యయాలు కూడా ఆదా అవుతాయి. అల్పాదాయ వర్గాలను గుర్తించి పన్ను రిటర్న్‌లు, క్రెడిట్‌లు, ప్రత్యక్ష నగదుబదిలీ వంటి చర్యలు వారికి లబ్ధి చేకూరేలా చేయడం ప్రభుత్వానికి సాధ్యం అవుతుంది. ప్రభుత్వం పౌరులకు, చిన్న వ్యాపారులకు తరచుగా చేసే చెల్లింపులన్నీ (పేరోల్స్, సామాజిక ప్రయోజక బదిలీలు, మానవతాపూర్వక సహాయం) డిజిటైజ్ చేయడం వల్ల లీకేజిలను నివారించవచ్చు.

చైనా ప్రభుత్వం ఇప్పుడు లబ్ధిదారులకు అందించే సబ్సిడీలన్నింటినీ బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తుంది. అలాగే లబ్ధిదారులు తమ సొమ్మును 9 లక్షలకు పైగా ఉన్న మామ్ అండ్ పాప్ దుకాణాలు, ఏజెంట్ల వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ పరికరం ద్వారా అందుకోవచ్చు.

### 5.3.2. మహిళల కోసం ఆర్థిక సర్వీసుల విస్తృతి

డిజిటల్ గుర్తింపును పెంచాలి. పురుషులతో పోల్చితే మహిళలు అకౌంట్లు ప్రారంభించడానికి అవసరమైన లాంఛనప్రాయమైన గుర్తింపు తక్కువగా కలిగి ఉంటారు. వారికి డిజిటల్ గుర్తింపు సదుపాయం కల్పించడం వల్ల ఆర్థిక సమ్మిళితత్వం సాధ్యపడుతుంది.

- పాకిస్తాన్‌లో బ్యాంకు ఖాతాలు తెరవడానికి బయోమెట్రిక్ ఐడి విధానం (వేలిముద్ర, ఐరిస్ స్కాన్) ప్రవేశపెట్టారు. అలాగే తక్కువ లావాదేవీలు, చిన్న మొత్తాల్లోనే సొమ్ము నిల్వ ఉండే ఖాతాలకు తక్కువ డాక్యుమెంటేషన్ సరిపోయేలా అంచెలవారీ కెవైసి విధానం అమలుపరిచారు.
- బంగ్లాదేశ్‌లో మొబైల్ బ్యాంక్ ఖాతాలకు కెవైసి నిబంధనను బంగ్లాదేశ్ బ్యాంక్ సరళతరం చేసింది. అలాగే

పపూవా న్యూగినియాలో మైక్యాష్ మొబైల్ మనీ ఖాతాలు తెరవడానికి గ్రామీణ స్థాయిలోని నాయకులు ఇచ్చే లేఖనే ఖాతాదారు గుర్తింపుగా జాతీయ మైక్రోబ్యాంకు అనుమతిస్తోంది.

- సాధారణంగా అవ్యవస్థీకృత రంగంలోని సంస్థలు, అల్పాదాయ వర్గాలకు చెందిన రుణగ్రహీతలకు సంబంధించి రుణం పొందిన వ్యక్తి తిరిగి చెల్లించే సామర్థ్యం అంచనా వేయడం రుణాలందించే సంస్థలకు కష్టంగా ఉంటుంది. ఇది రుణాల మంజూరుకి పెద్ద అవరోధంగా మారింది. డిజిటల్ టెక్నాలజీలు ఈ ఇబ్బందిని తప్పించి రుణం కోసం వచ్చిన వారి క్రెడిట్ స్కోర్‌ను అందించగలుగుతాయి.
- చైనాకు చెందిన ఇ కామర్స్ సంస్థ అలీబాబా అనుబంధ సంస్థ అలీ ఫైనాన్స్ ఇ కామర్స్‌లో కార్యకలాపాలు సాగించే చిన్న వ్యాపారులకు రుణాలందిస్తుంది. రుణం కోసం అభ్యర్థించిన వారు మూడు నెలల కాలంలో నిర్వహించిన ఆన్‌లైన్ కార్యకలాపాలను ఈ సంస్థ పరిశీలించి ఆటోమేటిక్‌గానే రుణం మంజూరు చేస్తుంది.

కెవైసి నిబంధనలు సరళం చేయడం వల్ల సిమ్ రిజిస్ట్రేషన్, మొబైల్ కనెక్షన్ పొందడం మహిళలకు తేలిక అవుతుంది. ఉదాహరణకి డిజిటల్ సేవింగ్స్ సర్వీసులను బీమా, రుణ ఖాతాలతో అనుసంధానం చేయడం వల్ల ఆ ఖాతాలో పరిమితికి మించి భారీగా సొమ్ము ఉన్నట్టయితే అది ఆటోమేటిక్‌గా అధిక వడ్డీ ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లోకి బదిలీ చేయడానికి, తక్కువ నిల్వ ఉన్నప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలతోని సొమ్ము తిరిగి సేవింగ్స్ ఖాతాలోకి రావడానికి వీలు కలుగుతుంది. దీని వల్ల డిపాజిట్ కాలపరిమితిలో ఎఫ్‌డిపై వారికి వడ్డీ కూడా లభిస్తుంది. మహిళలు ఖాతాలు తెరిచేందుకు ఇది ప్రోత్సాహకరంగా ఉంటుంది.

### 5.3.3. చైతన్యం, విశ్వాసం పెంపు చర్యలు

రేడియో, టివి వంటి సాంప్రదాయిక మీడియా పరిధి, శ్రోతల సంఖ్య అధికంగా ఉండడంతో పాటు విశ్వసనీయత కూడా ఉండడం వల్ల మౌలిక వసతులు, కనెక్టివిటీ సంబంధిత అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచడానికి ఈ మీడియాను ఉపయోగించుకోవచ్చు. అయితే మహిళలకు తమ సమీపంలోని "ఓవర్ ద కౌంటర్" లావాదేవీలు నిర్వహించే వారి మీద ఎక్కువ విశ్వాసం ఉంటుంది గనుక సమాజంతో మమేకమై పని చేసే వారిని వారధిగా తీసుకుని డిజిటల్ సర్వీసులపై చైతన్యం పెంచడం ద్వారా మహిళలు అధిక సంఖ్యలో డిజిటల్ ఆర్థిక సర్వీసుల్లో భాగస్వాములయ్యేలా చేయవచ్చు. బంగ్లాదేశ్‌లో ఇన్ఫోలేడీస్ (కేస్‌స్టడీ 4 చూడండి), ఫిలిప్పీన్స్‌లో కమ్యూనిటీ ఇ సెంటర్లు ఇందుకు చక్కని ఉదాహరణ.

### 5.3.4. క్రౌడ్‌ఫండింగ్

సాంప్రదాయిక ఆర్థిక సర్వీసులకు భిన్నంగా జరిగేది క్రౌడ్‌ఫండింగ్ వ్యవస్థ. క్రౌడ్‌ఫండింగ్ నిర్వాహకులు సమాజంలో కాస్తంత ఆర్థిక స్తోమత గల వ్యక్తులు, సంస్థల నుంచి నిధులు సమీకరించి ప్రాజెక్టులు, వ్యాపారాలకు, కొందరి వ్యక్తిగత అవసరాలకు కూడా ఆన్‌లైన్ వెబ్ ఆధారిత, మొబైల్ ఆధారిత వేదికల ద్వారా రుణాలందిస్తారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను విస్తరించగల సామర్థ్యం ఈ క్రౌడ్‌ఫండింగ్‌కు ఉంది. అయితే దీని నిర్వహణకు కొన్ని నియంత్రణాపరమైన నిబంధనలు రూపొందించడం అవసరం. చైనాలో ప్రస్తుతం 10 వేల వరకు క్రౌడ్‌ఫండింగ్ సంస్థలు పని చేస్తున్నాయి. వీటికి ఒక నియంత్రణ వ్యవస్థ రూపొందించే ప్రయత్నంలో చైనా బ్యాంకింగ్ రెగ్యులేటరీ కమిషన్ ఉంది. ఈ దిగువ రెండు కేస్‌స్టడీలు ఐటి ఆధారిత క్రౌడ్‌ఫండింగ్ సహాయంతో సాంప్రదాయిక సామాజిక నెట్‌వర్కింగ్ విస్తరణకు చక్కని ఉదాహరణగా నిలుస్తాయి.

**కేస్‌స్టడీ 15** : రొటేటింగ్ పొదుపు, రుణ సంఘాలు

సమాజంలోని కొందరు వ్యక్తులు నిర్దిష్ట కాలానికి ఒక బృందంగా ఏర్పడి ఉమ్మడిగానే పొదుపు చేసి, ఉమ్మడిగానే రుణాలు సమీకరించే వ్యవస్థను రొటేటింగ్ పొదుపు, రుణ సంఘంగా (రోస్కా) వ్యవహరిస్తారు. అంటే సమాజంలోని వ్యక్తుల మధ్యనే బ్యాంకింగ్, రుణ కార్యకలాపాలన్న మాట. దీన్నే పీర్ టు పీర్ (పి2పి) బ్యాంకింగ్, పి2పి లెండింగ్ అంటారు. సంఘంలోని సభ్యులందరూ ముందుగా నిర్ణయించుకున్న ఒక తేదీ రోజున నిర్దేశిత మొత్తాన్ని ఒక హుండీలో వేస్తారు. ఇలా సమకూరిన సొమ్ము అంతటినీ నెలకి ఒక వ్యక్తి తన అవసరం కోసం ఏకమొత్తంలో తీసుకోవచ్చు. ఫండ్ మేనేజర్‌గా వ్యవహరించేందుకు ఒక వ్యక్తిని బృందం సభ్యుల్లో నుంచే ఎంపిక చేసుకుంటారు. ఆ వ్యక్తి పర్యవేక్షణలోనే లావాదేవీలన్నీ జరుగుతాయి. అంటే రోస్కా వ్యవస్థ నడిచినంత కాలం ఆ సంఘంలోని ప్రతీ వ్యక్తికి ప్రతీ నెలా పెద్ద మొత్తంలో సొమ్ము అందుబాటులో ఉంటుంది.

అలాగే అవ్యవస్థీకృత రంగంలోని మరో ఉమ్మడి చిట్‌ఫండ్ **"కిట్టీపార్టీ"**. దక్షిణాసియా మహిళల్లో ఇది బహుళ ప్రాచుర్యం పొందింది. ఇందులో కూడా ఆ బృందంలోని మహిళలందరి నుంచి నిధి సమీకరించి ఆ మొత్తాన్ని అవసరంలో ఉన్న వ్యక్తికి డిస్కౌంట్‌పై పాడుకునే అవకాశం కల్పిస్తారు. ఇందులో లావాదేవీల్లో ఎలాంటి రహస్యం ఉండదు గనుక ప్రతీ ఒక్కరూ దాన్ని పరిశీలించే వీలుంటుంది. గ్రూప్ సభ్యుల్లో ఎవరి దగ్గర ఒక్క పైసా కూడా మిగులు ఉండదు. ఇది వ్యవస్థీకృత ఆర్థిక సంస్థలకు భిన్నంగా పూర్తిగా పారదర్శకంగా జరిగే ప్రక్రియ గనుక బహుళ ప్రజాదరణ పొందింది.

తూర్పు ఆఫ్రికాలో **"హరంబీ"** లేదా **"చంగా"** పేరిట పనిచేస్తున్న సామాజిక నిధుల సమీకరణ వ్యవస్థను కెన్యాలో ఎం-చెంగా పేరిట డిజిటైజ్ చేశారు. మిత్రులు, బంధువుల మధ్య భౌగోళిక దూరంతో సంబంధం లేకుండా సామాజిక నిధుల సమీకరణ శక్తిని ఉపయోగించుకుని త్వరితగతిన, తక్కువ వ్యయాలతో నిధులు సమీకరించేందుకు ఈ ఎం చంగా టెక్నాలజీ ఉపయోగపడుతుంది. సఫారీకామ్ అందించిన ఎం-పెసా, ఎయిర్‌టెల్ మనీ, పేపాల్ వేదికల ద్వారా ఎం చంగాకు చెందిన 10 వేల మంది కస్టమర్లు 65 వేల మంది నుంచి 1.8 లక్షల డాలర్ల మేరకు నిధులు సమీకరించగలిగారు.

**కేస్‌స్టడీ 16** : కివా.ఆర్గ్ ద్వారా క్రౌడ్‌ఫండింగ్

లాభాపేక్షరహిత సంస్థ కివా.ఆర్గ్‌ను 2005 సంవత్సరంలో పి2పి లావాదేవీలకు వేదికగా ఏర్పాటు చేశారు. ఈ వేదికపై 25 డాలర్ల అతి చిన్న మొత్తం నుంచి కూడా ఆర్థిక సహాయం అందించవచ్చు. వ్యాపారకార్యకలాపాలు, స్వచ్ఛ ఇంధనాలు వంటి రంగాలకు ఈ వేదికపై ఆర్థికసహాయం అందుతుంది. దరఖాస్తుదారులెవరైనా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుంటే వారి అవసరాలను పరిశీలించి ఆర్థిక సహాయానికి ఏర్పాట్లు చేస్తారు. ఈ వెబ్‌సైట్ ద్వారా అందించిన రుణాల వసూలు కూడా 97 శాతం ఉంది.

### మౌలిక వసతులు-సాంకేతికత

మహిళా వ్యాపార సంస్థలకు స్మార్ట్ ఫోన్లతో సహా వివిధ రకాల ఐసిటి మౌలిక వసతుల కొరత అధికంగా ఉంది. వర్తమాన వాతావరణంలో వ్యాపారాభివృద్ధికి ఇలాంటి పరికరాలు చాలా కీలకం. వ్యయాలు, నెట్‌వర్క్ నాణ్యత/కవరేజ్, భద్రత/వేధింపులు, సాంకేతిక అక్షరాస్యత/విశ్వాసం పరంగా వారు పలు అవరోధాలు ఎదుర్కొంటున్నారు. ఈ పరిమితులను అధిగమించాలంటే ప్రభుత్వం ఈ దిగువ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

- ఐసిటి మౌలిక వసతులు, సేవలను విస్తరింపచేయాలి. మొబైల్ ఫోన్ అప్లికేషన్లు స్థానిక భాషల్లో కూడా తయారుచేయాలి.
- కాలాన్ని ఆదా చేయగల సాంకేతిక పరికరాలు మహిళలకు అందుబాటులోకి తేవాలి.
- మౌలిక వసతుల అభివృద్ధిని మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి కార్యకలాపాలతో అనుసంధానం చేయాలి.
- సమాజాన్ని చైతన్యవంతం చేసే ప్రక్రియలో పాత, కొత్త ఐసిటిలన్నింటినీ మిళితంచేసి ఉపయోగించాలి.
- ఆన్‌లైన్‌లోను, టెలీ సెంటర్ల వంటి ప్రదేశాల్లోను సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. మహిళలు, సర్వీస్ ప్రొవైడర్ల మధ్య విశ్వాస రాహిత్యానికి దారి తీస్తున్న వ్యవస్థలను సరిదిద్ది ఆన్‌లైన్‌లో వేధింపులకు అడ్డుకట్ట వేయాలి.

### 5.5. సామర్థ్యాల నిర్మాణం-వ్యాపారాభివృద్ధి సేవలు

మహిళలు ఐసిటి పరికరాలు, వ్యాపారాభివృద్ధి సేవలు (బిడిఎస్) సమర్థవంతంగా వినియోగించుకోలేకపోవడానికి ఆర్థిక, సాంకేతిక నిరక్షరాస్యతే కారణం. అలాగే మహిళలకు అవసరం అయినన్ని బిడిఎస్ సేవలు కూడా అందుబాటులో లేవు. ఉన్నా నాణ్యతా లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇలాంటి అక్షరాస్యత కల్పించాల్సిన వారి సంఖ్య భారీగానే ఉన్నందు వల్ల ఈ దిగువ చర్యలు అవసరం.

- మహిళా పారిశ్రామికులు, వ్యాపారవేత్తలకు ఆన్‌లైన్ కోర్సులు, శిక్షణ సేవలు అందుబాటులోకి తేవాలి. అయితే ఇలాంటి సేవలు అందుబాటులో ఉంచే కేంద్రంలో ఆన్‌లైన్‌లోనే ముఖాముఖి సంభాషణకు కూడా సదుపాయాలుండాలి.
- ఆన్‌లైన్ పోటీ పరీక్ష ఆధారిత సర్టిఫికేషన్ కూడా అందుబాటులో ఉంచాలి. అలాగే మహిళల్లో ఎవరైనా ఇప్పటికే పిల్లలకు ఇలాంటి విద్య నేర్పుతున్నట్టయితే వారికి గల పరిజ్ఞానం, పోటీ సామర్థ్యాన్ని పరీక్షించి వారికి కూడా సర్టిఫికెట్లు జారీ చేయాలి. దీని వల్ల వారు తేలిగ్గా తమ ప్రాజెక్టుల కోసం ఆర్థిక సహాయం అందుకోగలుగుతారు.

### 5.6. సేవల విస్తరణ, మార్కెటింగ్

మహిళలకు సాధారణంగా సమయం, చలనశీలత తక్కువగా ఉంటుందని గుర్తించారు. అందుకే వారు సర్వీసులు పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. అంతే కాదు విద్య, ఆర్థిక నిరక్షరాస్యత, సరైన సమాచారం అందుబాటులో లేకపోవడం వంటి ఇబ్బందులకు కూడా గురవుతున్నారు. సరఫరా కోణంలో నుంచి చూసినా ఒకే కార్యక్రమం ద్వారా మహిళలు, పురుషులు పొందే లబ్ధిలో తేడాకు సంబంధించిన అవగాహన ఆయా సేవలు అందుబాటులో తెస్తున్న వారిలో లోపించింది. అందుకే మహిళల కోసం అందుబాటులో ఉన్న కార్యక్రమాల నుంచి పూర్తి లాభాన్ని వారు పొందలేకపోతున్నారు. ఈ లోపాన్ని సరిదిద్దాలంటే ప్రభుత్వం ఈ దిగువ చర్యలపై దృష్టి పెట్టాలి.

- మహిళలకు అనుకూలమైన సమయంలో వారికి శిక్షణ ఇవ్వగల స్థానిక కేంద్రాలను గుర్తించి అక్కడ వారికి శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేయాలి.
- మహిళల కోసం ప్రత్యేకంగా సమాచార ప్రచారాలు చేపట్టాలి.

- లింగవ్యత్యాసపరంగా వారి వేర్వేరు అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా వసతులు తయారుచేయాలి. ఉదాహరణకి సమాచారం అందించడంలో అక్షరాస్యతా లోటు ఉన్నట్టు గుర్తిస్తే ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ (ఐవిఆర్ఎస్), వాయిస్‌మెయిల్ వంటి సదుపాయాలు ఉపయోగించుకోవాలి.
- ఎప్పటికప్పుడు తాజా సమాచారం అందుబాటులో ఉంచేందుకు ఎస్ఎంఎస్ సర్వీసును ఉపయోగించుకోవాలి.
- మీడియా ద్వారా కూడా సమాచారం అందించేందుకు కృషి చేయాలి.

లింగ సమానత్వ సాధన, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల ప్రోత్సాహంలో ఐసిటి వినియోగం గురించి ఇప్పటివరకు చర్చించుకున్నాం. రానున్న విభాగాల్లో వాటి అమలుకు చెందిన అంశాలు పరిశీలిద్దాం.

### 5.7. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం లింగసమానత్వం గల ఇ గవర్నెన్స్ విధానం

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఐసిటి ఉపకరణాలన్నీ మహిళలు, పురుషులు సమానంగా వినియోగించుకోగలిగేలా లేవని ఇప్పటికే తెలుసుకున్నాం. సామాజిక, రాజకీయ వ్యవస్థల్లో అసమానతలే ఇందుకు ప్రధాన కారణం. ఇ గవర్నెన్స్‌లో లింగసమానత్వం సాధించేందుకు ఐదు అంశాలు ప్రధానమని ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ (యుఎన్‌డిపి) గుర్తించింది. లింగసమానత్వానికి దోహదపడే ఇ గవర్నెన్స్ కార్యక్రమాలు రూపొందించడం, మౌలిక ఇ సర్వీసులు అందరికీ అందుబాటులో ఉంచడం, బృందాలుగా ఏర్పడిన మహిళలు,యువత అందరూ సమానంగా ఎలక్ట్రానిక్ ఆధారిత కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కల్పించడం, ఐసిటి వసతుల లభ్యత, ఐసిటి ద్వారా ప్రభుత్వ సమాచారం అందుబాటులో ఉంచడం ఆ ఐదు సూచనలు.

చాలా సందర్భాల్లో నిర్దిష్ట ఇ గవర్నెన్స్ విధానాలను ఎవరు ఎలా ఉపయోగించుకుంటున్నారన్న అంశంపై ప్రభుత్వం గణాంకాలు సేకరించడంలేదు. అందుకు సంబంధించిన సమాచారం అంతా సమీకరించి లింగ ప్రాధాన్యతా క్రమంలో బడ్జెట్లు, వనరులు కేటాయించాలి. ప్రధానంగా (1) ఐసిటిల వల్ల మహిళలు ఎలక్ట్రానిక్ సేవలు అందుకోగలుగుతున్నారా, (2) ఎక్కడెక్కడ సేవల అందుబాటులో వ్యత్యాసాలున్నాయి, (3) లభ్యత, అవకాశం పెంచేందుకు గల ఉత్తమ మార్గాలేవి అన్న అంశాలపై దృష్టి పెట్టాలి. ఎన్ని ఐసిటి సదుపాయాలు అందుబాటులోకి తెచ్చినా వాటిని ఆచరణీయం చేయడంలో వైఫల్యం కారణంగానే అవి పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావడంలేదని అనుభవాలు తెలుపుతున్నాయి. సరసమైన ధరలకు అందుబాటులో ఉండే సొల్యూషన్లు, సమ్యక్ దృక్పథం వల్ల అమలు సమర్థవంతంగా ఉండడంతో పాటు నిర్వహణా వ్యయాలు కూడా తగ్గుతాయి. వినియోగదారులు తేలిగ్గా ఉపయోగించుకోగల సరళత్వం లోపిస్తే ఇ సర్వీసుల ప్రయోజనం ఏ విధంగానూ కనిపించదు. ముఖ్యంగా అక్షరాస్యత లేని వారికి అర్థం అయ్యేలా చేసేందుకు ఐవిఆర్ఎస్ ద్వారా వాటిపై అవగాహన కల్పించడం అవశ్యం.

ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో మహిళా సాధికారికతలో ఇ గవర్నెన్స్ పాత్రకు సంబంధించి ఎస్కాప్ నిర్వహించిన అధ్యయనంలో లింగసమానత్వంతో కూడిన వాతావరణానికి మూడు ప్రధానాంశాలను గుర్తించింది.

- డిజిటల్ ప్రాసెస్, మానవ వనరుల మధ్యవర్తిత్వం నడుమ సమతూకం సాధించాలి.
- డేటా, కనెక్టివిటీలపై పెట్టుబడులు పెంచాలి.
- పారదర్శకత, గోప్యత కోసం లింగసమానత్వం గల డేటా నిర్వహణ తప్పనిసరి.

మొత్తం మీద లింగసమానత్వ సాధనకు ఐసిటిలు ఎంతగానో సహాయపడతాయి. అయితే ఐసిటి విధానాల రూపకల్పనలో లింగసమానత్వ సాధన, ఐసిటిల లభ్యతలోని లోటుపాట్లు, సేవా నాణ్యత, స్త్రీపురుషుల మధ్య వ్యత్యాసానికి సంబంధిచిన చట్టపరమైన, సామాజిక, రాజకీయ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి.

## 5.8 అమలు

ఏ కార్యక్రమం లేదా ప్రాజెక్టు లేదా విధానం అమలుచేయాలన్నా పురుషులు, మహిళల్లో ఐసిటిల వినియోగానికి అవరోధాలు, సహాయపడే అంశాలపై వేర్వేరుగా సవివరమైన సమాచారం అందుబాటులో ఉండాలి. మహిళల్లో అక్షరాస్యత, కాలానుగుణమైన పేదరికం, పని, గృహబాధ్యతలు, చలనశీలత లేకపోవడం, సామాజిక, సాంస్కృతిక అవరోధాలకు సంబంధించిన సమాచారం ఉన్నా అది సమగ్రంగా లేదు. ఇలాంటి డేటా అందుబాటులో ఉండడం వల్ల విధానాల్లో ప్రాధాన్యతలను నిర్ణయించుకుని అమలుకు అవసరమైన వ్యూహాలు రచించుకోవడం తేలికవుతుంది. డేటా లేని చోట స్పష్టత ఉండదు, స్పష్టత లేని చోట ప్రాధాన్యత ఉండదు. ఉభయులకు సంబంధించిన గణాంకాలు విడివిడిగా కాకుండా గంపగుత్తగా అందుబాటులో ఉన్నప్పటికీ మహిళలు, పురుషుల ప్రోత్సాహం కోసం చేపట్టవలసిన చర్యలు విధానాల్లో వేర్వేరుగా పొందుపరచడం సాధ్యం కాదు. అందుబాటులో ఉండే గణాంకాలు కూడా నాణ్యమైనవి, లోతైనవిగా ఉండాలి. ఉదాహరణకి లింగపరమైన వివక్షకు కారణం అవుతున్న అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరం అయిన ప్రాజెక్టులు ఎడిబి చేపట్టడాన్ని ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. అలాంటి గణాంకాల సమీకరణకు అనుసరించాల్సిన విధానం...

- కుటుంబ స్థాయి నుంచి కాకుండా వ్యక్తిగత స్థాయి నుంచి గణాంకాలు సేకరించాలి.
- కుటుంబ స్థాయి నుంచి గణాంకాలు సేకరించినా ఆస్తుల యాజమాన్యం, అదుపునకు సంబంధించిన గణాంకాలు సేకరించడం అవసరం. సాధారణంగా కుటుంబ స్థాయి నుంచి గణాంకాలు సేకరించిన సందర్భాల్లో మహిళలు కూడా సంపాదనాపరులైనప్పటికీ పురుషులనే "ఇంటి పెద్ద"గా పరిగణించడం జరుగుతూ ఉంటుంది. ఐసిటిల అదుపునకు సంబంధించినంత వరకు ఇలాంటి గణాంకాలు సమగ్రం కావు. ఇంటిలో ఐసిటిల యాజమాన్యం, అదుపు ఎవరి చేతిలో ఉన్నదన్న గణాంకాలు సేకరించడం చాలా అవసరం.
- ఇంటిలో కూడా వేతనంతో కూడిన పనులు/వేతనం లేకుండా చేసే పనులు, వాటికి కేటాయిస్తున్న సమయం, చేస్తున్న కృషికి సంబంధించిన వివరాలు కూడా సేకరించడం అవసరం. సాధారణంగా ఇంటి పనులను ప్రత్యేకించి పశుసంపద సంరక్షణ వంటి చర్యలను అవ్యవస్థీకృతమైనవిగా పరిగణించడం పరిపాటి.
- కుటుంబంలోని మహిళలు ఏ పనికి ఎంత సమయం కేటాయిస్తున్నారు లేదా వెచ్చిస్తున్నారు వంటి గణాంకాలు కూడా తీసుకోవాలి. సాధారణంగా బయటకు వెళ్ళి ఇంటి అవసరాల కోసం నీరు, వంటచెరకు సేకరించేందుకు వెచ్చిస్తున్న సమయానికి సంబంధించిన వివరాలు సేకరించాలి. అప్పుడే వారి ప్రయోజనం కోసం చేపట్టే ప్రాజెక్టుకు వారు ఎంత సమయం కేటాయించగలరన్నది అర్థం చేసుకోగలుగుతారు.
- కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరు మీద బ్యాంకు ఖాతాలున్నాయి, ఆ ఖాతాలపై వారికి ఎంత అదుపు ఉన్నది అనే విషయాన్ని బట్టి కూడా వారికి అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులపై అవగాహన ఏర్పడుతుంది.
- మొబైల్ నగదు వేదికల వినియోగానికి సంబంధించిన గణాంకాలు సేకరించాలి. దీని వల్ల మహిళలు, పురుషులు వేర్వేరుగా ఆన్‌లైన్, మొబైల్ మనీ వేదికలను ఎంత మేరకు ఉపయోగించుకుంటున్నారన్న అవగాహన కలుగుతుంది.
- ఇంటిలో మరుగుదొడ్లు, నీరు వంటి సదుపాయాలకు సంబంధించిన గణాంకాలు సేకరించడం మహిళలు, బాలికల కోణంలో నుంచి చూస్తే చాలా అవసరం. వారి సమయం, ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహనకు ఈ తరహా గణాంకాలు సహాయకారిగా ఉంటాయి.
- ప్రాంతాలవారీగా మహిళలకు అవరోధంగా ఉన్న సామాజిక, సాంస్కృతిక అంశాలను కూడా గణాంకాల సేకరణలో పొందుపరచాలి.

- మహిళల భౌతిక ఆరోగ్యం, సాధికారికత గురించి తెలుసుకోవాలంటే గృహహింసకు సంబంధించిన గణాంకాలు సేకరించడం అవశ్యం.
- మహిళలు, పురుషులకు సంబంధించి మీడియా, ఐసిటిల లభ్యతకు సంబంధించిన గణాంకాలు కూడా సేకరించాలి.

ఐసిటికి సంబంధించిన లింగపరమైన గణాంకాలు సేకరించే సమయంలో ఈ దిగువ ప్రశ్నావళి ఉపయోగకరంగా ఉంటుంది.

- ఐసిటిలను మహిళలు, పురుషులు ఎక్కడ, ఏ విధంగా, ఎప్పుడు, ఎందుకు వినియోగిస్తున్నారు?
- ఇంటర్నెట్ అందుబాటులో మహిళలకు గల అవరోధాలేమిటి?
- సమాచార సాంకేతిక పరిజ్ఞాన సమాజంలో పని చేయడానికి అవసరమైన విద్య, శిక్షణ, నైపుణ్యాలు మహిళలకు ఉన్నాయా?
- ఐసిటి ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో లింగపరమైన వ్యత్యాసాలెలా ఉన్నాయి?
- ఆయా ప్రాంతాలు, పరిస్థితుల రీత్యా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఆదాయం, స్వయంఉపాధికి ఐసిటిలు ఏ విధంగా ఉపయోగకరంగా ఉన్నాయి?
- మహిళలు, బాలికలకు ఎలాంటి సమాచారం లేదా కంటెంట్ అవసరం?
- వర్ధమాన దేశాల్లో మహిళలు, బాలికల ఆరోగ్యస్థితిని, వారి కుటుంబ పరిస్థితులు మెరుగుపరచడంలో ఐసిటిలు పోషిస్తున్న పాత్ర ఏమిటి?
- గోప్యత, భద్రత కోణం నుంచి మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందులేమిటి?
- ప్రభుత్వ ఐసిటి విధానం, పాలనలో మహిళా ప్రాతినిథ్యం, భాగస్వామ్యం ఎంత మేరకు ఉంది?

ఐసిటిల వినియోగంలో లింగవ్యత్యాసపరమైన సమస్యలను గుర్తించిన తర్వాత చేపట్టవలసిన కార్యాచరణ ఈ దిగువ విధంగా ఉండవచ్చు.

- కనెక్టివిటీని పెంచాలి, తక్కువ కనెక్టివిటీ ఉన్న సందర్భాల్లో అందుకు సంబంధించిన నిర్దిష్టమైన అంశాలు పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ఉదాహరణకి సాధారణ ఫోన్ వినియోగంలో ఉన్న చోట స్మార్ట్‌ఫోన్ల వినియోగానికి చొరవ తీసుకోవడం.
- ఇంటి నుంచి స్వల్పదూరంలోనే మహిళల కోసం పూర్తి భద్రతతో కూడిన సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.
- ఇలాంటి కేంద్రాల్లో బాలల సంరక్షణ, ఇతర ఆరోగ్య సదుపాయాలు కూడా అందుబాటులో ఉండాలి.
- కచ్చితమైన పని వేళలు కాకుండా మహిళలు ఉపయోగించుకునేందుకు అవకాశం గల పనివేళల్లో స్థానికంగానే శిక్షణ సదుపాయాలు అమలులో ఉంచాలి.
- శిక్షణలో మహిళల ప్రత్యేక అవసరాలు పరిగణలోకి తీసుకోవాలి.
- శిక్షణ ఇచ్చే వారు అందరూ మహిళలే కాకపోయినా వారిలో లింగసమానత్వ ధోరణులు ఉండేలా చూడాలి.
- స్థానిక భాషల్లో కంటెంట్ తయారుచేయడంతో పాటు కంటెంట్ తయారుచేయడంలో మహిళలను కూడా భాగస్వాములను చేయాలి. వారి అనుభవాలనే బోధనాంశాలుగా పొందుపరచడం మంచిది.
- భిన్న ప్రసార సాధనాలు ఉపయోగించడం వల్ల మహిళలకు సమాచారం భిన్న మార్గాల ద్వారా అందుబాటులో ఉంటుంది. ఒక రకమైన ప్రసార సాధనాన్ని వారు ఉపయోగించకపోయినా మరో దాని ద్వారా సమాచారం అందుకోగలుగుతారు.
- సరళమైన భాషలో ఎస్ఎంఎస్ అలర్ట్‌లు, ఐవిఆర్ఎస్, వాయిస్ మెయిల్ సేవలు అందించడం వల్ల అక్షరాస్యత, సమయం, దూరం వంటి అవరోధాలను అధిగమించడం సాధ్యం అవుతుంది.
- మహిళల కోసం సంపూర్ణ భద్రతతో కూడిన వేదికలు, సేవలు అందుబాటులో ఉంచాలి.

మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు ఎదుర్కొంటున్న పలు అవరోధాలను తొలగించాలంటే లింగభేదంపరంగా సంక్లిష్టమైన సమస్యలతో పాటు ఐసిటికి సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించడం అవసరం. అప్పుడే వారు కొత్తతరహాలో ఆలోచించి సుసంపన్నత దిశగా అడుగు వేయగలుగుతారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అవసరం అయిన వనరులు, సమయం, సామర్థ్యం ఉండకపోవచ్చు. అయినా మహిళలకు అవరోధంగా ఉంటున్న అంశాలను గుర్తించడం ద్వారానే వాటిలో కొన్నింటికైనా పరిష్కారాలు అన్వేషించగలుగుతారు. అలా చేయలేకపోతే అసమానతలు మరింత పెరిగిపోయి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతోపాటుగా మహిళల అభివృద్ధిని సాధించే ప్రయత్నాలు విఫలం అవుతాయి.

**అభ్యాసం చేయాల్సిన అంశాలు...**

- మీ దేశంలో మహిళాభివృద్ధికి ఉపయోగపడే చట్టాలను గుర్తించండి. ఉదాహరణకి కార్మిక, ఆర్థిక సర్వీసులు, ఐటిచట్టాలు.
- లింగసమానత కోణంలో నుంచి ఆ చట్టాన్ని అధ్యయనం చేయండి. వాటిలో ఏవైనా సవరించాల్సిఉన్నదా అన్న విషయం గుర్తించండి.
- చట్టాలు, ఆచరణీయతలో చేయవలసిన మార్పులను సూచించండి.
- చట్టపరమైన అంశాల అమలుకు ఐసిటిని జోడించండి.
- లబ్ధిదారులకు సంపూర్ణ సమాచారం అందుబాటులో ఉంచే కమ్యూనికేషన్ మాధ్యమాలు, సలహా విధానాలు సూచించండి.

# VI. సంగ్రహ సారాంశం

స్థిరమైన అభివృద్ధి సాధించే క్రమంలో మహిళా సాధికారికత ప్రాధాన్యతను ఏ విధంగాను నిర్లక్ష్యం చేయకూడదు. ఆర్థిక సాధికారికత వస్తే ఇతర అంశాలన్నింటిలోనూ సాధికారికత ఏర్పడుతుంది. అందుకు మహిళలకు సాధికారత తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ఇంతకు ముందు మాడ్యూల్‌లో మూడు 'ఇ'ల -విద్య, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్- ప్రస్తావన వచ్చింది. విద్య అనేది పునాది అయితే ఉపాధి కీలకమైన అంశం. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వల్ల మహిళలు **"ఉద్యోగార్థుల"** నుంచి **"ఉపాధి అందించే వారు"**గా పరివర్తన చెందగలుగుతారు. గతంలోని అన్ని అధ్యాయాల్లోను చర్చించిన లింగసమానత్వం, ప్రభుత్వ పాత్ర, ఐసిటిల వినియోగం, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు ప్రోత్సాహం వంటి అంశాలన్నింటినీ ఒక చోట గుది గుచ్చి అందించడం ఈ ముగింపు విభాగం ప్రధాన లక్ష్యం.

## 6.1. లింగసమానత్వ చట్టాలు, విధానాలు

విధానాల రూపకల్పనలో లింగసమానత్వం కోసం కృషి చేయడం అత్యంత కీలకం. మహిళల వాక్కు విని, వారికి సంబంధించిన అంశాలను పరిష్కరించడానికి, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు గల అవరోధాలు, అడ్డంకులు తొలగించడానికి ఇది వీలు కల్పిస్తుంది. లింగసమానత్వం సాధించలేకపోతే మహిళా సాధికారికత సాధ్యం కాదు.

- లింగసమానత్వానికి దోహదపడే విధంగా ప్రస్తుత చట్టాల్లో సవరణలు చేపట్టాలి.
- మహిళల కోసం ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా జండర్ బడ్జెటింగ్ విధానం ఆచరించాలి. ప్రతి ఒక్క మంత్రిత్వ శాఖలోను మహిళల కోసం ప్రత్యేక కేటాయింపులు చేయాలి.
- మహిళల అవసరాలు, ఆందోళనలను పరిగణనలోకి తీసుకునేందుకు అన్ని స్థాయిల్లోనూ మహిళలకు సముచిత ప్రాతినిథ్యం కల్పించడం అవసరం.
- మహిళలకు సలహాలు ఇవ్వడానికి, కౌన్సెలింగ్ చేయడానికి, బిడిఎస్, సామర్థ్యాల నిర్మాణం, నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేకంగా సింగిల్ విండో సర్వీసులు ఏర్పాటు చేయాలి.
- మహిళల ఆర్థిక సమ్మిళితత్వానికి కృషి చేయాలి. భారత్‌లో భారతీయ మహిళా బ్యాంకు అందరి నుంచి డిపాజిట్లు సమీకరించినా రుణాలు మాత్రం మహిళలకే ఇవ్వడం, ఇండోనీసియాలో పొదుపు ఖాతాలున్న మహిళలకు కొన్ని షరతులతో కూడిన నగదు బదిలీ కోసం అమలుపరుస్తున్న కెలువార్గా హరపణ్ కార్యక్రమం ఇందుకు చక్కని ఉదాహరణ.
- మహిళల కోసం ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి మాత్రమే ఉపయోగపడే సర్వీసులు, సదుపాయాలు సిద్ధంచేయాలి.

ఇవి కొన్ని సలహాలు మాత్రమే. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని చర్యలు తీసుకోవచ్చు.

## 6.2. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఐసిటి అవకాశం

ఐసిటిలు మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు అవకాశాలు పెంచుతాయి. వ్యాపారాల సృష్టి, నిర్వహణ, ప్రచారం, సరఫరాల వ్యవస్థ నిర్వహణ, మార్కెటింగ్ చానెళ్ళ విస్తరణ, వ్యాపార సేవల అందుబాటు, కస్టమర్లు, వ్యాపార భాగస్వామ్యాలు, ఇతర భాగస్వామ్య వర్గాలను చేరువ చేయడం వంటి అంశాల్లో ఉపయోగకరంగా ఉంటాయి. ఒకసారి ఐసిటిపై పట్టు సాధిస్తే మహిళల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది. గత రెండు దశాబ్దాలుగా మహిళల

పరివర్తనలో కీలక పాత్ర పోషించిన ప్రధాన మీడియా, ఇంటర్నెట్ తరహాలోనే ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం త్వరితంగా పెరగడం వల్ల వివిధ సర్వీసుల ద్వారా మహిళల నాయకత్వంలోని వెంచర్లకు సహాయం చేసే అవకాశం ప్రభుత్వాలు, సర్వీస్ ప్రొవైడర్లకు ఏర్పడింది. అయితే ఇవి ఎంత మేరకు అందుబాటులో ఉన్నాయన్నది కీలకం. ఇందుకోసం తీసుకోవలసిన చర్యలు...

- ◆ జాతీయ బ్రాడ్‌బ్యాంక్ ప్లాన్లలో లింగసమానత్వాన్ని ఒక అంశంగా చేయాలి. మొబైల్ వినియోగాన్ని ట్రాక్ చేస్తూ లింగపరమైన వినియోగం ఆధారంగా గణాంకాలు వేర్వేరుగా సేకరించాలి.
- ◆ చైతన్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మహిళలకు మొబైల్, ఆన్‌లైన్ భద్రతకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా వారు ఎదుర్కొనే వేధింపులను నిరోధించేందుకు అవసరమైన చట్టపరమైన, విధానపరమైన చర్యలు తీసుకోవాలి.
- ◆ మహిళలకు తక్కువ వ్యయాలకే ఐసిటిలు అందుబాటులో ఉంచేందుకు, విస్తరణ చేసేందుకు అవసరమైన నిబంధనలు రూపొందించాలి. ఇందుకోసం మొబైల్ ఆపరేటర్లకు సరసమైన ధరలకు స్పెక్ట్రమ్ అందుబాటులో ఉంచడం, మొబైల్ ఆపరేటర్లు తమ మౌలికవసతులను ఒకరితో ఒకరు స్వచ్ఛందంగా పంచుకునే వెసులుబాటు ఉండాలి,
- ◆ మహిళలకు మొబైల్ నైపుణ్యాలు, డిజిటల్ నైపుణ్యాలను మిళితం చేస్తూ వారిలో డిజిటల్ అక్షరాస్యత పెంచే కార్యక్రమాలు రూపొందించడంతో పాటు ప్రాథమిక, మాధ్యమిక విద్యా స్థాయి నుంచే ఇలాంటి పాఠ్యాంశాలు పాఠ్యప్రణాళికలో భాగం చేయాలి.

ఆర్థిక అక్షరాస్యతకే కాదు...మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు ఐసిటిలు మార్కెట్లను కూడా చేరువ చేయగలుగుతాయి. వారికి కావలసిన ముడి వస్తువులు ఆన్‌లైన్‌లోనే సమీకరించుకోవడానికి ఇ కామర్స్ వేదికలపై తగు ఏర్పాట్లు చేయాలి. అజర్‌బైజాన్, కజకిస్తాన్, కిర్గిజ్‌రిపబ్లిక్, ఉజ్బెకిస్తాన్‌లలో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లలో ఐసిటి వినియోగ ధోరణులపై అధ్యయనం చేసిన ఎడిబి ఈ దిగువ సిఫారసులు చేసింది.

- ◆ మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు అందుబాటులో ఉన్న ఐసిటి ఆధారిత వ్యాపారావకాశాలపై టివి, రేడియో, ముద్రణ మాధ్యమాల్లో చక్కగా ప్రచారం చేయాలి.
- ◆ మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం ఐసిటి ఆధారిత మార్గదర్శక (మెంటరింగ్) కార్యక్రమాలు రూపొందించాలి.
- ◆ ఎస్ఎంఎస్, ఐవిఆర్ఎస్ ఆధారిత వాయిస్ మెయిల్ సమాచార సర్వీసులు అందుబాటులో ఉంచాలి.
- ◆ ఐసిటి సర్వీసుల పరిశ్రమ, ఆన్‌లైన్ వ్యాపారాల్లో కొత్త వెంచర్లు ప్రారంభించే మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు రుణాలు అందుబాటులో ఉంచాలి.
- ◆ భిన్న మంత్రిత్వ శాఖల్లో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల విభాగాలు ఏర్పాటు చేయాలి.
- ◆ గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో కూడా వ్యాపార సర్వీసులతో అనుసంధానమైన ఆర్థిక సహాయం, సామర్థ్యాల నిర్మాణం సేవలు అందుబాటులో ఉంచాలి.
- ◆ నూటికి నూరు శాతం కవరేజ్, ఎలక్ట్రానిక్ పేమెంట్ విధానాలు, మొబైల్ మనీతో కూడిన ఐసిటి మౌలిక వసతులు మెరుగుపరచాలి.

### 6.3. లింగసమానత్వంతో కూడిన విధానం రూపకల్పన

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించగల ఆర్థిక సాధికార కార్యక్రమాలు మరింతగా పెంచడానికి ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో చాలా కృషి చేయాల్సిఉంది. ఆయా ప్రాంతాల సాంస్కృతిక, రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఈ చర్యలు తీసుకోవడం అవశ్యం. క్షేత్ర స్థాయిలో వాతావరణం మారాలంటే మహిళలకు తమ వాక్కు వినిపించే అవకాశం కల్పించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేసే ధోరణులు పెరగాలి. లింగసమానత్వ సాధన అనేది ఏ శాఖకు ఆ శాఖ వేర్వేరుగా సాధించాల్సిన లక్ష్యమే అయినప్పటికీ అది మొత్తం ప్రభుత్వ చర్యలన్నింటిలోనూ ప్రతిబింబించాలి.

# అనుబంధం

## శిక్షకులకు సూచనలు

ఇది భిన్న లక్షణాలు గల సంక్లిష్టమైన మాడ్యూల్. మొదటిసారి చదవగానే ఒక దానితో ఒకటి సంబంధం ఉన్నట్టు కనిపించదు. ఎస్‌డిజిలు, లింగసమానత్వం, ఆర్థిక/ఫైనాన్స్ అంశాలు, ఐసిటి వంటి భిన్న కోణాలు ఇందులో చర్చకు వచ్చాయి. మహిళా సాధికారికతతో ముడిపడి ఉన్న భిన్న అంశాలపై విహంగవీక్షణం చేసే ప్రయత్నం జరిగింది. కాని ఇందులో చర్చించిన పలు సిద్ధాంతాలు మహిళల అభివృద్ధి కోణం నుంచి అత్యంత కీలకమైనవి. రచయిత వ్యక్తీకరించిన అభిప్రాయాలపై శిక్షకులకు ఒక అభిప్రాయం ఏర్పడేందుకు, శిక్షణ సమయంలో తమకు అవగాహన కలిగిన అంశాలను ఆచరించడానికి ఈ సూచనలు చేయడం జరిగింది.

## మాడ్యూల్ లక్ష్యం

లింగసమానత్వానికి సంబంధించిన అంశాలు సాధారణంగానే వ్యక్తిగతమైనవి, సునిశితమైనవి. ఇవి పురుషులు, మహిళల మధ్య సమానత్వానికి సంబంధించినవి. అందువల్ల లింగసమానత్వం విషయంలో ప్రభుత్వాధికారులకు సమగ్ర అవగాహన ఏర్పడి వారి ధోరణుల్లో మార్పు తెచ్చేందుకు సహాయపడడం ఈ మాడ్యూల్ ప్రధాన లక్ష్యం.

## సరైన శిక్షకుల ఎంపిక

ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అందుకు సరైన శిక్షకుల ఎంపిక అత్యంత కీలకం. సాధారణంగా ప్రభుత్వాధికారులు లేదా శిక్షకులకు దేశీయంగాను, అంతర్జాతీయంగాను అమలులో ఉన్న లింగసమానత్వ సంబంధిత అంశాలపై లోతైన అవగాహన అవశ్యం. సుస్థిర అభివృద్ధికి మహిళా సాధికారికత అత్యంత కీలకం అన్న విశ్వాసం తప్పనిసరి. అందుకే సామాజిక శాస్త్రవేత్త కూడా అయిన రచయిత ఈ మాడ్యూల్‌లో మహిళల అభివృద్ధి, ఐసిటికి సంబంధించిన పలు అనుభవాలను కూడా పొందుపరిచారు. క్షేత్రస్థాయి అనుభవం అభిలషణీయమే అయినా తప్పనిసరి కాదు. క్షేత్రస్థాయి అనుభవం వల్ల శిక్షకుల విశ్వసనీయత పెరుగుతుంది.

## టార్గెట్ బృందం

మధ్యస్థాయి, సర్వీసు మధ్యలో ఉన్న ప్రభుత్వోద్యోగులు, విధానకర్తలే దీని టార్గెట్ బృందం. పాలనా యంత్రాంగంలో వారికి గల పరిజ్ఞానం, క్షేత్రస్థాయి అనుభవం ఇందుకు ఉపయోగపడతాయి. వారికి ఆయా అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ పొందే బృందాలకు కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి శిక్షణ కార్యక్రమంలోను మహిళలు, పురుషులను సమాన సంఖ్యలో తీసుకోవాలి. వారికి సంబంధించిన అంశాలను కూడా అదే దామాషాలో తీసుకోవాలి. లెక్కకు మించి మహిళలను చేర్చడం వల్ల లింగసమానత్వంపై అవగాహన కల్పించడం అనే మాడ్యూల్ ప్రధాన లక్ష్యమే నీరుగారిపోయే ప్రమాదం ఉంది. అలాగే లెక్కకి మించి పురుషులను భాగస్వాములను చేయడం వల్ల మహిళల వాక్కు వినిపించే అవకాశం ఉండదు. అలాగే ఇందులో మహిళలకు సంబంధించిన వ్యవహారాలు పరిశీలించే మంత్రిత్వ శాఖలను మాత్రమే భాగస్వాములను చేయకూడదు. అన్ని మంత్రిత్వ శాఖలకు ప్రాతినిథ్యం కల్పించాలి. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, నైపుణ్యాల అభివృద్ధి, వృత్తివిద్యలు, వాణిజ్య/పరిశ్రమల శాఖ అన్నింటికీ లింగసమానత్వానికి ప్రాధాన్యత గల అంశాలు కీలకమే. ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా ఆర్థిక వనరులు తప్పనిసరి కావడం వల్ల ఆర్థిక మంత్రిత్వశాఖ భాగస్వామ్యం అత్యంత కీలకం.

### శిక్షణ కాలపరిమితి

అధికారులు, విధానకర్తలకు అందుబాటులో ఉండే సమయం ఆధారంగా శిక్షణ ఉంటుంది. లింగభేదానికి సంబంధించిన సమస్యల చర్చకు 1,2,3 సెక్షన్లు, లింగసమానత్వానికి సెక్షన్ 4, విధానాల రూపకల్పనలో లింగసమానత్వం కీలకాంశం చేయడానికి సెక్షన్ 5 అత్యంత కీలకం. మొత్తం కృషి అంతటికీ కేంద్రస్థానం ఈ సెక్షన్లు. అలాగే మాడ్యూల్‌లో ప్రస్తావనకు వచ్చిన అంశాలన్నింటినీ సెక్షన్ 6 ఒక సారి మననం చేస్తుంది. అందుబాటులో ఉన్న సమయం ఆధారంగా ఈ సెక్షన్లలో వేటికి ప్రాధాన్యత ఇవ్వవచ్చు అన్నది శిక్షకులు నిర్ణయించుకోవచ్చు. ఎవరికైనా 4,5 సెక్షన్లు మాత్రం అత్యంత కీలకం. ఈ మాడ్యూల్‌లో చాలా సమాచారం నిక్షిప్తం అయి ఉన్నందు వల్ల శిక్షణా కాలం ఒక పనిరోజు ఉంటుంది. ఒక్కోటి 90 నిముషాల కాలవ్యవధితో కూడిన నాలుగు సెషన్లుగా విభజించవచ్చు. అయితే అందుబాటులో ఉండే సమయాన్ని బట్టి నాలుగు సెషన్లను రెండు నుంచి ఐదు పనిదినాల్లో వేర్వేరు సెషన్లుగాను లేదా వారానికి ఒక సెషన్ వంతున నాలుగు వారాల పాటు కూడా విభజించి నిర్వహించవచ్చు. 90 నిముషాల సెషన్‌లో 60 నిముషాలు కంటెంట్ వివరించేందుకు, 30 నిముషాలు గ్రూప్ సంభాషణ లేదా చర్చకు విభజించవచ్చు. సమయాన్ని బట్టి ఒక్కో సెక్షన్‌పై రెండు రోజులు కేటాయించి 90 నిముషాలు కంటెంట్ బోధనకు, 90 నిముషాలు గ్రూప్ చర్చకు కూడా కేటాయించవచ్చు.

శిక్షణ సమయంలో కేస్‌స్టడీలను సమగ్రంగా అధ్యయనం చేయడం మంచిది. దీని వల్ల అధికారులు ఆయా కేస్‌స్టడీలున్న దేశాలకు చెందిన రిఫరెన్స్‌లను పరిశీలించి వాటిని తమ దేశంలోని పరిస్థితులకు అనుసంధానం చేసి ఆచరణీయం చేసే ప్రయత్నం చేయడానికి వీలు కలుగుతుంది.

### సెక్షన్ల వారీ బోధనకు డిజైన్

వయోజనుల శిక్షణకు సంబంధించిన అన్ని రకాల సిద్ధాంతాలను శిక్షకులు తప్పనిసరిగా బోధనలో పాటించాలి.

- వయోజనులు ఎలాంటి వత్తిడి, సమాచారం మితిమీరిందన్న భారం లేకుండా బోర్‌గా భావించకుండా ఏ విషయం అయినా నేర్చుకుంటారు.
- తాము నేర్చుకోవడానికి ఏది ప్రధానమో వయోజనులు చక్కగా తెలుసుకోగలరు.
- వయోజనులు ఏ రాతలూ లేని పలక మీద అక్షరాలు దిద్దే వారు కాదు. నేర్చుకుంటున్న అంశంలో విలువ, జీవితంతో అనుసంధానం ఉన్నదనిపించినప్పుడు మాత్రమే నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తారు.
- ఏ కొత్త సమాచారం అయినా తమ పాత అనుభవంతో బేరీజు వేసుకుంటారు. నేర్చుకుంటున్న అంశంపై వారిలో అప్పటికే ఒక అవగాహన ఉండి ఉంటుంది.
- వయోజనుల బోధనావసరాలు వారి జీవితంతో సన్నిహితమైన సంబంధం గలవై ఉంటాయి. సమస్యల పరిష్కారానికి వారు తమ జీవిత అనుభవాలను రంగరించి కొత్త అంశాలను అధ్యయనం చేస్తారు. అందుకే వారు తమకి అందించే సమాచారం ఏదైనా తక్షణం ఉపయోగపడేదిగా ఉండాలని కోరుకుంటారు.
- నేర్చుకునే అంశం సరళమైనదిగాను, ఉపయోగకరమైనది, ఆసక్తికరమైనదిగాను ఉండాలని కోరుకుంటారు. ఏది ఎందుకు నేర్చుకుంటున్నామని పరిశీలన చేసుకుంటారు.
- మరింత నేర్చుకోవడం ద్వారా తాము ఏదైనా సాధించామనే తృప్తిని వారు కోరుకుంటారు. కొత్తది ఏదైనా నేర్చుకోవడంలో తమకు గల సామర్థ్యంపై వారిలో ఆత్మవిశ్వాసం, నమ్మకం పెరగడానికి ఇది దోహదపడుతుంది.
- విషయ పరిజ్ఞానం గల ఒక వనరుగా వారు నిలవగలుగుతారు.

పైన పేర్కొన్న సిద్ధాంతాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఈ మాడ్యూల్‌కు రూపకల్పన జరిగింది. అందుకే శిక్షకులు శిక్షణ పొందుతున్న వారికి ఏదో ''బోధిస్తున్నట్టు''గా కాకుండా ''తమతో సమానమైన వారితో చర్చిస్తున్నట్టు''గానే పాఠ్యాంశాలను బోధించాలి.

ఒక రోజు వర్క్‌షాప్‌లో 90 నిముషాల సెషన్లను ఈ దిగువ విధంగా విభజించవచ్చు.

**సెషన్ 1** : మాడ్యూల్‌ను, దాని లక్ష్యాలను, బోధనానంతర ఫలితాన్ని పరిచయం చేయాలి. ఆ తర్వాత లింగసమానత్వ అంశాలను వివరించి ఎస్‌డిజిలు, ఐసిటిలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోణం నుంచి వాటిపై చర్చించాలి.

**సెషన్ 2** : లింగసమానత్వ భావనను, దానికి సంబంధించిన దశలను పరిశీలించి వాస్తవ పరిస్థితిని విశ్లేషించి సరైన ప్రణాళిక రూపొందించడం ఎలాగో చర్చించాలి.

**సెషన్ 3** : మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ చేయవలసిందేమిటి అన్న అంశం ఆధారంగా పరిస్థితి విశ్లేషణ కొనసాగించాలి.

**సెక్షన్ 4** : విధాన రూపకల్పన, ఆచరణ గురించి చర్చించి అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి ( ఈ దిగువ వివరించడం జరిగింది).

సమాజంలో మహిళలు, పురుషుల హోదాకు సంబంధించిన అంశాలన్నింటి మీద సామాజిక ప్రక్రియలో భాగంగా ముందుగానే మనలో కొన్ని అభిప్రాయాలు, ధోరణులు ఏర్పడి ఉంటాయి గనుక ''లింగభేదం'', ''లింగవ్యత్యాసం''పై సాధారణ చర్చతో శిక్షణాశిబిరం ప్రారంభించడం మంచిది. ఆ అంశంలో ఉన్న కాఠిన్యాన్ని తొలగించేందుకు లింగసమానత్వానికి సంబంధించిన ఒకటి లేదా రెండు అభ్యాసాలను కూడా సిద్ధం చేసి రంగంలోకి దిగడం మంచిది. లింగసమానతకు సంబంధించిన అంశాలు సునిశితమైనవి, కొన్ని సందర్భాల్లో కోపతాపాలకు తావిచ్చేవిగా ఉంటాయి గనుక వాటిని ఎంతో చాకచక్యంగా సంఘర్షణలు చెలరేగని రీతిలో నిర్వహించాలి. భిన్న దేశాల్లో లింగసమానత్వంపై చర్చతో సెషన్ ప్రారంభించడం కూడా అవసరం.

ఈ మాడ్యూల్‌లో చర్చిస్తున్న భావనలపై శిక్షణ పొందుతున్న వారికి పూర్తి అవగాహన ఉండే అవకాశం లేకపోవడం వల్ల మహిళల కోసం లింగవివక్షకు తావు లేని సమానత్వంతో కూడిన విధాన రూపకల్పన అనేది అత్యంత సంక్లిష్టమైనది. దీన్ని తొలగించేందుకు విధానాల్లో లింగసమానత్వం అమలుపరిచిన దేశాలకు చెందిన ఒక ఉపన్యాసకుణ్ణి ఆహ్వానించడం కూడా మంచిది. అన్ని సందర్భాల్లోనూ  ఇది సాధ్యం కాకపోవచ్చు గనుక శిక్షకులు ఆ అంశంపై లోతైన అధ్యయనం చేసి తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం కూడా తప్పనిసరి.

ఇక గ్రూప్‌లో బృంద చర్చలకు అవకాశం కల్పించేందుకు ''అభ్యాసం చేయాల్సిన అంశాలు'' అనే అంశాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. కాన్సెప్ట్‌ను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఈ అభ్యాసాలు ఉపయోగపడతాయి. 4.1.1 సెక్షన్‌లోని ఈ అభ్యాసాలకు సమాధానాలు కూడా చాలా తేలిక. వ్యక్తికి లింగసమానతపై కొద్దిపాటి అవగాహన ఉన్నా వారి పని తేలికే అవుతుంది.

ఇంక లింగసమానత్వంతో కూడిన విధానం రూపకల్పన, అమలు ప్రణాళిక, అందులో పొందుపరచాల్సిన అంశాల గురించి సెక్షన్ 5లో ప్రస్తావించడం జరిగింది.

చిట్టచివరిగా కార్యాచరణ ప్రణాళికతో శిక్షకులు ఈ సెషన్‌ను ముగించవచ్చు. కార్యాచరణ ప్రణాళిక ఎలా ఉండాలి అనేది దిగువన పొందుపరచడం జరిగింది.

శిక్షకులు ప్రతీ ఒక్క అంశాన్ని దేశీయ స్థితిగతులతో మిళితం చేసి మాడ్యూల్‌లోని అంశాలు మరింత సజీవంగా ఉండేందుకు కృషి చేయవచ్చు. అందుబాటులో ఉన్న అన్ని అంశాలతో ఈ మాడ్యూల్ సుసంపన్నంగా ఉండేందుకు రచయిత తగు చర్యలు తీసుకున్నారు.  దాన్ని స్థానిక అంశాలపై గల పరిజ్ఞానం, స్థానిక కేస్ స్టడీలు, ఉదాహరణలతో మిళితం చేయడం వల్ల మరింత ఆకర్షణీయం అవుతుంది. శిక్షణ కూడా కొత్త అనుభూతిని అందిస్తుంది. మాడ్యూల్‌లో పొందుపరిచిన ఉదాహరణల స్థానంలో తమకు తెలిసిన, తమ పరిశీలనకు వచ్చిన స్థానిక కేస్‌స్టడీలు, అనుభవాలను

పొందుపరిచే స్వేచ్ఛ శిక్షకులకు ఉంటుంది. అలాగే మాడ్యూల్‌లోని సెక్షన్లన్నింటినీ అదే క్రమంలో బోధించాలన్న నిర్బంధం కూడా ఏదీ లేదు. శిక్షకులు తమ ప్రాధాన్యతా క్రమంలో ఆయా సెక్షన్లను మార్చుకోవచ్చు. కాని ఒక దానితో మరొకదానికి సంబంధం లేదనే అభిప్రాయం లేకుండా చూసుకోవడం అవసరం.

### కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ సొంత కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి ఆవిష్కరించడానికి కృషి చేయాలి. ఈ కార్యాచరణ ప్రణాళికలు విడివిడిగాను, బృందాలవారీగాను కూడా రూపొందించవచ్చు. సమాజం లేదా దేశం లేదా ప్రభుత్వం లేదా సంస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళను గుర్తించి వాటికి ప్రత్యామ్నాయాలు, పరిష్కారాలు కూడా ఈ కార్యాచరణ ప్రణాళికల్లో సవివరంగా చర్చించాలి. అలాగే శిక్షణకు వచ్చే వారు అక్కడకు రావడానికి ముందే తమ దేశంలో మహిళా సాధికారత, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఐసిటిల వినియోగంపై తగినంత సమాచారం సమీకరించడం వల్ల వారు రూపొందించే కార్యాచరణ ప్రణాళిక ఆచరణీయంగా కనిపిస్తుంది. ఇలా చేయడం వల్ల ఆచరణీయమైన, పరిష్కారసాధ్యమైన కార్యాచరణ ప్రణాళికలు తయారవుతాయి.

### కార్యాచరణ ప్రణాళిక సమర్పణ

కార్యాచరణ రూపకల్పన కోసం మూడు గంటల సమయాన్ని కేటాయించాలి. శిక్షణలో పాల్గొంటున్న వారందరూ కార్యాచరణ ప్రణాళికలు సమర్పించిన తర్వాత వాటిపై బహిరంగ చర్చకు అవకాశం కల్పించాలి. ఈ మాడ్యూల్ రచయిత, యుఎన్-ఎపిసిఐసిటి రీసోర్స్ పర్సన్స్, స్థానిక శిక్షకులను ఈ చర్చ నిర్వాహకులు, కామెంటేటర్లుగా వ్యవహరించవచ్చు.

### రచయిత గురించి...

ఉషారాణి వ్యాసులురెడ్డి హైదరాబాద్‌కు చెందిన ఐసిటి కన్సల్టెంట్. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజిలో ఎడ్యుకేషన్ విభాగం మాజీ ప్రొఫెసర్, మానవాభివృద్ధి కేంద్రం డైరెక్టర్. 1998 నుంచి 2006 సంవత్సరాల మధ్య కాలంలో ఆమె న్యూఢిల్లీలోని కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ డైరెక్టర్‌గా పని చేశారు. కామన్వెల్త్ దేశాలు, ఆసియా దేశాలకు నియత, అనియత విద్యావిభాగంలో ఐసిటిల వినియోగంపై సాంకేతిక సహాయం అందించడం ఉద్యోగంలో ఆమె నిర్వహించిన బాధ్యత. 1998 వరకు ఆమె ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆడియో విజువల్ పరిశోధన విభాగం డైరెక్టర్‌గా పని చేశారు. విద్య, అంతర్జాతీయ అంశాలపై పలు గ్రంథాలు రచించారు.

**UN-APCICT/ESCAP**
United Nations Asian and Pacific Training Centre for Information
and Communication Technology for Development
5th Floor G-Tower, 175 Art center daero,
Yeonsu-gu, Incheon City, Republic of Korea

www.unapcict.org